ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-10-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 257 పేజీలు: 10+4 వెల: 6.50

బీహార్‌లో మళ్లీ గెలుస్తాం: అమిత్‌షా
అమెరికాలో మిన్నంటిన దీపావళి వేడుకలు 5

# బిసి బంద్ నేడే

అన్ని రాజకీయ పార్టీల సంపూర్ణ మద్దతు

అధికారంలో ఉన్నా బంద్‌లో పాల్గొంటున్నాం: పిసిసి చీఫ్ మహేష్

బిసి జెఎసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

42 శాతం రిజర్వేషన్ల కోసం గర్జించిన బిసి సంఘాలు



శుక్రవారం హైదరాబాద్‌లో బిసి జెఎసి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన దృశ్యం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు17:** బిసి బంద్‌కు సర్వం సిద్ధమైంది. బిసి రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ బిసి జెఎసి పిలుపునిచ్చింది. విద్యా, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని జెఎసి కోరింది. ఆర్టీసి బస్సులు నడపకుండా బిసి బంద్‌కు సహకరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బిసి సెగ తాకాలని బిసి జెఎసి అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిజెపి నుంచి రాజ్యసభకు నామినేట్ అయిన ఆర్.కృష్ణయ్య బంద్‌కు పిలుపునిచ్చినప్పటికీ బిజెపితో సహా అన్ని పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. బిసి రిజర్వేషన్ కోసం ఉద్యమిస్తున్న వారు ఆయన వెంట నడుస్తున్నారు. పార్టీల కతీతంగా అందరూ బిసి బాట పట్టారు.బీసి సంఘాలు నిర్వహించతలపెట్టిన బిసి బంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

>>2



మీడియాతో ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్

## వనం వీడి జనంలోకి..

మావోయిస్టు అగ్రనేత ఆశన్న సహా

# 218 మంది లొంగుబాటు



శుక్రవారం లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత ఆశన్న

లొంగిపోయినవారికి మూడేళ్లపాటు ఆర్థిక సాయం: ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్

జనజీవనంలోకి వచ్చిన వారికి సహకరిస్తాం: హోంమంత్రి విజయ్‌శర్మ



శుక్రవారం జగ్దల్‌పూర్‌లో ఆయుధాలు వదిలి లొంగిపోయిన మావోయిస్టులు

ఆయుధాలు వీడినా ఉద్యమ పంథా మారదు

లొంగిపోయే వారు నాకు ఫోన్ చేస్తే సహకరిస్తా: ఆశన్న

**చర్ల, అక్టోబరు17, ప్రభాతవార్త:** వనం వీడి జనంలోకి వచ్చిన మావో యిస్టు అగ్రనేత తక్కెళ్లపల్లి వాసుదేవరావు (ఆశన్న) రూపేస్ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యులు రాజమన్, రనిత, బాస్కర్, మీనా ప్రసాద్‌తో సహ వివిధ కేడర్లకు చెందిన 218 మావోయిస్టులు ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి అరుణ్ సావో, హోం మంత్రి విజయ్ శర్మ, డిజిపి అరుణ్ దేవ్ గౌతమ్ సమక్షంలో శుక్రవారం లొంగిపోయారు. బీజాపూర్ కాంకేర్‌లో ఆయుధాలతో లొంగిపోయిన వారందరినీమూడు ప్రత్యేక బస్సుల్లో జగ్దల్‌పూర్ తరలించారు. ఆశన్నకు ప్రత్యేక వాహనం సమకూర్చారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో

>>2



రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న డా. గౌరవ్ ఉప్పల్

## పిఎం జన్‌మన్‌లో తెలంగాణ నం.3

అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు17:** ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ రాష్ట్రం ఉత్తమ ప్రతిభ కనబర్చి.. అవార్డులు సాధించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సెక్రెటరీ కోఆర్డినేషన్ డా. గౌరవ్ ఉప్పల్ అవార్డులను స్వీకరించారు. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆది కర్మయోగి జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి జన్‌మన్, ఆది కర్మయోగి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మండలాలు,

>>2

## సింగరేణి కార్మికులకు నేడే బోనస్ పంపిణి

ఒక్కో కార్మికునికి రూ. 1.3 లక్షలు: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** సింగరేణి కార్మికులకు దీపావళికి బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ (పిఎల్ఆర్) స్కీం బోనస్ కింద ఒక్కొక్క కార్మికునికి రూ.1.03 లక్షల రూపాయల బోనస్ చెల్లింపునకు సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయూత అందిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీపావళి బోనస్‌గా 39,500 మంది సింగరేణి కార్మికులకు మొత్తం రూ.400 కోట్లను చెల్లించనున్నట్లు

>>2

## ప్రభుత్వ ఉద్యోగులకు షాక్! డిఎ లేనట్లే..

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కరువు భత్యం (డిఎ) పెంచుతుండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రం అటువంటి ప్రతిపాదన ఏదీ లేనట్టు కనిపిస్తోంది. కరువు భత్యం పెంపుపై తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు భారీ షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు రెండు రాష్ట్ర ప్రభుత్వాలతో తాడో పేడో తెచ్చేకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలియవచ్చింది. కేంద్రం ప్రకటించిన డిఎ పెంపుతో దేశ వ్యాప్తంగా ఉద్యోగులు ఆనందంలో మునిగారు. తదుపరి దేశంలోని దాదాపు పదిరాష్ట్రాలు కరువు భత్యం ప్రకటించాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాలు తమ

>>2

కార్పొరేట్ తరహాలో

# సర్కారు బడులు

పైలట్ ప్రాజెక్టుగా నర్సరీనుంచి 4వ తరగతి దాకా కొత్త స్కూళ్లు

తొలిదశలో ఒఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ రీజియన్‌పై దృష్టి

విద్యాశాఖ ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ సమీక్ష



శుక్రవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష జరుపుతున్న సిఎం రేవంత్. చిత్రంలో కెకె తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు17:** ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల తరహాలో తీర్చిదిద్దాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. స్కూళ్లలో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తొలిదశలో ఓఆర్ఆర్ లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. సరైన సౌకర్యాలు లేని స్కూళ్లను దగ్గర్లోని ప్రభుత్వ స్థలాలకు తరలించాలని చెప్పారు. నర్సరీనుంచి 4వ తరగతి వరకు నూతన స్కూల్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం విద్యాశాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సమీక్ష చేశారు. ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, ఉన్నతా

>>2



# ఎన్నికలెప్పుడు?

'స్థానికం'పై ప్రభుత్వాన్ని, ఇసిని ప్రశ్నించిన హైకోర్టు

బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి లేఖ రాశామన్న రాష్ట్ర ఎన్నికల సంఘం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు17:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక ఎన్నికలపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ (ఎస్ఇసి) చర్చించి చెప్పాలని స్పష్టంచేసింది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లుపెంచుతూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హైకోర్టు కొట్టివేయడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ శుక్రవారం విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది.
ఎన్నికలు పెట్టుకోవచ్చని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరఫు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బిసి రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్నిసస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందనిపేర్కొన్నారు. ప్రభుత్వం రిజర్వేషన్లను మరోసారి ఖరారు చేయాల్సి ఉందని, ఈమేరకు ప్రభుత్వానికి

>>2

## చేయి దాటిన పసిడి



రూ. 1.35 లక్షలు పైనే

కిలో వెండి రూ. 2.03 లక్షలు

## బులియన్ మార్కెట్‌పై ధన్‌తేరాస్ ఎఫెక్ట్

**ముంబయి, అక్టోబరు17:** దేశవ్యాప్తంగా బంగారం ధరల్లో ఎక్కడా తగ్గుముఖం కనిపించడంలేదు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 కేరట్ల బంగారం 1.35 లక్షలు దాటింది. శుక్రవారం పదిగ్రాముల మేలిమి బంగారంధర రూ.1,35,250కిచేరింది. 22 కార్యట్ల ఆభరణాల బంగారం పదిగ్రాములు 1,21,725కి పెరిగింది. కిలో వెండి రూ.1.81 లక్షలకు పెరిగింది.అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి యుఎస్ చైనా వాణిజ్య ఉద్రిక్తతలు, ఇండో అమెరికా వాణిజ్య ఒప్పందంలో జాప్యం, భౌగోళిక ఉద్రిక్తతలు, వంటివాటికితోడు ధంతేరస్, పెళ్లిళ్ల సీజన్

>>2

## లిక్కర్ షాపులు దరఖాస్తులకూ సిండికేట్!

ఇప్పటిదాకా 50 వేలు పైనే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు17:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం షాపుల కోసం ప్రభుత్వం టెండర్లకు ఆహ్వానించగా దరఖాస్తుల రుసుము చెల్లింపుల కోసం దరఖాస్తుదారులు సిండికేట్ అవుతున్నట్లు సమాచారం. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలనుంచి రూ.3లక్షలకు పెంచడంతో దరఖాస్తుదారులు సిండికేట్‌గా మారి దరఖాస్తులు తీసుకుంటున్నారని తెలుస్తోంది. కొనుగోలుదారులు పలు

>>2



నల్లగొండ, వరంగల్లు, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో విస్తృతంగా దాడులు

రూ. 40 కోట్ల కస్టమ్ మిల్లింగ్ ధాన్యం చీకటి బజారుపాలు

రూ. 29 కోట్ల ధాన్యం మాయం చేసిన మిల్లు ఓనర్

పెద్దపాపయ్యపల్లి వద్ద రూ. 6.6 కోట్ల ధాన్యం దారిమళ్లింపు

## రైస్ మిల్లులపై విజి'లెన్స్'

**హైదరాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త:** తెలంగాణలో విజిలెన్స్ అధికారులు విస్తృతంగా నల్లగొండ,వరంగల్, కరీంనగర్ ఉమ్మడిజిల్లాలలో పరిధిలో దాడులు రైస్‌మిల్లులు,మైనింగ్ అక్రమరవాణ వాహనాలపై దాడులు నిర్వహించి ఆయా శాఖల అధికారులకు వాటిని అప్పగించి కేసులు నమోదు చేయడానికి సిఫార్సులు చేశారు. రైసుమిల్లుల్లో జరిగిన ఆకస్మిక తనిఖీల్లో సుమారు రూ.40 కోట్లమేరకు కస్టమ్‌మిల్లు ధాన్యం మిల్లుల నిల్వ చేయకుండా చీకటి బజారుకు తరలించినట్ల అధికారులు గుర్తించారు, నల్లగొండ జిల్లా కెతెపల్లి మండలం, ఉప్పలపహడ్ గ్రామంలోని మెస్సర్స్ చాముండేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో, మిల్లర్ రబీ సీజన్ 2022-23కి సంబంధించిన 1,39, 671.86 క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యాన్ని దారిమళ్లించినట్లు గుర్తించారు. దారిమళ్లించిన ధాన్యం విలువ రూ. 28కోట్ల,88లక్షల ,41వేల,696 ఉంటుందని నిర్ధారించారు. మిల్లర్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ పౌర సరఫరాల శాఖకు ఒక అభ్యర్థన సమర్పించారు., వరంగల్ యూనిట్‌లోని విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్

>>2





శ్రీలంక ప్రధాని అమరసూర్య శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ దృశ్యం

# చేయి దాటిన పసిడి

>> వంటివి పసిడికి మరింతగా ధరలు పెంచాయి. వచ్చే ఏడాదినాటికి పదిగ్రాముల బంగారంధరలు రూ.1.50 లక్షలవరకూ ఉంటుందని బులియన్‌నిపుణులు అంచనాలువేస్తున్నారు. రానున్న కాలంలో 30శాతంవరకూ పెరిగే ప్రమాదం లేకపోలేదు. సెంట్రల్ బ్యాంకులు భారీగా బంగారం కొనుగోళ్లు, అమెరికా ఫడ్‌ఱిజర్వు రేట్‌కట్స్ అంచనాలు వంటివి బంగారం ధరలను అమాంతం పెంచేసాయి. ఎంసిఎక్స్‌లో గోల్డ్ పదిగ్రాములకు లక్ష దాటేసింది.
ఔన్స్ బంగారం అంతర్జాతీయ మార్కెట్‌లో 4180గా ఉంది. 2025లో సెంట్రల్ బ్యాంకులు సుమారు 1000కిపైగా టన్నులు బంగారంకొంటాయన్న అంచనాల నేపథ్యంలోబంగారం ధరలు మరింత పెరిగాయి. ఇటిఎఫ్‌ల్లో కూడా గోల్డ్ ఇటిఎఫ్‌లు రికార్డుస్థాయిలో ఉండటం ఇన్వెస్టర్ల ఆసక్తిని చూపిస్తోంది. గత ఏడాది లక్షలోపే ఉన్న పదిగ్రాముల బంగారం ఈఏడాది తొలినాళ్లనుంచి గణనీయంగాపెరుగుతూ వచ్చింది. 50శాతం వరకూ ధరలు పెరిగినట్లు బులియన్ నిపుణులుసైతం హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా వెండిధరలు కూడా హైదరాబాద్‌లో గణనీయంగాపెరిగాయి. కిలో వెండి మూడువేల రూపాయలు పెరిగి 2.03లక్షలకు చేరినట్లు అంచనా.



మహారాష్ట్రలో శుక్రవారం హెచ్ఎఎల్ నాసిక్ విభాగాన్ని ప్రారంభించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

# బిసి బంద్ నేడే

>> తెలిపారు. బిసి బంద్‌కు తమ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. బిసి బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటామని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. బిసిలకు రిజర్వేషన్ సాధన కోసం తెలంగాణ ఉద్యమం తరహా పోరాటం చేయాలని సిపిఎం పిలుపునిచ్చింది. బిసి రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటూ బిసి బంద్‌కు బిజెపి మద్దతు తెలపడం ద్వంద వైఖరికి నిదర్శనమని ఆ పార్టీ కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. నిషేధి మావోయిస్టు పార్టీ కూడా బిసి బంద్‌కు మద్దతు తెలుపుతూ ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి ఈనెల 14వ తేదీన బిసి బంద్ పాటించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల 18వ తేదీకి వాయిదా పడింది. చట్టసభల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కావాలని బిసి జెఎసి డిమాండ్ చేస్తుంది. బీసి జెఏస్ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బంద్‌కు మద్దతు కూడగట్టేందుకు అన్ని పార్టీ అగ్రనేతలను కలిశారు. అన్ని పార్టీల నేతలు బిసి బంద్‌కు మద్దతు ఇవ్వడంతో పాటు బంద్‌లో తమ నేతలు పాల్గొంటారని హామి ఇచ్చారు. బిసి రిజర్వేషన్ల కోసం రేపు తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించబోయే బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని మరోసారి చెప్పారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని అన్నారు. అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి బంద్‌లో పాల్గొంటున్నామని చెప్పారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనలో భాగంగా శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతుగా హైదరాబాద్‌లో బిసి ఐకాస ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. విద్యార్థులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పాల్గొన్నారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయని ఆయన తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు తమ పోరాటం ఆగదన్నారు. విద్యాసంస్థలు, బస్సులు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు. బంద్‌ను శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టిన బీజేపీ ఇప్పుడు బంద్‌లో పాల్గొంటోందని... అంటే బిసి రిజర్వేషన్ల బిల్లులు పాస్ చేసినట్లు భావించాలా..? అని ప్రశ్నించారు. అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిల్లులు పాస్ చేసి కేంద్ర ప్రభుత్వంపై కొట్లాడకుండా బిసి రిజర్వేషన్లపై ఉత్తుత్తి జీవో ఇచ్చిన కాంగ్రెస్ తామే ముందుండి బంద్ చేయిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని కవిత విమర్శించారు.

# నేడే బోనస్ పంపిణీ

>> తెలిపారు. సర్కార్ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీన కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించనున్నట్లు సంస్థ సిఎండి ఎన్.బలరామ్ పేర్కొన్నారు. ఇదే సమయంలో సింగరేణి నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాల సాధనకు మరింత అంకితభవంతో పనిచేయాలని కోరారు. ఈ దీపావళి బోనస్ కేవలం కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. అధికారులకు వర్తించదని స్పష్టం చేశారు. భూగర్భంలో 190 మస్టర్లు, ఓపెన్ కాస్ట్ గనులు మరియు సర్ఫేస్‌లో 240 మస్టర్లు పూర్తి చేసిన వారికి రూ 1.03 లక్షల పూర్తి బోనస్ అందుతుందని వివరించారు. అంతకంటే తక్కువ దినాలు పని చేసిన వారికి నిష్పత్తి ప్రకారం బోనస్‌ను చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 30 మస్టర్లు పూర్తి చేసిన వారు ఈ బోనస్ పొందడానికి అర్హులని బలరామ్ తెలిపారు.

# సర్కారు బడులు

>> ధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్లే గ్రౌండ్, అవసరమైన తరగతి గదులతో పాటు మంచి వాతావరణం ఉండేలా చూడాలన్నారు. ఇందుకు విద్యాశాఖ పరిధిలో ఉన్న స్థలాలను గుర్తించాలని చెప్పారు. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు నూతన స్కూల్స్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని, అక్కడ కార్పొరేట్ స్కూల్ స్థాయిలో అన్ని వసతులతో విద్యను అందించే ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులకు పాలు,బ్రేక్ ఫాస్ట్,లంచ్ అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. 2026 జూన్‌లో అకడమిక్ ఇయర్ నుంచి అమలు జరిగేలా యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్లాలని చెప్పారు. కాగా, రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 78 యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల కాంప్లెక్సులు నిర్మించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో కాంప్లెక్సుకు రూ.200 కోట్ల చొప్పున మొత్తంగా రూ.15,600కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. ఈ గురుకుల కాంప్లెక్సుల నిర్మాణానికి ఇప్పటికే ఆర్థికశాఖ పరిపాలనా పరమైన అనుమతులిచ్చేందుకుఅంగీకారం తెలిపింది.

# పిఎం జన్‌మన్‌లో తెలంగాణ నం.3

>> గ్రామ స్థాయి అధికారులను రాష్ట్రపతి సత్కరించారు.గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ జాతీయ స్థాయి సన్మాన కార్యక్రమం జరిగింది. గిరిజన సాధికారత కార్యక్రమాలు పిఎం–జేఎఎన్ఎంఎఎన్, ఆది కర్మయోగి అభియాన్, జనభాగిరధి, ధర్తి ఆబా జన్ భగీదరి అభియాన్ కింద ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మంత్రిత్వ శాఖలు, అధికారులకు భారత రాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు.ప్రధాన మంత్రి జన్జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్‌లో తెలంగాణ ఉత్తమ పనితీరు కనబరిచింది. జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. ముఖ్యంగా గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. మూడో స్థానంలో నిలిచింది. అలాగే.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ పి.విని సూపర్ కోచ్‌లు/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్‌లలో ఒకరిగా సత్కరించారు. బెస్ట్ పెర్ఫార్మర్స్ స్క్రీన్ డిస్‌ప్లే.. 1.ఆదికర్మయోగి అభియాన్ ఆదిలాబాద్, నల్గొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం 2.ఉత్తమ ప్రదర్శన సూపర్ కోచ్/రాష్ట్ర మాస్టర్ ట్రైనర్ డాక్టర్ కీర్తి 3.ధార్తీ అభా జనభాగిదారి అభియాన్ ఆదిలాబాద్, ఆసిఫాబాద్. ఈ కార్యక్రమంలో డా.గౌరవ్ ఉప్పల్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం,ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి పాటిల్, వెంకటేశ్ ధోత్రేలు, ఆదిలాబాద్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటిడిఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

# ఎన్నికలెప్పుడు?

>> లేఖ కూడా రాశామని, సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు చేపడతామని వివరించారు.ప్రభుత్వం నిర్ణయం చెప్పడానికి 3 వారాల సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి 2 వారాల గడువు ఇచ్చి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే.

# డిఎ లేనట్లే..

>> ఉద్యోగులకు డిఎ పెంచాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌తో పాటు, తెలంగాణ సైతం డిఎ పెంపుపై అస్సలు దృష్టి సారించలేదనే విమర్శలు ప్రభుత్వ ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. గురువారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో డీఏ ప్రకటనపై ప్రభుత్వ ఉద్యోగులు ఆశతో ఎదురు చూశారు. ఈ సమావేశంలో మంత్రి వర్గం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి చర్చ ఉంటుందని భావించారు. ఏడాదికి రెండు సార్లు డీఏ పెంచాల్సి ఉండగా, వాటిపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు దేశంలోనే అత్యధికంగా ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉంది. తాజాగా జూలై నెల కలిపితే మొత్తం ఆరు డీఏలు ఉద్యోగులకు ప్రకటించాలి. దసరా సందర్భంగా ఉద్యోగులకు డిఎ ఇస్తారని చర్చ జరగ్గా అలాంటి ప్రకటన ఏమీ రాలేదు. ఇప్పుడు దీపావళి పండుగ వస్తుండగా ఇప్పుడు కూడా డిఎ ఊసే లేదు. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన ఒక్క అంశం కూడా చర్చించలేదు. దీపావళి ముందు సమావేశమైన మంత్రివర్గం ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటుందని ఆశించారు. డిఓ పెంపు, పిఆర్సీ ప్రకటన, భారీగా బిల్లుల బకాయిలు వంటి ప్రధాన డిమాండ్లు ఉన్నాయి. వీటిపై ఇప్పటికే ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. వాటిని నెరవేరుస్తామని ప్రకటించిన ప్రభుత్వం కమిటీలు, చర్చలతో సరిపెట్టింది. గతంలో ఒక డీఏ మాత్రమే ప్రకటించగా, ఇప్పటివరకు ఐదు డీఏలు పేరుకుపోయాయి. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ వర్గాలకు వివిధ అంశాలపై హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 22 నెలలు దాటుతున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. చివరికి ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తామని చెప్పినా మాట కూడా అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు దీపావళికి కూడా డీఏ ప్రకటించకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

# బిసి జెఎసి బంద్‌కు ట్రస్మా మద్దతు

## ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 17:** తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిసి జేఏసి నేడు(శనివారం) జరపనున్న రాష్ట్ర బంద్‌కి రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మద్ధతు ప్రకటించాయి. బిసి సంఘాలు, బీసీ యువజన సంఘాలు, అన్ని రాజకీయ పార్టీల నుండి అందిన అభ్యర్థన మేరకు, బీసీ బంద్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందించిన మద్దతును పరిగణనలోకి తీసుకుని, ఈ కార్యక్రమానికి మద్దతుగా అక్టోబర్ 18న (శనివారం) తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివరాత్రి యాదగిరి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎన్ వెంకటేశ్వరరావు, ట్రెజరర్ ఎస్ జయసింహ గౌడ్ యాజమాన్యాలకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 11వేల వరకు ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి.

# 218 మంది లొంగుబాటు

>> మొదట లొంగిపోయిన మావోయిస్టులకు రాజ్యాంగ ప్రతిని గులాబి పువ్వును అందజేసారు.రాయ్‌పూర్ నుండి ప్రత్యేక హెలీకాప్టర్‌లో జగదల్‌పూర్‌కి వచ్చిన ముఖ్యమంత్రి సాయి సభా ప్రాంగనానికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా అక్కడ పండుగ వాతావరణం కన్పించింది. లొంగిపోయిన మావోయిస్టులు ఆయుధాలను అప్పగించారు. అనంతరం జరిగిన సభలో సి.ఎం సాయి మాట్లడారు. లొంగిపోయిన నక్సల్స్‌కు ప్రభుత్వం మూడేళ్ల పాటు ఆర్థికసాయం అందిస్తుందని వీరందరూ పునరావాస పాలసీకి సంబంధించి పూర్తి ప్రయోజనాలు పొందుతారని అన్నారు.నివాసం ఉండటానికి ఇళ్ల భూమి ఇస్తామన్నారు. బస్తర్ ప్రాంతం ఇప్పుడిప్పుడే మార్పు కనిపిస్తుందని కరెంట్, రేషన్ ప్రజలకు చేరుతుందని రహదారులు సైతం నిర్మిస్తున్నామని అన్నారు. బస్తర్ సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**నిర్ణిత సమయానికి లక్షాన్ని సాదిస్తాం.హోం మంత్రి విజయ్ శర్మ**

మార్చి 31,2026 నాటికి నక్సలిజాన్ని నిర్మూలించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా లక్ష్యంగా పెట్టుకున్నారని ఈ లక్షాన్ని నిర్ణీత సమయంలోపు సాధిస్తామని విజయ్ శర్మ అన్నారు.మాఢ్ డివిజన్ కమిటీ మొత్తం లొంగిపోయినట్లు తెలిపారు.ప్రభుత్వానికి కంటే సమాజం చాలా గొప్పదని నక్సలైట్లు గ్రహించారని అందుకే వారందరూ సమాజంలోనే లొంగిపోయే మార్గాన్ని ఎంచుకున్నారని వారందరికీ అభినందనలు తెలిపారు.

**అందరూ కలిసి సహారిస్తే బస్తర్ అభివృద్ధి : డిజిపి అరుణ్ గౌతమ్**

అటవి ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల కోసం పోరాడుతున్నారని నక్సల్స్ అనుకుంటున్నారని కాని వాస్తవానికి బస్తర్ ప్రజల కోసం పోరాటం లేదని నిజానికి వారికి హాని చేస్తున్నారని చత్తీస్ ఘడ్ డిజిపి అరుణ్ దేవ్ గౌతమ్ అన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి అభివృద్ధి కి నోచుకోని బస్తర్ ప్రాంతం జరగబోయే అభివృద్ధి కి వారందరూ కలిసి సహకరిస్తే అభివృద్ధి చెందుతుందని అన్నారు.కాగా లొంగిపోయిన వారిలో 208 మంది మావోయిస్టులు ఉండగా వీరిలో 110 మహిళలు 98 మంది పురుషులు ఉన్నారు.వీరిలో 153 మంది ఆయుధాలతో లొంగిపోయారు.ప్రభుత్వానికి అప్పగించిన ఆయుధాలలో 18, ఏకే47 (18) యూజీబీఎల్23 ఐఎన్ఎస్ఏఎస్17 ఎస్ఎల్ఆర్ 4, 303 రైఫిల్స్ 36 మరికొన్ని హ్యాండ్ గన్లు ఉన్నాయి. మఢ్ డివిజన్ నుండి 156 మంది లొంగిపొగా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ దళ సభ్యులు 50 మంది ఉన్నారు.

**ఆయుధాలే వీడాం, ఉద్యమ పందా మర్చుకోం : ఆశన్న**

అనవరసరంగా సహచరుల ప్రాణాలు పోతున్నాయనే ఆయుధాలు వీడి లొంగిపోతున్నామే తప్పా భయపడి కాదన్నారు. ఆయుధాలు వీడినంత మాత్రాన ఉద్యమ పంధాలో ఎటువంటి మార్పు ఉండదని మావోయిస్టు అగ్రనేత కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న లొంగిపొయే ఉందు మీడియా తన సుదీర్ఘ సందేశం ఇచ్చారు.ప్రస్తుత పరిస్థితిలో లొంగిపోవడమే సరైన మార్గమని లొంగిపొయే వారు ఉంటే తన వంతు సహాయక సహకారాలు అందిస్తానని మిగిలిన సహచరులకు సూచించారు.ఈ మేరకు ఓ ఫోన్‌నంబర్‌ను సైతం తెలిపారు.ఉద్యమ బాట వీడి జనజీవనంలోకి వచ్చిన ఆశన్న కోసం కుటుంబ సభ్యులు ఎప్పుడు వస్తున్నాడో అన్న ఆశక్తితో ఎదురుచూస్తున్నట్లు తెలిసింది.కాగా లొంగిపొయిన నక్సల్స్ ప్రభుత్వం తరుపున అందాల్సిన తక్షణ సహాయం అందజేసారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సావో బస్తర్ ఎంపి మహేష్ కశ్యప్ జగదల్ పూర్ ఎంఎల్ ఏ కిరణ్ దేవ్ చిత్రకూట్ ఎంఎల్ ఏ వినాయక్ గోయల్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోని పలు ఫారెక్స్ సంస్థల్లో ఇడి తనిఖీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు17:** హైదరాబాద్ నగరంలోని పలు ఫారెక్స్ సంస్థలపై శుక్రవారం ఇడి ఆధికారులు దాడులు నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి లైసెన్స్ లేకుండానే ఈ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయనే ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫారెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. గతంలో ఆర్బీఐ అధికారులు జరిపిన సోదాల్లో ఈ సంస్థల్లో అవకతవకలు వెలుగుచూడటంతో, ఇడి కూడా తనిఖీలు చేపట్టింది. ఆర్బీఐ అనుమతులు లేకుండా, బోగస్ పత్రాలతో ఈ సంస్థలు నిర్వహిస్తున్నట్లు సోదాల్లోతేలింది. కొన్ని ఫారెక్స్ సంస్థలు అక్రమంగా డబ్బు మార్పిడి వ్యాపారం చేస్తున్నట్లు ఇడి దర్యాప్తులో వెల్లడైంది. పలు సంస్థలు ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఇడి పేర్కొంది. ఈ దాడుల్లో నకిలీ పత్రాలు,ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లతోపాటు రూ.11.99లక్షల నగదు, రూ.26.77 లక్షల విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

# మిల్లులపై విజి'లెన్స్'

>> అధికారులు హానుమకొండ జిల్లా కమలాపూర్ వద్ద ఒక ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కమలాపూర్‌కు చెందిన తోడేటి రాజు అనే వ్యక్తి చుట్టుపక్కల గ్రామస్థుల నుండి సేకరించిన 100 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని వరంగల్ విజిలెన్స్ అధికారులు పట్టుకొన్నారు. వీటివిలువ రూ. 3,90,000 ఉంటుంది. బియ్యం నూకలుగా రూపాంతంచేసి ఎపి 36 ఎక్స్ 9537 అనే డిసిఎం వాహనంలో రవాణా చేస్తున్నాడని అధికారులు పేర్కొన్నారు. తదుపరి చర్యల కోసం రెస్పాండెంట్‌ను పిడిఎస్‌బియ్యం వాహనంతో పాటు డిటి(సిఎస్) కమలాపూర్‌కు అప్పగించారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పెద్దాపాపయ్యపల్లి గ్రామంలోని మెసర్స్ శ్రీ రవిచంద్ర ఇండస్ట్రీస్ వద్ద ఆకస్మిక దాడులు నిర్వహించారు. మిల్లర్ రబీ 2022-23, 2024-25 సీజన్‌లకు సంబంధించిన 32207.8 క్వింటాళ్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) స్టాక్‌లను, రూ. 6.68 కోట్లు విలువైన దాన్ని దారి మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. మిల్లర్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ పౌర సరఫరాల శాఖకు ఒక అభ్యర్థన చేశారు.కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ మండలం, బోర్నపల్లి గ్రామంలోని విజయ కృష్ణ మోడరన్ రైస్ మిల్లుపై ఆకస్మిక దాడి నిర్వహించి, రైస్ మిల్లు యజమాని (లీజ్ హోల్డర్) వేముల మనోహర్ వద్ద పిడిఎస్ బియ్యం స్వాధీనం చేసుకొన్నారు శంకరపట్నం మండలం లింగాపూర్‌కు చెందిన పద్మశాలి వేముల మనోహర్ నుండి రూ. 8,34,400/ విలువైన 238.40 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండలం, పంగిడిపల్లి గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి నుండి మనోహర్ కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. మిల్లర్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ పౌర సరఫరాల శాఖకు ఒక అభ్యర్థన ఇవ్వబడింది.విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నల్గొండ యూనిట్ ద్వారా ఆకస్మిక మార్గ తనిఖీ శుక్రవారం తెల్లవారుజామున చేశారు. నల్గొండ యూనిట్ అధికారులు గనులు, వాణిజ్య పన్నులుశాఖ ఆర్‌టిఏ శాఖల అధికారులతో కలిసి యాదాద్రిభోంగిర్ జిల్లాలోని చౌటుప్పల్ టోల్ గేట్ మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో ఆకస్మిక మార్గ తనిఖీ నిర్వహించి, వాహనాలను అడ్డగించి 11 కేసులను మోటారు వాహనాల చట్టం కింద, (2) కేసులను గనుల చట్టం కింద, (2) కేసులను జీఎస్టీ చట్టం కింద నమోదు చేశారు. మొత్తం విధించిన పన్ను సుమారు రూ. 4,45,518/ జరిపమానా విధించారు.

# వారం - వర్జ్యం

18-10-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
ద్వాదశి మ.12.21
పూర్వఫల్గుణి మ.3.44
వర్జ్యం : రా.11.34-1.18
దు.ఉ.6.01-7.34
రాహుకాలం - ఉ.9.00-10.30

# వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**వృషభం :** చర్చాగోష్టులలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మిథునం:** స్త్రీతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం :** ఆస్తి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**సింహం:** ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు పొందుతారు. వస్తు లాభం.

**కన్య :** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** ఋణబాధల నుండి విముక్తిని పొందుతారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**వృశ్చికం:** దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. స్పెక్యులేషన్ లాభించదు.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన విభేదాలు తొలుగుతాయి. వాహన యోగం.

**మకరం:**మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. గృహం కొనుగోలుచేస్తారు.

**కుంభం:** పూర్తిగా ఆశలు వదులుకున్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు.

**మీనం :** వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రూ.2.72కోట్లు రిఫండ్ చేయించిన వినియోగదారుల హెల్ప్‌లైన్

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** వినియోగదారుల హక్కుల పరిరక్షణలో జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సిహెచ్) ముఖ్యభూమిక పోషిస్తోంది. దేశవ్యాప్తంగా వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ, వారికి కోట్లాది రూపాయలు వాపసు ఇప్పించడంలో సక్సెస్ అవుతోంది. కేవలం ఈ ఏడాది జులై నెలలోనే 7,256 ఫిర్యాదులను పరిష్కరించి, బాధితులకు ఏకంగా రూ.2.72 కోట్లను రిఫండ్ చేయించడం విశేషం. ఏప్రిల్ నెలలో ఈ మొత్తం కేవలం రూ.62 లక్షలుగా ఉండగా, కొద్ది కాలంలోనే రిఫండ్ల విలువ భారీగా పెరిగింది. అధికారిక గణాంకాల ప్రకారం, జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌పై ప్రజల్లో నమ్మకం గణనీయంగా పెరుగుతోంది. 2017లో నెలకు సగటున 37,062గా ఉన్న ఫిర్యాదుల సంఖ్య, 2025 నాటికి 1,70,585కి చేరింది. ప్రస్తుతం నెలకు లక్షకు పైగా ఫిర్యాదులు నమోదవుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ మాధ్యమాల రాకతో ఫిర్యాదుల ప్రక్రియ మరింత సులభతరమైంది. మొత్తం ఫిర్యాదుల్లో దాదాపు 65 శాతం ఆన్‌లైన్ ద్వారానే వస్తున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసే వారి సంఖ్య మార్చి 2023లో 3 శాతంగా ఉండగా, మార్చి 2025 నాటికి 20 శాతానికి పెరిగింది. జులై నెలలో అత్యధికంగా ఈకామర్స్ రంగానికి సంబంధించి 3,594 ఫిర్యాదులు పరిష్కారమవగా, వినియోగదారులకు రూ.1.34 కోట్లు వాపసు లభించింది. ఆ తర్వాత పర్యాటక రంగంలో రూ.31 లక్షల రీఫండ్ జరిగింది. ఇది మాత్రమే కాకుండా, కోచింగ్ సెంటర్ల చేతిలో మోసపోయిన విద్యార్థులకు కూడా ఎన్‌సీహెచ్ అండగా నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి 600 మందికి పైగా విద్యార్థులకు కోచింగ్ సెంటర్ల నుంచి రూ.1.56 కోట్లకు పైగా డబ్బును వాపసు ఇప్పించింది. సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు వివిధ కంపెనీలతో హెల్ప్‌లైన్ భాగస్వామ్యం పెంచుకుంటోంది. 2017లో కేవలం 263గా ఉన్న కన్వర్జెన్స్ భాగస్వాముల సంఖ్య, 2025 సెప్టెంబర్ నాటికి 1,142కి చేరింది.

# దరఖాస్తులకూ సిండికేట్!

>> వురు అంతర్గత సిండికేట్‌గా ఏర్పడి రుసుమును రూ.3లక్షల వరకు జమ చేసుకొని ఎవరో ఒక్కరి పేరు మీద దరఖాస్తు చేస్తున్నట్లు సమాచారం. మద్యం షాపు దక్కినా దక్కకపోయినా రుసుము రిఫండ్ కానందున ఎక్కువ మంది చొప్పున సిండికేట్‌గా ఏర్పడి ఎవరో ఒకరి పేరు మీద దరఖాస్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. మద్యం షాపు దక్కిన వారు మద్యంషాపు దక్కని మిగితా సిండికేట్ సభ్యులకు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించే విధంగా అంతర్గత ఒప్పందాలు చేసుకుంటున్నారని సమాచారం.కాగా, దరఖాస్తుల స్వీకరణకు శనివారం చివరి రోజు కావడంతో ఆశావహులు నిర్ణీత సమయంలోపు దరఖాస్తులను సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రకటించారు. లిక్కర్ షాప్స్‌కు శుక్రవారం రికార్డు స్థాయిలో అప్లికేషన్స్ వచ్చాయని ఎక్సైజ్ శాఖ తెలిపింది. శుక్రవారం ఒక్కరోజే 23వేల దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు మొత్తం 50వేలు దాటాయని పేర్కొంది. శనివారం చివరి రోజు కావడంతో మరో 50వేల దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తోంది. దరఖాస్తు రుసుము రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడం వల్లే మద్యం షాపుల టెండర్లకు గతంలో లాగా స్పందన రావడం లేదు. ఎక్సైజ్ అధికారులు టెండర్లలో పాల్గొనేందుకు దరఖాస్తుదారులను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. రుసుము పెంచడంపై కొందరు హైకోర్టును కూడా ఆశ్రయించారు. అయితే టెండర్ల రుసుముపై హైకోర్టు జోక్యం చేసుకోమని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఓ వైపు దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగుస్తుండటం.. మరోవైపు బిసి జెఏసి రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆశావహుల్లో గందరగోళం నెలకొంది. దరఖాస్తులు దాఖలు చేయాలంటే బ్యాంకులలో డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) తీయడం తప్పనిసరి. దీంతో ఆదివారం వరకు దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పెద్ద ఎత్తున వస్తున్న ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి స్పందన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

# దీపావళి రద్దీకి విమాన సంస్థల బంపర్ ఆఫర్లు!

**ముంబయి, అక్టోబరు 17:** దీపావళి పండగ సీజన్ సమీపిస్తుండటంతో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరుగుతోంది. సొంతూళ్లకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లేవారి సంఖ్య అధికమవడంతో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు విమానయాన సంస్థలు పోటీ పడి ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. టికెట్లపై భారీ డిస్కౌంట్లు, అదనపు సర్వీసులతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ దీపావళి సందర్భంగా ప్రయాణికుల కోసం పలు ఆఫర్లను ప్రకటించింది. విమాన టికెట్లపై 20 శాతం వరకు తగ్గింపు అందిస్తోంది. అంతేకాకుండా, ఎంపిక చేసిన సీట్లపై 30 శాతం, అదనపు లగేజీపై 10 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు వెల్లడించింది. అక్టోబర్ 31 వరకు విమానాల్లో ప్రత్యేక దీపావళి భోజనాన్ని కూడా అందిస్తుండటం విశేషం. మరోవైపు, ఇండిగో కూడా ఆకర్షణీయమైన ఆఫర్లతో ముందుకొచ్చింది. దీని కింద దేశీయ ప్రయాణాలకు టికెట్ ధరలు రూ.2,390 నుంచి, అంతర్జాతీయ ప్రయాణాలకు రూ.8,990 నుంచి ప్రారంభమవుతాయని తెలిపింది.

# ప్రజాస్వామ్య మనుగడలో పోలీసు వ్యవస్థ కీలకపాత్ర

## సైబర్ నేరాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

### ఐపిఎస్‌ల దీక్షాంత్ పెరేడ్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఎస్‌ఎఫ్ డిజి దల్జీత్‌సింగ్ చౌదరి



జాతీయ పోలీసు అకాడెమిలో శుక్రవారం జరిగిన 77వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారుల దీక్షాంత్ పెరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న బిఎస్‌ఎఫ్ డిజి దల్జీత్‌సింగ్ చౌదరి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య మనుగడలో పోలీసు వ్యవస్థది కీలకపాత్ర అని బిఎస్‌ఎఫ్ డిజి దల్జీత్‌సింగ్ చౌదరి అన్నారు. దేశంలో అన్ని వర్గాలకు సవాల్‌గా మారిన సైబర్‌నేరాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని యువ ఐపిఎస్‌లను ఆయన కోరారు. నగర శివార్లలోని శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ భాయిపటేల్ జాతీయ పోలీసు అకాడమిలో శుక్రవారం జరిగిన 77వ బ్యాచ్ ఐపిఎస్ ప్రొబేషనరీ అధికారుల దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి వారి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, ఉగ్రవాదులు, తీవ్రవాదుల పీచమణచడంలో పోలీసుల పాత్ర ఎనలేనిదని, సాంకేతిక నేరాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థ మరింతగా మెరుగుపడాలని, ఈ విషయంలో టెక్నాలజిని వాడాలని ఆయన తెలిపారు.

దేశం అత్యున్నతంగా ఉండేందుకు ఐపిఎస్‌లు పాటుపడాలని ఆయన కోరారు. సామాన్యులు, పీడిత ప్రజల అభ్యున్నతి వారి భద్రత కోసం ఐపిఎస్‌లు మరింత నిబద్ధతతో కృషి చేయాలని ఆయన సూచించారు. సైబర్ నేరాల నివారణలో టెక్నాలజీని మరింత వాడుకోవాలని, నేరగాళ్ల పీచమణి చేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. నక్సలిజం, టెర్రరిజాన్ని అంతమొందించడంలో ఐపిఎస్ అధికారులు ఇప్పటికే సుశిక్షితులయ్యారని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని ఆయన సూచించారు. పోలీసింగ్ అంటే ఒక వృత్తి కాదని, త్యాగం, సేవలకు గుర్తింపు అని ఆయన అన్నారు. యువ ఐపిఎస్‌ల ముందు ఎన్నో కఠిన సవాళ్లు వున్నాయని, వీటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో పోలీసింగ్ స్మార్ట్ పోలీసింగ్‌గా వుండాలని, సున్నితమైనదిగా వుండాలని, ప్రజల మనస్సులను గెలిచేలా వుండాలని బిఎస్‌ఎఫ్ డిజి తెలిపారు. నక్సల్స్ విషయంలో దేశ వ్యాప్తంగా పోలీసు శాఖ ఇటీవల కాలంలో మంచి ఫలితాలను సాధించడంపై ఆయన సంతృప్తి చెందారు. దేశంలో వ్యవస్థీకృత నేరాలు పోలీసులకు సవాళ్లు విసురుతున్నాయని, వీటి నివారణలో పోలీసులు మరింత రాటుదేలాల్సిన అవసరం వుందని ఆయన తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందిగా మారిన పలు రకాల నేరాల విషయంలో మరింత పరిణతి సాధించాలని ఆయన కోరారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్ విషయంలో పోలీసులు మరింతగా పురోగతి సాధించాల్సిన అవసరం వుందని, డ్రగ్స్‌ను సమూలంగా అంతం చేయాలని ఆయన తెలిపారు న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా క్రిమినల్ జస్టిస్ విషయంలో ఐపిఎస్‌లు పట్టు సాధించాలని, దేశాన్ని ఐక్యంగా వుంచేందుకు నాడు సర్దార్ వల్లభభాయిపటేల్ తొలి కేంద్ర హోంమంత్రిగా చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తుతించారు. అప్పట్లో సర్దార్ పటేల్ చేసిన అవిరళ కృషి వల్లే నేడు భారత దేశం ఉన్నతంగా వుందని ఆయన కొనియాడారు. 190 మంది అధికారులు పాల్గొన్న ఈ దీక్షాంత్ పరేడ్‌లో 174 మంది ఐపిఎస్ అధికారులు కాగా 16 మంది విదేశీ అధికారులున్నారు. వీరిలో 62 మంది మహిళలు వున్నారు. దీక్షాంత్ పరేడ్‌కు తమిళనాడు కేడర్‌కు చెందిన అంజిత్ నాయర్ నాయకత్వం వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో దల్జీద్ సింగ్ చౌదరి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన పరేడ్ కమాండర్ అంజిత్ నాయర్‌కు బెస్ట్ క్యాడర్ అవార్డుతో పాటు కత్తిని బహుకరించారు. ఆయనతోపాటు శిక్షణలో ప్రతిభ కనబరచిని మరి కొందరు ఐపిఎస్ అధికారులకు బిఎస్‌ఎఫ్ డిజి ట్రోపిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిజిపి శివధర్‌రెడ్డితో అకాడమి డైరక్టర్ అమిత్ గార్గ్ సహా సిబిఐ, ఐబి డైరక్టర్లు, త్రివిధ దళాలకు చెందిన అధిపతులు, విశ్రాంత పోలీసు, రక్షణ బలగాల అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు జరిగిన కార్యక్రమంలో ఐపిఎస్‌ల దీక్షాంత్ పెరేడ్ ఆహుతులను అలరించింది.

## మీ అబ్బాయికి ప్రమాదం జరిగిందంటూ రూ.35.23 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** కష్టపడి సంపాదించడం చేతగానీ కొందరు ఇతరుల సంపదను దోచుకుంటారు. గతంలో ఇళ్లల్లో, బ్యాంకుల్లో, షాపుల్లోకి వెళ్లి.. విలువైన వస్తువులను చోరీ చేసేవారు. అయితే నేటి కాలంలో దొంగతనాల తీరు మారింది. డిజిటల్ యుగం కావడంతో దొంగలు.. సైబర్ కేటుగాళ్ల అవతారం ఎత్తారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఏమాత్రం ఏమరపాటుగా



ఉన్నా మన అకౌంట్లను ఖాళీ చేస్తున్నారు. చదువుకున్న వాళ్లు, వృద్ధులు, మహిళలు, యువకులు ఇలా అన్ని వర్గాల వారిని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. 'మీ కొడుక్కి ప్రమాదం జరిగిందంటూ' తాజాగా ఓ మహిళ నుంచి లక్షల్లో డబ్బులను సైబర్ నేరగాళ్లు కాజేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. నగరంలో 61 ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉంటుంది. ఆమె కొడుకు లండన్ నగరంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తాజాగా స్టీవ్ అనే వ్యక్తి ఆ పెద్దావిడకు వాట్సాప్ కాల్ చేశాడు. తాను లండన్‌లో వైద్యుడిగా పని చేస్తున్నాను అంటూ పరిచయం చేసుకున్నాడు. లండన్ విమానాశ్రయంలో ఆమె కుమారుడికి ప్రమాదం జరిగిందని, తలకు బలమైన గాయమైందని సైబర్ నేరగాళ్లు చెప్పారు. అంతేకాక లగేజ్ మిస్ అవ్వడంతో ఎలాంటి ఐడెంటిటీ లేదని, ఆసుపత్రిలో వైద్యులు చేర్చుకోవట్లేదని చెప్పిన నేరగాళ్లు ఆమెను భయపెట్టారు. దీంతో ఎలాగైనా తన కుమారుడికి చికిత్స అందించాలని విడతల వారీగా రూ.35.23 లక్షలు ఆ వృద్ధురాలు ఆ కేటుగాళ్లకు పంపింది. తన కొడుకు ఎలా ఉన్నాడో చూసేందుకు ఫొటో, వీడియో పంపించాలని కోరగా.. కాల్ చేసిన వ్యక్తి అందుకు ఒప్పుకోలేదు. అనుమానం వచ్చిన బాధితురాలు కుమారుడి నెంబర్‌కు కాల్ చేసింది. తాను క్షేమంగా ఉన్నానని, ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బంద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

### డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బిసి జెఎసి శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను ఆయా సంఘాలు ప్రశాంతంగా నిర్వహించాలని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు. బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరిగినా చట్టప్రకారం పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు డిజిపి శివధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బంద్ సందర్భంగా పరిస్థితులను పోలీసులతోపాటు నిఘా బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. బంద్ నిర్వహించే వారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన కోరారు. సామాన్య ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## కాళేశ్వరం బ్యాక్‌వాటర్ బాధితులకు డిసెంబరులో పరిహారం: మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ బాధిత రైతులకు డిసెంబర్ 18 తర్వాత మొదటి విడత పరిహారం వారివారి ఖాతాల్లో జమ కానుందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ కారణంగా నష్టపోయిన రైతులు, గ్రామాల కోసం సంవత్సరాలుగా పోరాడినాని గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ఆయన ఆవేదన చెందారు. చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రస్తుత కార్మిక మరియు గనుల శాఖ మంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మరోసారి నా హామీని నిలబెట్టుకున్నాని చెప్పారు..ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి మండలానికి చెందిన రైతులకు రూ.10 కోట్ల పరిహారం మంజూరు చేయించానని వివరించారు.

## బిజెపి ఎన్ని మాటలు చెప్పినా బిసి హృదయాలను గెలుచుకోలేదు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** బిజెపి ఎన్ని మాటలు చెప్పినా బిసిల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీలో రెండు చట్టాలు చేయడానికి బిజెపి మద్దతు ఇచ్చినా గవర్నర్ వద్ద వాటిని పెండింగ్ లోపెట్టారని ఆరోపించారు. రిజర్వేషన్లపై వాదనలు హైకోర్టులో వినిపిస్తామని తెలిపారు. బంద్ ప్రజలను మేల్కొలపడానికి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బంద్ లో పాల్గొనాలి.. నేను కూడా బంద్‌లో పాల్గొంటాను.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కాంగ్రెస్ కట్టుబడి ఉంది. బిసి బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా బంద్‌లో పాల్గొంటున్నారు. బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు.. అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి బంద్‌లో పాల్గొంటున్నామని తెలిపారు.



అభివాదం తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య, వి.జి.ఆర్.నారగోని, గుజ్జ కృష్ణ తదితరులు

## బిసిల రాష్ట్ర బంద్‌కు మద్దతు తెలిపిన అన్ని పార్టీలు, కుల సంఘాలు

### జిఒ నం. 9పై స్టే అన్యాయం: బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 17, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల సాధన కోసం శనివారం నిర్వహించతలపెట్టిన బంద్‌కు అన్ని పార్టీలు, కుల సంఘాలు, బిసి సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాచయని బిసి జాక్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. ఈ బంద్‌లో అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు, వ్యాపార సంస్థలు స్వచ్ఛంద పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తాము బంద్‌ను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహిస్తున్నామన్నారు. 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వం కల్పిస్తూ జారీచేసిన జిఒపై హైకోర్టు స్టే ఇవ్వడం అన్యాయమన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత స్టే ఇవ్వడం సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమన్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌లను తాము వ్యతిరేకించలేదని, 50 శాతం సీలింగ్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేసిందని ఆయన స్పష్టం చేశారు.

**బిసిల బంద్‌కు మద్దతుగా ర్యాలీ**

బిసిల రాష్ట్రవ్యాప్త బంద్‌కు మద్దతుగా శుక్రవారం అన్ని పార్టీలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు నగరంలో ర్యాలీ నిర్వహించాయి. బిసి జెఎసి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు, బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య, ఎంఎల్‌సిలు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, అద్దంకి దయాకర్, బిసి జెఎసి వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్-ఛైర్మన్ వి.జి.ఆర్. నారగోని, ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, జెఎసి కో-ఆర్డినేటర్స్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ పార్టీకి గుర్తింపు లేదు



### హైకోర్టుకు వెల్లడించిన ఇసి

**చెన్నై, అక్టోబరు 17:** తమిళనాడు నటుడు విజయ్ రాజకీయ పార్టీ తమిళగ వెట్రి కజగంకు గుర్తింపు లేదని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. కరూర్ ర్యాలీ తొక్కిసలాట కేసు విచారణ సందర్భంగా మద్రాసు హైకోర్టుకు ఈ విషయాన్ని తెలియజేసింది. నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీగా టివికె అర్హత సాధించేందుకు అవసరమైన ప్రమాణాలను అందుకోలేదని ఇసి తరఫు న్యాయవాది నిరంజన్ రాజగోపాల్ కోర్టుకు వెల్లడించారు. ఒక రాజకీయ పార్టీ గుర్తింపు పొందాలంటే పోలైన చెల్లుబాటు ఓట్లలో కనీసం ఆరుశాతం ఓట్లు, అసెంబ్లీలో రెండు సీట్లు లేదా లోక్‌సభలో ఒక సీటు సాధించడం వంటి ఇసి నిర్దేశించిన ప్రమాణాలను అందుకోవాలని వివరించారు. కాగా, సెప్టెంబర్ 27న తమిళనాడులోని కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరగడంతో 41 మంది మరణించారు. మధురై బెంచ్ న్యాయవాది దీనిపై హైకోర్టులో పిటిషన్ వేశారు.

టివికె పార్టీ రిజిస్ట్రేషన్ లేదా గుర్తింపును రద్దు చేయాలని నటుడు విజయ్‌పై అదనపు అభియోగాలను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. మరోవైపు చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, జస్టిస్ జీ అరుల్ మురుగన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ సందర్భంగా విజయ్ పార్టీకి ఎలాంటి గుర్తింపు లేదని ఇసి తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలియజేశారు.

## యూనిటీ మార్చ్‌లో యువత భాగస్వాములు కావాలి

### కేంద్ర బొగ్గుగనుల మంత్రి జి.కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (ముషీరాబాద్), అక్టోబరు 17, ప్రభాత వార్త:** సర్దార్-150 యూనిటీ మార్చ్‌లో యువత భాగస్వాములు కావాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మేరా యువభారత్ పోర్టల్ నేతృత్వంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న యూనిటీ మార్చ్, దేశ నిర్మాణం దిశగా యువతలో స్ఫూర్తిని నింపనున్నదని అన్నారు. ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ విలీనం కావటానికి సర్దార్ పటేల్ చారిత్రాత్మకమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. సర్దార్ పటేల్ ధృఢ సంకల్పంతో పూనుకోకపోతే భారత్‌లో హైదరాబాద్ విలీనం సాధ్యమయ్యేది కాదని స్పష్టం చేశారు. నిస్వార్థ సేవ, ఏకత, దేశ నిర్మాణం వంటి ఆదర్శభావాలకు సర్దార్ పటేల్ మార్గదర్శకులని, ఈ భావనలకు ప్రతీకగా జాతీయ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల్లో యువత ముందువరసలో నిలవాలని విజ్ఞప్తి చేశారు. భారత్‌ను సమైక్య పరచటంలో సర్దార్ పటేల్ అందించిన సుదీర్ఘ వారసత్వాన్ని గౌరవించుకుంటూ, యువజనుల్లో ఏకత, దేశభక్తి, పౌర బాధ్యత భావనలను నింపాలన్నదే ఈ కార్యక్రమ సంకల్పం అన్నారు. ఈ సమావేశంలో ఎమ్‌వై భారత్ తెలంగాణ స్టేట్ డైరెక్టర్ అన్షుమన్ ప్రసాద్ దాస్, ఎన్.ఎస్.ఎస్. ప్రాంతీయ డైరెక్టర్ హైదరాబాద్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

## రూ.1.15 కోట్ల హాషిష్ ఆయిల్ పట్టివేత

### ఘట్కేసర్ వద్ద అంతర్రాష్ట్ర డ్రగ్ రాకెట్ బట్టబయలు

### మైనర్ అరెస్ట్, పరారైన సూత్రధారి

**హైదరాబాద్ (నేరేడ్‌మెట్), అక్టోబరు 17, ప్రభాతవార్త:** మత్తుపదార్థాల మాఫియాను విడిచిపెట్టేది లేదని, డ్రగ్స్‌రహిత సమాజం కోసం కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్‌బాబు, ఐపీఎస్ స్పష్టం చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో మత్తు మాఫియాపై కొనసాగుతున్న ఆపరేషన్‌లో భాగంగా ఘట్‌కేసర్ వద్ద మరో అంతర్రాష్ట్ర డ్రగ్ రాకెట్ గుట్టు రట్టయింది. శుక్రవారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన సీపీ సుధీర్ బాబు వివరాలను వెల్లడించారు. హాషీష్ ఆయిల్ స్వాధీనం మల్కాజ్‌గిరి ప్రత్యేక ఆపరేషన్ల బృందం (ఎస్‌ఓటీ) ఘట్‌కేసర్ పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త దాడిలో 5.1 కిలోల హాషీష్ ఆయిల్ స్వాధీనం చేశారు. స్వాధీనం చేసిన నిషేధిత పదార్థం మార్కెట్ విలువ సుమారు రూ.1.15 కోట్లు ఉంటుందని తెలిపారు.

**నిందితులు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అల్లూరి సీతారామరాజు జిల్లా, సారపల్లి గ్రామానికి చెందిన 17 యేళ్ల మైనర్ బాలుడు (సీసీఎల్)కాగా, ప్రధాన సూత్రధారి ఐన ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబేంద్ర జోడియా శ్రీను, ప్రస్తుతం పరారీలో ఉన్నాడని తెలిపారు. చదువు మానేసి వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న మైనర్ బాలుడిని దేబేంద్ర మాయమాటలతో తన వలలోకి దించాడు.

గంజాయి, హాషీష్ ఆయిల్ రవాణా చేస్తే డబ్బు వస్తుందని చెప్పి అతన్ని వాడుకున్నాడు. 15వ తేదీన దేబేంద్ర ఇచ్చిన 5.1 కిలోల హాషీష్ ఆయిల్‌ను రైలులో హైదరాబాద్‌కు తరలించడానికి బాలుడు బయలుదేరాడు. ఈ రోజు ఉదయం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. బాలుడి వద్ద ఉన్న బ్యాగులో రెండు పాలిథిన్ సంచుల్లో ప్యాక్ చేసిన హాషీష్ ఆయిల్ స్వాధీనం చేశారు. ఒక మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు.'డ్రగ్స్ రవాణా, విక్రయం, వినియోగం చేసే వారిపై రాచకొండ పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష చూపరు. నార్కోటిక్ పదార్థాల వాడకం యువత భవిష్యత్తును నాశనం చేస్తుంది. ప్రజలు బాధ్యతతో వ్యవహరించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి' అని కమిషనర్ సుధీర్ బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లోడీసీపీలు పి.వి. పద్మజా (మల్కాజ్‌గిరి), ఎ. రమణా రెడ్డి (ఎస్‌ఓటి), ఏడీసీపీ ఎన్. నర్సింహారెడ్డి, ఏసీపీ సి. అంజయ్య మార్గదర్శకత్వంలో ఇన్‌స్పెక్టర్లు పి. చంద్రశేఖర్ రెడ్డి, పి. వాసుదేవ్, ఎస్ఐలు, ఎస్‌ఓటి మల్కాజ్‌గిరి టీం, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం. బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్రిక్తంగా మారిన సిపిఎం చలో రాజ్‌భవన్

### ర్యాలీని అడ్డుకున్న పోలీసులు.. బైఠాయించిన రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నిరసనకారులను అరెస్టు చేసిన పోలీసులు



**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ తలపెట్టిన చలో రాజ్‌భవన్ తీవ్రఉద్రిక్తంగా మారింది. ఈ కార్యక్రమంలో భాగంగా సిపిఎం నేతలు ఖైరతాబాద్ మెట్రోస్టేషన్ నుంచి నుంచి సోమాజీగూడ వరకు ర్యాలీగా వెళ్లి గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వెళ్తున్న సిపిఎం నాయకులను పోలీసులు మెట్రో రెసిడెన్సీ వద్ద అడ్డుకున్నారు. అప్పటికే బారికేడ్లు వేసి ముందుకెళ్లకుండా నిలిపివేయడంతో నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బారికేడ్లను తొలగించుకుని వెళ్లేందుకు కార్యకర్తలు చేసిన ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేశారు. నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి వాహనాల్లో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు మెట్రో రెసిడెన్సీ వద్ద రోడ్డు మీదే బైఠాయించిన నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసేందుకు చేసిన ప్రయత్నంతో తీవ్రఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు నాయకులు, కార్యకర్తలను బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. ఈ క్రమంలో ఒక కార్యకర్త స్పృహ తప్పి పడిపోయారు. తమ నాయకులు శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో వినతిపత్రం సమర్పించేందుకు వచ్చారని పోలీసులు వినిపించుకోలేదు. బలవంతంగా పోలీసులు వారిని అరెస్ట్‌చేసి అక్కడ నుంచి తరలించారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నేతృత్వంలో ప్రతినిధి బృందాన్ని వెళ్లనిచ్చినప్పటికీ రాజ్‌భవన్ గేటు వద్దే లోపలికి వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో వారు అక్కడే బైఠాయించారు. గవర్నర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని నినాదాలు చేశారు. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్ కేంద్రానికి అనుకూలంగా ఉంటున్నారని తెలిపారు. మూడు రోజుల క్రితమే గవర్నర్ అపాయింట్ మెంట్ అడిగామనీ, బీసీల గురించి మాట్లాడేందుకు వస్తే కలవడానికి సిద్ధంగా లేరని విమర్శించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం, మోటార్ సైకిల్ ర్యాలీలు తదితర రూపాల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో అఖిలపక్షం తీసుకునే నిర్ణయాలకు సిపిఎం మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నాయకులు ఎస్.వీరయ్య, మహ్మద్ అబ్బాస్, టి.జ్యోతి, టి.సాగర్, నంద్యాల నర్సింహారెడ్డి, బండారు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జుబిన్‌గార్గ్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**గువాహతి, అక్టోబరు 17:** కాంగ్రెస్ నేత రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన అస్సామీ గాయకుడు జుబిన్ గార్గ్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. నిజాలను వెలికి తీయాలన్నదే తమ అభిమతమని జుబిన్ కుటుంబసభ్యులు కోరుతున్నారని, ప్రభుత్వాలూ దిశగా కృషిచేయాలని కోరారు. జుబిన్‌గార్గ్ మృతిపై అస్సాం రాష్ట్రం మొత్తం రోదిస్తోందన్నారు. ప్రభుత్వం సత్వరమే పారదర్శకంగా విచారణను పూరినతచేసి గాయకుడి కుటుంబానికి ఏంజరిగిందో వాస్తవాలు తెలియజెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. 17 ఏళ్లవయసులో తాను పర్వతారోహణకు వెళ్లినపుడు సిక్కిమ్‌లో కంచన్‌జంగ పర్వతాన్ని ప్రతిరోజు చూసేవాడినని ఎంతో సౌందర్యంతో ఉండేదన్నారు. ఇపుడు తాను అస్సాం వచ్చినపుడు గౌరవ్‌గగోయ్ తనతో మాట్లాడుతూ కంచన్‌జంగ పర్వతశ్రేణికి మించిన వాడని జుబిన్‌జీ గురించి చెప్పారని, కాంజన్‌జంగలో ఉన్న లక్షణాలన్నీ జుబిన్‌గార్గ్‌లో ఉన్నాయన్నారు. ఇదిలా ఉంటే స్థానిక కోర్టు గార్గ్ బ్యాండ్‌మేట్ శేఖర్ జ్యోతి గోస్వామి, గాయకుడు అమృత్‌పర్వ మహంతాలను జుడిషియల్ కస్టడీ విధించారు. 14రోజుల పోలీసు కస్టడీ ముగియడంతో కోర్టుకు హాజరు పరచగా జుడిషియల్ కస్టడీ విధించారు.

**దర్యాప్తు మూడునెలకుపైగానే జరుగుతుంది**

ఇదిలా ఉంటే సింగపూర్ పోలీసులు జుబిన్‌గార్గ్ మృతిపై దర్యాప్తు పూర్తికి మూడునెలలుపైగానే పడుతుందని తెలిపారు. సింగపూర్ ప్రభుత్వానికి సత్వరమే దర్యాప్తు నివేదికను అందచేస్తామని చెప్పారు. ప్రస్తుతం దర్యాప్తు వేగంగా జరుగుతున్నదని, మరో మూడునెలలు పటుడుతందని చెప్పారు. ఎస్‌పిఎఫ్ దర్యాప్తు పూర్తయిన తర్వాత కొలిక్కి వచ్చిన వివరాలను రాష్ట్రపతి అందచేస్తామని తెలిపారు. అప్పుడే కరోనర్ ఎంక్వయిరీ చేయాలా వద్దా అనేది నిర్ణయిస్తారు. జుడిషియల్ అధికారి ఒకరు ఈ దర్యాప్తును చేపట్టి మృతికి గలకారణాలు వెలికితీసి ముగించిన తర్వాత బహిరంగపరుస్తారని ఎస్‌పిఎఫ్ తెలిపింది.

## వ్యవసాయ శాఖ ఫర్నిచర్ జప్తునకు యత్నం

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** పెండింగ్ బిల్లుల విషయంలో కోర్టు ఉత్తర్వుల ప్రకారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో జప్తు చేసేందుకు ప్రయత్నించగా, కలెక్టరు చొరవతో దానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. రాష్ట్రంలోని జనగామ కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో పెండింగ్ బిల్లుల కోసం ఓ కాంట్రాక్టర్ కోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం ఫర్నిచర్ జప్తునకు యత్నించారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాలతో వ్యవసాయశాఖ అధికారి అంబికా సోని, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ సదరు కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి మూడు నెలలు గడువు కోరడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. కాగా జనగామ జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే పరికరాలను సబ్సిడీపై అందించడానికి దీప్తి ఇంజినీరింగ్ అండ్ వెల్డింగ్ వర్క్స్ సంస్థ యజమాని కత్తుల రాజిరెడ్డితో గతంలో వ్యవసాయశాఖ ఒప్పందం చేసుకుంది. దీంతో పరికరాలు తయారు చేసి ఇచ్చినందుకు కాంట్రాక్టర్‌కు 5,25,500 రూపాయలుతో అప్పటి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ట్రెజరీ చెక్కు జారీచేశారు. అయితే ఐదేళ్ల నుంచి చెక్కును అందజేయలేదు. దీంతో కోర్టును ఆశ్రయించగా, ఫర్నిచర్‌ను జప్తు చేసుకోవాలని తీర్పునిచ్చింది.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శారద

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నెరెళ్ల శారద అన్నారు. ఇందుకు దోహదపడే కార్యక్రమాలపై కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ) డైరెక్టర్ రామేశ్వర్‌రావు తన బృందంతో కలిసి హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇస్కీ కమిషన్ మధ్య పరస్పర సహకారం, అవగాహన కార్యక్రమాలు, భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించడం జరిగిందన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
ఇ-వేలం ప్రకటన

No. PSO(C)II/e-auction/1/2024-25 తేది: 06.10.2025

ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలానే అనే ప్రాతిపదికన పనికిరాని వాహనాలు (15 సం.లలోపు వాహనాలు), బస్ బాడీలు, టైర్లు, మెటీరియల్ మొదలగు వాటి ఇ-వేలం M/s NCDEX e-Markets Ltd, Hyderabad వారిచే నిర్వహించబడును.
(ఫోన్ నెం. 8121156977 & 7569819838).
1. కరీంనగర్ (KMNR) తేది: 05.11.2025
2. ఉప్పల్ (HZ/UPL) తేది: 12.11.2025
రిజిస్ట్రేషన్ మరియు ఇతర వివరములకు www.neml.in మరియు TGSRTC వెబ్‌సైట్ https://tgsrtc.telangana.gov.in (Tenders) ను చూడగలరు.
DIPR.No.9432-PP/CL/Advt/1/2025-26, తేది: 17.10.2025 సం/- చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్

# వార్త

చేయకుండానే చేశాననేవాడు అధముడు, కొద్దిగా చేసి కొండంత చేశానని చెప్పేవాడు గర్వపోతు. ఎంతో చేసి కొంచెమే చేశానని చెప్పేవాడు సజ్జనుడు.

-ఆది శంకరాచార్యులు

# చూసి పోయేవారే..చేయూతనిచ్చేవారేరి?

**మరో జీవ నాధారం లేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రమే వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు కాడి కింద పెడితే అంతకంటే ప్రమాదకర పరిస్థితి మరొకటి ఉండదు. ఇలాంటి సమయంలో ప్రజాపాలకుల మని చెప్పుకునేవారు ఆపన్నహస్తం అందివ్వాలి. కానీ నేతలు వాగ్దానాలు, వాచావాత్సల్యాలతో సానుభూతి వర్షాలు కురిపిస్తున్నారు. ఇవి రైతుల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. అందుకే ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. కమిటీలు, సమీక్షలు, నివే దికలంటూ కాలయాపనకు ఇది తరుణంకాదు. అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతినడం దేశానికి క్షేమం కాదు. ఎద్దు విడిచిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదనే విషయం పాలకులు విస్మరించరాదు.**

దామెర్ల సాయిబాబ

'వానలో తలకడుకుందామని వెళ్లితే వడగండ్లు పడ్డట్టు'గా ఉంది తెలుగు రాష్ట్రాల్లో రైతుల పరిస్థితి. ఒకప్పుడు చుక్కనీటి కోసం వెంపర్లాడిన అన్నదాతలు గత నాలుగైదు నెలలుగా విడవకుండా కురుస్తున్న వర్షాలతో విలవిల్లాడిపోతున్నారు. ఈ పంట, ఆపంట అని కాదు పండ్ల తోటలతోసహా దాదాపు అన్ని పంటలకు అపారనష్టం జరిగింది, జరుగుతున్నది. రైతులపై పగబట్టిందా? లేక పిచ్చి పట్టిందా అన్నట్లుగా ప్రకృతి వ్యవహరిస్తున్నది. దేశవ్యాప్తంగా వ్యవసాయరంగం పరిస్థితి ఇలానే ఉన్నా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మరింతగా విపత్కర పరిస్థితులు అలుముకుంటున్నాయి. గత రబీ సీజన్‌లో అకాల వర్షాలు, వరదలతో జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. చేతికి అంది వస్తుందనుకున్న సమయంలో విరుచుకుపడిన వరుణదేవుడి ప్రభావం రైతుల నెత్తిన పిడుగుపాటుగా పరిణమించింది. అక్కరకురాని సమయంలో కురిసిన ఆ వర్షాలతో రైతులకు అపారనష్టం జరిగింది. ఇక వానాకాలం పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతున్నది. గత రెండు, మూడు నెలలుగా కురుస్తున్న వర్షాలు మెట్టపంటలకు తీవ్రనష్టం కలిగించాయి. ముఖ్యంగా వాణిజ్య పంటలైన మిర్చి, పత్తి రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. దిగుబడులు సగానికి సగం తగ్గిపోయాయి. మరొకపక్క మార్కెట్ దగాఉండనే ఉంది. గతంలో క్వింటాలుకు పది, పన్నెండు వేలకుపైగా అమ్మిన పత్తి నేడు ఆరేడు వేలకు మించడంలేదు. అది కూడా దళారుల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడాల్సి న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంకొకపక్క విడవని వర్షాలు భయపెడుతున్నాయి. ఒక్కపత్తి రైతులే కాదు, కూరగాయలు మొక్కజొన్న, వరి రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. నష్టాలు అంచనాల్లో అధికారులు మునిగి తేలుతున్నారు. ఇప్పటికీ ఎంతమేరకు నష్టం జరిగిందో స్పష్టంగా తెలియడం లేదనే చెప్పొచ్చు. కేంద్ర బృందాలు కూడా పర్యటించి, పరిశీలించిపోయాయి. పరామర్శలకు, పర్యటనలకు విరామం లేదు కానీ సహాయం ఎప్పుడు చేస్తారో? ఎలా చేస్తారో? చెప్పేవారు లేకుండా పోతున్నారు. అందుకే చూసిపోయేవారి కానీ చేసేవారు కన్పించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు మళ్లీ రబీ సాగు ముంచుకొస్తున్నది. నవంబరులో ఈ ఖరీఫ్ ముగిస్తే డిసెంబరు, జనవరి నాటికి రబీ సాగు నాట్లు, విత్తనాలు విత్తడం పూర్తి కావాల్సి ఉంటుంది. దీనికి మళ్లీ పెట్టుబడి కావాలి. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మరొకపక్క ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉన్నది. రైతులను ఆదుకొనేందుకు అంతో ఇంతో చేస్తున్నా వాగ్దానాల వర్షాలు కురిపిస్తున్నా హాలికులకు నమ్మకం కుదరడం లేదు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని, రైతుల ఆదాయాన్ని ఐదేళ్లలో రెట్టింపు చేస్తామని చెప్పిన పెద్దలు ఐదేళ్లలో ఆదాయం రెట్టింపు సంగతి దేవుడెరుగు పెట్టుబడిని రెట్టింపు చేశారు. కనీస మద్దతు ధర ప్రకటిస్తున్నా పెరిగిన ఎరువులు, క్రిమిసంహారక మందులతోపాటు సాగు ఖర్చులు కూడా పొంతన లేకుండాపోతున్నది. తాజాగా దేశంలో వంద వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయరంగంలో సమూల మార్పులు తీసుకవచ్చేందుకు ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని మొన్న శనివారం నరేంద్రమోడీ ప్రారంభించారు. దాదాపు 24వేల కోట్ల రూపాయలతో పదకొండు మంత్రిత్వ శాఖలకు చెందిన 36 పథకాలను కలగలిపి ఈ సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు, 11 వేల 440 కోట్ల రూపాయలతో మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్‌ను లాంచనంగా మోడీ ప్రారంభించారు. పశుపోషణ మత్స్య, ఆహారశుద్ధి రంగాలకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను ప్రధాన మంత్రి ప్రారంభించారు. గతంలో కూడా రైతుల

## ఒక్క మాట

సంక్షేమం కోసమే లక్షలకోట్ల వ్యయంతో అనేక పథకాలు చేపట్టారు, ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, మరెన్ని కోట్లాది రూపాయలు సబ్సిడీ రూపంలో అందిస్తున్నా రైతుల పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. గత పది, పదిహేనేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నోపథకాలు ప్రవేశపెట్టాయి. కోట్లాది రూపాయలు వ్యవసాయరంగానికి కేటాయించారు. కొన్ని రాష్ట్రాలు ఉచిత విద్యుత్ బకాయిలు రద్దు లాంటి కార్యక్రమాలు చేపట్టాయి. ఇక తెలంగాణలో (రైతుబంధు) రైతుభరోసా , రుణమాఫీ లాంటి కార్యక్రమాలు కొంత ఊరట ఇచ్చిన మాట వాస్తవమే. ఇన్ని రకాలుగా రైతులకు చేయూతనిస్తున్నా వారి ఆర్థిక పరిస్థితి ఏమాత్రం మెరుగుపడకపోగా రోజురోజుకు మరింత దిగజారిపోతున్నది. వ్యవసాయరంగమే ఒక పెద్ద సంక్షోభంలో కూరుకుపోతున్నది. అందుకు కారణాలేమిటో? కారకులెవరో పాలకులకు తెలియంది కాదు. ప్రకృతి సృష్టిస్తున్న విపత్తులను ఏదోరకంగా రైతులు భరిస్తున్నారు. కానీ తోటి మానవుడు చేస్తున్న మోసాల నుండి బయటపడలేక కుప్పకూలిపోతున్నాడు. వ్యవసాయరంగానికి మూలం విత్తనాలు. క్రిమిసంహారక మందులు అనేది అందరికి తెలిసిందే. విత్తే దగ్గర నుండి విక్రయించే వరకు అన్ని స్థాయిల్లో తోటి మనుషులు దగాకు గురవుతున్నారు. రైతులను నిలువునా మోసం చేస్తున్న ఈ దళారుల నుండి రైతులను కాపాడడంలో పాలకులు విఫలమవుతున్నారని చెప్పొచ్చు. ఈ పార్టీ, ఆపార్టీ అని కాదు. ఏ పార్టీ అధికారంలో ఉన్న రైతులకు మాటలు, దళారులకు మూటలు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు సరఫరాకాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు అవసరమైతే చట్టానికి మరింత పదును పెడతామని, గత రెండు, మూడు దశాబ్దాలుగా చెప్తూనే ఉన్నారు. కొన్నిరాష్ట్రాల్లో ఈ నకిలీ, నాసిరకం విత్తనాల వ్యాపారులను పట్టుకోవడానికి పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేయిస్తున్నారు. ఆ తనిఖీల్లో కోట్లాది రూపాయల విలువైన నకిలీ, నాసిరకం సరుకులు పట్టుబడుతున్నాయి. కేసులు పెడుతున్నారు. కానీ ఆ కేసుఏమౌతున్నాయి? అదే నకిలీ వ్యాపారులు తమ కార్యక్రమాలను మళ్లీ ఎలా కొనసాగించగలుతున్నారు? అన్నీ ప్రశ్నలే. ఇక కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలు అన్నీ ఇన్నీ కావు. మొన్న హన్మకొండ జిల్లా శాయం పేట ప్రాంతంలో కొనుగోళ్లలో జరిగిన భారీ మోసం పరాకాష్టగా చెప్పొచ్చు. రైతులనే కాదు ఏకంగా ప్రభుత్వానికి కూడా కుచ్చుటోపి పెట్టారు. బహుశా దేశంలోనే ఇలాంటి దగా ఎక్కడా జరిగి ఉండకపోవచ్చు. కొందరు ఉద్యోగులు తమ బినామీ పేర్లపై వడ్లు పండించినట్లు, మార్కెట్‌కు తీసుకువచ్చినట్లు నమోదు చేసుకున్నారు. ఆ తర్వాత ఆ వడ్లను తూకం వేసి గోడౌన్‌కు తరలించినట్లు రికార్డులు సృష్టించారు. రవాణా, హమాలీ, తూకం ఖర్చులన్నీ లెక్కలు రాశారు. కోటిఎనభైఆరు లక్షల రూపాయలు పన్నెండు మంది రైతుల ఖాతాల్లో బ్యాంకుల్లో జమచేసుకొని భోంచేశారు. ఫిర్యాదు అందడంతో విజిలెన్స్ విభాగం చేపట్టిన దర్యాప్తులో విస్తుపోయే విషయాలు తెలిసింది. అసలు వడ్లు లేవు. మొత్తం అంతా బోగసే. అన్ని రికార్డులు సృష్టించి డబ్బు భోంచేశారు. కేసు నమోదు చేసి ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నది. ఇలాగా రైతులనుమోసం చేసే దళారులు ఎందరో ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వ్యవసాయరంగంపై వెచ్చించిన లక్షలాది కోట్ల రూపాయల్లో పదో వంతు నిజమైన రైతులకు చేరి ఉంటే భారతదేశంలో వ్యవసాయరంగం పరిస్థితి ఇలా ఉండేది కాదేమో. ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యాలు రైతుల వెన్నువిరిచేస్తున్నాయి. ఎప్పుడు ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నా రాష్ట్రాలకు కేంద్రం అందిస్తున్న సహాయం కంటితుడుపుగానే ఉంటుంది. రైతు లేనిదే రాజ్యమేలేదు. రైతు సంక్షేమ ప్రభుత్వం రైతుశ్రేయస్సే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకుంటున్న పాలకులు అపారనష్టాలతో అప్పుడు ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలను ఆదుకోవాల్సి న అవసరం ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రైతుల పరిస్థితి ఆవేదన భరితంగా ఉందని చెప్పొచ్చు. మరో జీవనాధారం లేక, గత్యంతరం లేని పరిస్థితుల్లో మాత్రమే వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు కాడి కింద పెడితే అంతకంటే ప్రమాదకర పరిస్థితి మరొకటిఉండదు. ఇలాంటి సమయంలో ప్రజాపాలకుల మని చెప్పుకునేవారు ఆపన్న హస్తం అందివ్వాలి. కానీ నేతలు వాగ్దానాలు, వాచావాత్సల్యాలతో సానుభూతి వర్షాలు కురిపిస్తున్నారు. ఇవి రైతుల్లో విశ్వాసం కల్పించలేకపోతున్నాయి. అందుకే ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. కమిటీలు, సమీక్షలు, నివేదికలంటూ కాలయాపనకు ఇది తరుణంకాదు. అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతినడం దేశానికి క్షేమంకాదు. ఎద్దు విడిచిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదనే విషయం పాలకులు విస్మరించరాదు. ●

# బీమారుకు కాయకల్ప చికిత్స

బీహార్ రాష్ట్రానికి ఎన్నికల జ్వరమొచ్చింది. రాజకీయాల్లో టక్కుటమార గోకర్ణ విద్యలన్నీ సహజంగా చూస్తుంటాము. ఈ రాష్ట్రంలో అలాంటి విద్యలు తెలిసిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సొంత పార్టీ 'జనసురాజ్' కూడా రంగంలో ఉంది. బీహార్‌లో అధికారం నుంచి ప్రస్తుత ఎన్డీఏను పదవీచ్యుతిని చేయాలని ఆయన ఆకాంక్ష. ఇతరత్రా పార్టీల వారు హేమాహేమీలు. రాజకీయాల్లో తన మాటే నెగ్గించుకోటానికి ఎంతకైనా వెనుకాడని నితీష్ కుమార్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండడం, పశుదాణా కుంభకోణంలో తనకు తానే సాటి అని కటకటాలను చూసొచ్చిన లాలూ ప్రసాద్ యాదవ్, ఇప్పుడాయన వారసులు కూడా ఎవరికి వారే అన్న చందాన బీహార్ ఎన్నికలలో ఎవరి పాత్రవారు నిజా యితీగా పోషిస్తున్నట్లే చెప్పాలి. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవని అందరికీ తెలిసిందే. ఇప్పుడదే జరిగింది. లాలూప్రసాద్ వారసులుగా చెలామణీ అవుతున్న తేజ్‌ప్రతాప్ యాదవ్, మరోపక్క లాలూ వారసత్వానికి తానే సరైన వారసుడనిపించుకున్న తేజస్వియాదవ్‌లు రాజకీయ వ్యూహ ప్రతి వ్యూహాలు పన్నుతున్నారు. ఎవరికి ఏ అంశం కలిసి వస్తుందో ఇప్పుడే చెప్పలేమని విశ్లేషకులు తమ కళ్లెదుట జరుగుతున్న రాజకీయాలను పరిశీలిస్తున్నారు. జెడియు నేత నితీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి అభ్యర్థుల ఖరారులో చాలా లుకలుకలు ఎదురు చూసాయి. కాని చిన్న చిన్న పార్టీలు తమ అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కారు. విపక్ష ఫ్రంట్‌గా చెప్పబడే ఆర్‌జెడి, కాంగ్రెస్‌ల మధ్య ఇంకా సర్దుబాట్లు పూర్తిస్థాయిలో జరుగలేదు. లాలూ తనయుడు జనశక్తి జనతాదళ్ స్థాపించాడు. ఆ పార్టీకి లాలూ తనయ రోహిణి ఆచార్య ఆశీస్సులున్నాయి. ఇలా లాలూ సామ్రాజ్యం చీలికలు పేలికలు అయినా, ఆయన మరో కుమారుడు తానే కాబోయే ముఖ్యమంత్రినని స్వయంగా ప్రకటించుకుని మహా కూటమిని నిర్దేశించే పనిలో పడ్డాడు. ఇంటిపోరు అలా ఉండగా కాంగ్రెస్‌తో చెలిమి చేయడంలోనూ వ్యూహాత్మకంగా వ్యవహరించలేకపోతున్నాడు. ఇవన్నీ అవకాశంగా తీసుకుని జనసురాజ్ అన్ని స్థానాల్లోనూ పోటీ చేసే స్థాయిలో ఉందని చెప్పుకుంటూ ప్రశాంత్ కిషోర్ తాను ప్రస్తుతానికి అసెంబ్లీ ఎన్నికలో పోటీకి దిగడంలేదు. ఇది కూడా ఒక వ్యూహమే. ఆ పార్టీకి వ్యూహకర్త, ఆకర్షణీయ శక్తి ఆయనే కనుక జనం ఎలా స్వాగతిస్తారో చూడాలి. నితీష్‌కుమార్‌తో విభేదించి బయటపడినప్పటి నుంచి ప్రశాంత్ ఊరూరా ఇంటింటికీ తిరుగుతూ జనాన్ని ఆకట్టుకున్నాడు. ఇప్పుడు ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ ఎన్నికల కమిషన్ బీహార్‌లో అమలు చేస్తున్న ఓటర్ల సంస్కరణ 'సర్'తో విభేదించి జనంలో బాగా గుర్తింపు వచ్చింది. అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ డ్రామాలాడుతోందని ప్రజలే భావించే పరిస్థితి ఏర్పడింది. రాహుల్ గాంధీతో తలపడి ఆనక సుప్రీంకోర్టు మొట్టికాయలు తిన్న ఎన్నికల కమిషన్ కాస్త పరపతి కూడా కోల్పోయింది. తన చిత్తశుద్ధిని నిరూపించుకునే పనిలో ఆ ప్రభుత్వ సంస్థ బాగా తంటాలుపడుతోంది. అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో స్వయంగా దిగడమే కాకుండా నలుగురు ఎన్డీయే రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ప్రచారగోదాలోకి దింపింది. సర్దుబాట్లు జరిగినా జరుగకపోయినా దాదాపు ప్రధాన పార్టీలు ముందస్తు జాగ్రత్తలతో తమ తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించేశారు. ఇలాంటి వ్యూహం బెడిసికొట్టి చివరాఖరుకు 'రెబల్స్' బెడదతో ఇబ్బంది పడే అవకాశం లేకపోలేదు. బీహార్‌లో తమకు 40 స్థానాల్లో ముస్లిం జనాభా ఉన్నందున అక్కడ తామెందుకు పోటీ చేయరాదని అనుకున్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పడి రంగంలోకి దిగింది. సర్దుబాట్లు, సమాలోచనలు ఒకపక్క జరుగుతుండగానే ఏయేపార్టీకి ఎవరెవరు స్టార్ కంపెయినర్లుగా ఉండాలో యోచన చేస్తున్నారు. ఈసారి ఆ రాష్ట్రంలో ఎన్నికలు అలాంటిలాంటి వ్యూహాలతో నడవవని అర్థమవుతోంది. ఎన్డీయేకు కూడా అంతర్గతంగా భాగస్వామ్య పక్షాలలో విబేధాలు పొడచూపాయి. చిరాగ్ పాశ్వాన్ (ఎన్‌జెపి) జితిన్ మాంఝీ, (హిందూస్థానీ అవామా మోర్చా) ఉపేంద్ర కుష్వాహ (రాష్ట్రీయ లోక్ మోర్చా) లు తమకు కేటాయించిన సీట్లు, స్థానాల విషయంలో ఏ మంత సంతోషంగా లేరు. కాగా భారత్‌లో ఎన్నడూ లేని విధంగా రాజకీయ వ్యూహాలు ఎన్నికల కమిషన్, పార్టీల ప్రాభవం, ఓటర్ల ప్రలోభాలు వంటి వాటికి ఈసారి జరుగుతున్న బీహార్ ఎన్నికలు నమూనాగా ఉండగలవన్న అంచనాలున్నాయి. బీహార్‌లో దాదాపు చిన్న చితకా పార్టీలు ఒంటరిగానో, పెద్ద పార్టీలతో కలిసో సీట్ల పంపకాలు చేసుకుని పోటీలోకిదిగాయి. మహాగట్‌బంధన్ నుంచి వికాస్ శీల్ ఇన్సాఫ్ పార్టీ బయటపడింది. ఏ పార్టీ మహిళలకు తగిన దామాషాతో సీట్లు కేటాయించలేదని తేలిపోయింది. ఎన్నికల నిర్వహణ విషయానికొస్తే తాము సజావుగానే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పుకునేందుకు ఎన్నికల కమిషన్ ఆపసోపాలు పడుతోంది. ఏమయితేనేం అన్ని అగ్ని పరీక్షలను తట్టుకుని నిలబడుతూ ఓటర్ల జాబితాను సిద్ధం చేసింది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనానికి తెలియచేసింది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్వే విశ్వసనీయతను దెబ్బతీసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు, ఎన్‌జిఓలు సుప్రీంలో పిటిషన్లు వేసాయని ఇసి సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇక నిబద్ధతతో ఎన్నికల నిర్వహణ ఒక్కటే ఎన్నికల కమిషన్ బాధ్యతగా మిగిలింది.

# మహాసముద్రాలను ఛేదిస్తున్న సాంకేతికత

డి.మోహన్

భారతదేశ వైజ్ఞానిక ఆకాంక్షలు అంతరిక్షానికే పరిమితం కాకుండా ఇప్పుడు మహాసముద్రాల అట్టడుగున ఉన్న అగాధాలను కూడా ఛేదిస్తున్నాయి. ఇటీవల ఇండోఫ్రెంచ్ సహకారంలో భాగంగా ఇద్దరు భారతీయ శాస్త్రవేత్తలు అట్లాంటిక్ మహాసముద్రంలో 5,000 మీటర్ల లోతుకు విజయవంతంగా ప్రయాణించారు. ఈ చారిత్రక విజయం దేశ వ్యూహాత్మక, శాస్త్రీయ, ఆర్థిక భవిష్యత్తుకు కొత్త ద్వారాలు తెరిచింది. గతంలో ఇస్రో చంద్రయాన్, గగన్‌యాన్ వంటి మిషన్లతో అంతర్జాతీయ వేదికపై తన సత్తాను నిరూపించుకోగా ఇప్పుడు మన దేశం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ వంటి సంస్థల ద్వారా సముద్ర పరిశోధనలో తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. దశాబ్దాలుగా లోతైన సముద్ర అన్వేషణ అనేది అమెరికా, రష్యా, ఫ్రాన్స్, చైనా, జపాన్ వంటి కొన్ని అగ్రశ్రేణి దేశాల ఆధిపత్యంలో ఉంది. ఈ దేశాలు మాత్రమే సముద్రాల క్లిష్టమైన వాతావరణాన్ని తట్టుకోగల అధునాతన సాంకేతికతను కలిగి ఉన్నాయి. లోతైన సముద్రంలో ఉండే అధిక పీడనం, శీతల ఉష్ణోగ్రతలు, పూర్తి చీకటి వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి అత్యాధునిక డిజైన్, బలమైన మెటీరియల్స్ అవసరం. ఈ నేపథ్యంలో, భారత శాస్త్రవేత్తలు సాధించిన విజయం ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ ఘనత మన దేశం ఈ అగ్రశ్రేణి దేశాల సరసన నిలవగలదని నిరూపించింది. ఇది కేవలం సాంకేతిక విజయం మాత్రమేకాకుండా, దేశ దీర్ఘకాలిక వ్యూహాత్మక దార్శనికతకు ఒక సంకేతం. భూమి ఉపరితలంలో ఉన్నదాదాపు 70 శాతం సముద్రమే అయినా అందులో 5 శాతం కంటే తక్కువ భాగాన్ని మాత్రమే మనం పూర్తిగా అన్వేషించాం. ఈ లోతైన సముద్రాలు అపారమైన ఖనిజ వనరులకు నిలయాలు. వీటిలో ముఖ్యమైనవి చూస్తే మొదటివి పాలిమెటాలిక్ నోడ్యూల్స్. ఈ బంగాళాదుంప ఆకారపు ఖనిజాలు నికెల్, కోబాల్ట్, రాగి మాంగనీస్‌లను కలిగి ఉంటాయి. ఇవి ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల తయారీకి, పునరుత్పాదక ఇంధన సాంకేతికతకు అత్యంత అవసరం. రెండోది హైడ్రోథర్మల్ సల్ఫైడ్‌లు. ఇవి బంగారం, వెండి, రాగి, ఇతర లోహాలతో కూడిన ఖనిజాలు. ఇవి సముద్ర అడుగున ఉన్న అగ్నిపర్వతాల వద్ద ఏర్పడతాయి. చివరువి రేర్ ఎర్త్‌మెటల్స్. ఇవి స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, రక్షణ రంగ పరికరాల తయారీలో కీలకమైనవి. భవిష్యత్తులో ఈ ఖనిజాల కోసం దేశాల మధ్య పోటీ తీవ్రం కానుంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో ఈ వనరుల ప్రాముఖ్యత పెరుగుతున్న దృష్ట్యా, వాటిపై స్వయంప్రతిపత్తిని సాధించడం మనదేశ జాతీయ భద్రతకు, ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకం. ఈలక్ష్యాలను సాధించడానికి ఈ అన్వేషణలు ఒక పునాది వేస్తాయి. భారతదేశం ఇప్పటికే ఇంటర్నేషనల్ సీబెడ్ అథారిటీ ద్వారా మధ్య హిందూ మహా సముద్రంలో 75,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఒక మైనింగ్ సైట్‌ను కేటాయించుకుంది. ఈ సైట్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి, లోతైన సముద్ర అన్వేషణ, మైనింగ్ సాంకేతికతలను అభివృద్ధి చేయడం తప్పనిసరి. ఈ చారిత్రక ఘనత సాధించడంలో ఫ్రాన్స్‌తో ఉన్న భాగస్వామ్యం చాలా ముఖ్యమైనది. ఫ్రెంచ్ సబ్‌మెర్సిబుల్ సహకారంతో లోతుకు వెళ్లడం, భారతీయ శాస్త్రవేత్తలకు క్లిష్టమైన డీప్‌సీ ఆపరేషన్లలో విలువైన అనుభవాన్ని అందించింది. ఈ సహకారం మన శాస్త్రవేత్తలకు నైపుణ్యాన్ని అందించడమే కాకుండా మన స్వదేశీ ప్రాజెక్టు అయిన మత్స్యఆరువేల సబ్‌మెర్సిబుల్ అభివృద్ధికి కూడా ఉపయోగపడింది. ●

అవసరానికి ఆదుకొనే స్నేహితులుండడం అదృష్టం. అసలు స్నేహితుల అవసరం రాకపోవడం ఇంకా అదృష్టం.



ఆస్కార్‌వైల్డ్

ఎప్పుడు ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



## అడ్డగోలుగా ఓట్ల తొలగింపు

మనదేశంలో ప్రతీ ఎన్నికల సందర్భంలో ఓటర్ల జాబితాలో నుంచి పేర్ల తొలగింపు లేదా జాబితాలో అత్యధిక ఓట్లుచోటు చేసుకోవటం వివాదాస్పదమవుతోంది. అనేక మంది ఓటరుకార్డు ఉండీ ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవటంతో తిరిగి వెళ్ళిపోవటం పరిపాటి అవుతోంది. ఒక ఓటరుఓటు వేయకుండా తిరిగి వెళ్ళిపోవటం లేదా ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపు వంటివి ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాలు ఈ ఓటర్ల జాబితా నిర్వహణలో దశాబ్దాలుగా విఫలమవుతున్నాయి. ఇప్పుడు వెల్లువెత్తుతున్న 'ఓట్ చోరీ' నినాదం ఎన్నికలసంఘం వైఫల్యమేనని చెప్పవచ్చు. ఓట్ల తొలగింపుకు శాస్త్ర పద్ధతి లేకుండా, అడ్డగోలుగా తొలగించటం గర్హనీయం. ఎన్నికల సంఘం ఎన్నికలను సజావుగా సాగించటంపై పెట్టే శ్రద్ధ, ఎన్నికల జాబితాలో అవకతవకలు లేకుండా చూడటంపై పెట్టాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## పర్యాటకరంగం ప్రాముఖ్యత

ఏపిలో ఇటీవల పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం కొన్ని జిల్లాలోగల ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాముఖ్యత గల ప్రాంతాలను గుర్తించారు. వాటిలో ప్రత్యేకంగా తీరప్రాంతాల్లో గల చిత్తడి నేలలను కారిడార్ నిర్మాణం చేయాలనే సంకల్పం ఎంతో విలువైనది. దానిలో వెనుకబడిన జిల్లాలో కొన్ని ప్రాంతాలు ఎంతో అభివృద్ధికి ఆస్కారం ఉంది. భౌగోళిక సానుకూలత ఉన్న వాటికి తదుపరి చర్యలు వివిధ శాఖల నివేదిక ప్రకారం అంచెలవారీగా జరగాలి. ఈబృహత్ పథకానికి స్థానిక ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సహకరించగలరు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

## నియామకాలు జరపాలి

సర్కారు కళాశాలల్లో, పాఠశాలల్లో ప్రతి ఏడాది అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం అంటూ పత్రిక ప్రకటనలు చూస్తుంటే నవ్వేస్తుంది. టీచర్ల కొరత ఉన్నా కూడా మోడల్ పాఠశాలల్లో పది ఏండ్లు అయినా ఇంకా ఒక్క నియామకం జరగలేదు. అరకొర జీతాలకు అతిథి అధ్యాపకులను నియమించుకుని ప్రభుత్వం చేతులు దులుపుకుంటుంది. ఇలాంటి విద్యతో ప్రపంచం గర్వించేలా తెలంగాణను చేస్తా అంటే నమ్మాలా.

- ప్రశాంత్ గురుడు, గోధుర్, జగిత్యాల

## కనీస పెన్షన్ పెంపు ఇప్పట్లో లేనట్లేనా?

ఇటీవల జరిగిన సెంట్రల్‌బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సమావేశంలో కనీస పెన్షన్ పెంపు అంశం చర్చకు వచ్చి అధికారికంగా ప్రకటిస్తారని దేశవ్యాప్తంగా వున్న ఈ.పి.యస్. పెన్షన్ దారులు ఎదురు చూసారు. కానీ కనీస పెన్షన్ పెంపుపై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం పైఅంతా నిరాశవ్యక్తం చేస్తున్నారు. ఈ.పి.యస్ 95 పథకానికి చెందిన ఎన్నో వేలమంది పెన్షన్ దారులు ఎప్పటినుంచో కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతంనెలకు రూ.1000గా ఉన్న కనీస పెన్షన్ను రూ. 7,500 పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. మొన్న జరిగిన సిబిటి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు కానీ కనీస పెన్షన్ పెంపుపై ప్రస్తావనే తీసుకురాలేదు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉన్న 'ఇద్దరు పిల్లల నిబంధన'ను రద్దు చేయడం ఎంతో సముచితమైన నిర్ణయం. ఇప్పటి వరకు ఈ నిబంధన కారణంగా ఇద్దరికి మించి పిల్లలు ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేయలేకపోయారు. దీనివల్ల అనేక మంది సామాన్య ప్రజలు, ప్రజాసేవ చేయాలనే ఆసక్తి ఉన్నవారు వెనుకబడిపోయారు. ప్రభుత్వం ఈ నిబంధనను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను మరింత విస్తరించింది. ఒక వ్యక్తి కుటుంబ పరిమాణం ఆధారంగా రాజకీయ హక్కులను పరిమితం చేయడం న్యాయబద్ధం కాదని స్పష్టంగా చెప్పవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కొరతతో ఈ నిబంధన కారణంగా చాలామంది అర్హత కోల్పోయారు. ఇప్పుడు ఈ నిర్ణయంతో సాధారణ ప్రజలు కూడా స్థానిక పాలనలో భాగస్వామ్యం అవ్వగలరు.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## కొత్త డ్యాములను నిర్మించాలి

భారత దేశంలో అతిపురాతన నదులు చెరువులు, కుంటలు, వాగుల చెక్ డ్యాములను పునరుద్ధరించి కొత్త డ్యాములను నిర్మించాలి. ఎప్పుడో బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన ఆనకట్టలు శిథిలావస్తకు చేరుకుంటున్నాయి. వర్షాకాలంలో ఈ ఆనకట్టలు తెగిపోవడం వల్ల ముంపు గ్రామాలు మునిగిపోవడం జరుగుతుంది. కావున ప్రభుత్వం తక్షణం పాత డ్యాంల స్థానంలో కొత్తవి నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

# ట్రంప్ నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

వి.వి.కే.సురేష్

స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ప్రపంచ దేశాలకు ఆర్థిక నీతి సూత్రాలు వల్లించిన అమెరికా ఆర్థికంగా తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. అమెరికా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన తర్వాత డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై భారీ సుంకాలతో ఏకపక్ష వాణిజ్య యుద్ధానికి (ట్రేడ్ వార్) తలపడ్డాడు. 2008లో ప్రారంభమైన అమెరికన్‌ఆర్థిక సంక్షోభం నేటికీ కొనసాగుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక సంక్షోభాలు సహజ సిద్ధమని ఎన్నోసార్లు రుజువైంది. సంక్షోభాల ప్రభావానికి ప్రధానంగా గురయ్యేది సామాన్య ప్రజలే, సంపన్నులు కాదు. ఒక వైపు లాభాపేక్ష, దురాశ మరో వైపు తీవ్రస్థాయి యాంత్రీకరణ, ఉపాధి కొరత వంటి కోట్లాది మంది ప్రజల జీవన స్థితిగతులను దుర్భరం చేస్తున్నాయి. తాజాగా అమెరికా ఆర్థిక వ్యవస్థ షట్‌డౌన్‌కు గురైంది. ప్రభుత్వ నిధుల విడుదల ఆగిపోయింది. ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయి అక్కడి ఆర్థిక వ్యవస్థ చిక్కుల్లో పడింది. గత కొన్ని నెలలుగా ప్రపంచ దేశాలపై సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ అనేక ప్రకటనలు చేశాడు. అమెరికా అగ్రవాదానికి, పెత్తనానికి సవాళ్లు ఎదురయ్యాయి. డాలర్ ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు ట్రంప్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. చైనా, బ్రెజిల్, ఇరాన్ వంటి కొన్ని దేశాలు వెంటనే ధీటుగా స్పందించాయి. ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని అమెరికన్ ఫెడరల్ కోర్టు కూడా తప్పు పట్టింది. ట్రంప్ తీసుకున్న పలు ఏకపక్ష నిర్ణయాల పట్ల అమెరికా ప్రజల నుండి కూడా తీవ్రవ్యతిరేకత వ్యక్తమవుతోంది. భారత్ తమపై అత్యధిక శాతం టారిఫ్‌లు విధిస్తోందని, రష్యా నుండి చమురు దిగుమతులను వెంటనే నిలిపివేయాలని, లేకుంటే మరో 25 శాతం అదనపు సుంకాలు విధిస్తామని, అసలు రష్యా ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధానికి భారత్, చైనాలే కారణమని ఇలా అనేక ఆరోపణలు ట్రంప్ భారత్ పై వరుసగా చేస్తూనే ఉన్నాడు. వివిధ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలు సవ్యంగా జరిగేలా చూసేందుకుగాను గాట్ స్థానంలో 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఒ) ఏర్పడిన విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఉనికి కూడా నేడు ప్రశ్నార్థకంగా మారిపోయింది. మన దేశంపై ట్రంప్ మొత్తం 50 శాతం దిగుమసుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. మరోవైపు అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. చర్చలు కొనసాగుతున్నాయి. అయితే భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలపొడి వంటి ఇతర ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఎగుమతి చేయాలని, 140 కోట్లకు పైగా జనాభా కల్గిన ఇండియాలోని భారీ మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహతహలాడుతోంది. అందుకుగాను సరళమైన సుంకాలతో తమకు అనుమతి



ఇవ్వాలని కొన్ని దశాబ్దాలుగా అమెరికా మన దేశంపై ఒత్తిడి చేస్తోంది. మన ప్రభుత్వం తలొగ్గితే దేశీయ చిన్న, సన్నకారు రైతులు, పాడి రైతుల జీవితాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి అమెరికా 50 శాతం సుంకాలు విధించడంతో జౌళివస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు, రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపదతో సహా వీటన్నిటి ఉత్పత్తిలో భాగస్వాములైన కొన్నిలక్షల మందిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ట్రంప్ సుంకాల దెబ్బకు పెద్ద ఎత్తున ఎగుమతులు ఆగిపోతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో దేశాన్ని మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేతజాతి దురహంకారాన్ని రెచ్చగొట్టిరెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ పెట్రేగిపోతున్నాడు. భారత్‌పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. అమెరికాలో విడుదలయ్యే మన సినిమాలపైన 100 శాతం, ఫార్మాకు సంబంధించి బ్రాండెడ్ ఔషధాలపై 100శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే మన దేశం ఎక్కువగా జనరిక్ మందులను ఎగుమతి చేస్తుండటంవల్ల ప్రస్తుతానికి పెద్ద ప్రమాదం తప్పింది. అలాగే మన కలపపై 10 శాతం, ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలు మోపుతామని చెప్పారు. అమెరికా జారీ చేసే హెచ్1బి వీసాలపై ట్రంప్ ఎన్నో ఆంక్షలు విధించారు. అన్ని రంగాల సంస్థలు కృత్రిమ మేధ (ఏ.ఐ) సాంకేతికతను వినియోగించడంపైన దృష్టి సారించాయి. ఐ.టి రంగ నిపుణులకు ఇది పెద్ద పిడుగు లాంటి వార్త. హెచ్ 1బి వీసాల సహాయంతో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి పలు ఐ.టి కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేస్తాయి. సుమారు 70 శాతం మంది భారతీయులే ఉంటారు. ఇప్పుడు కొత్త ధరఖాస్తుదారులు లక్ష డాలర్ల రుసుం చెల్లించాల్సి ఉంటుంది. గత సంవత్సర కాలంలో హెచ్ 1బి వీసాల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం గమనార్హం. ట్రంప్ నిలకడలేని నిర్ణయాలవల్ల అనేకమంది యువత భవిష్యత్ అగమ్యగోచరంగా వుంది. హెచ్1 బీ వీసా ధరఖాస్తుల ఫీజు పెంపుదలకు వ్యతిరేకంగా పలు సంస్థలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు అమెరికాలోని న్యాయస్థానంలో ఇటీవల దావాదాఖలు చేయడం జరిగింది. ఏ దేశంతోనైనా వాణిజ్యపరమైన సంబంధాలు, ఒప్పందాలు పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికగానే జరగాలి. ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు నష్టం కలిగిస్తాయని ఆయుధ తదితర పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళనవ్యక్తం చేయటంతో పెంటగన్ సూచనపై కంపెనీలు తమకు అవసరమైన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకోవచ్చునని మినహాయింపు ఇవ్వడం కొంత మేరకు ఊరట కలిగించేదే. భారత్ అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఖరారయితే, అది ఎంత వరకూ మన దేశ ప్రయోజనాలను కాపాడేలా ఉంటుందో చూడాలి. స్వతంత్రమైన విదేశాంగ, వాణిజ్య విధానాలను భారత్ గతంలో అనుసరించేది. కానీ గత పన్నెండు సంవత్సరాలుగా మనప్రభుత్వం అనుసరిస్తున్న విదేశీ విధానాల్లో వచ్చిన పెనుమార్పులు మన స్వతంత్రతనుదెబ్బతీస్తున్నాయి. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో మన ప్రభుత్వ ఆలోచనలు, అనుసరిస్తున్న విధానాలు వెంటనే మార కపోతే దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందని గ్రహించాలి. ●

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అమెరికాలో మిన్నంటిన దీపావళి వేడుకలు



**న్యూయార్క్, అక్టోబరు 17:** అమెరికాలో దీపావళి సంబరాలు మిన్నంటాయి. దేశంలోని పలు ప్రధాన నగరాల్లో ఈ వెలుగుల పండగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మేయర్లు, రాష్ట్ర గవర్నర్లు వంటి ప్రముఖ అమెరికన్ రాజకీయ నేతలు పాల్గొని, ప్రవాస భారతీయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ సమాజం అమెరికా అభివృద్ధికి అందిస్తున్న సేవలను వారు ప్రత్యేకంగా కొనియాడారు. న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ తన అధికారిక నివాసమైన గ్రేసీ మాన్షన్‌లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూయార్క్ నగర సాంస్కృతిక, ఆర్థిక ప్రగతిలో భారతీయ సమాజం పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని అన్నారు. భారత కాన్సులేట్ జనరల్ తరఫున ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ కాన్సుల్ జనరల్ విశాల్ జయేష్‌భాయ్ హార్ష్.. వెలుగు, ఆశ, ఆనందానికి ప్రతీకైన దీపావళి సందేశాన్ని అందరికీ తెలియజేశారు. మరోవైపు న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచుల్ ఫ్లషింగ్‌లోని శ్రీ స్వామినారాయణ మందిరంలో జరిగిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రవాస భారతీయులకు నిరంతరం మద్దతు ఇస్తున్నందుకు గవర్నర్‌కు కాన్సులేట్ అధికారులు ధన్యవాదాలు తెలిపారు. ఫ్లోరిడాలోని టల్లాహస్సీలో ఉన్న ఫ్లోరిడా క్యాపిటల్‌లో మొట్టమొదటిసారిగా దీపావళి సంబరాలు నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర అధికారులు, ప్రవాస భారతీయ ప్రముఖులు పాల్గొన్నారు. టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో కూడా దీపావళి శోభ వెల్లివిరిసింది. హ్యూస్టన్ సిటీ హాల్‌లో మేయర్ జాన్ విట్‌మిర్‌తో కలిసి భారత కాన్సుల్ జనరల్ డీసీ మంజునాథ్ వేడుకల్లో పాల్గొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే ఈ పండగను సిటీ హాల్‌లో నిర్వహించినందుకు మేయర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన కథక్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# బీహార్‌లో మళ్లీ గెలుస్తాం

## - నితీశ్ నేతృత్వంలోనే ఎన్నికల బరిలోకి ఎన్డీయే
## - ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నాం: అమిత్‌షా



**పాట్నా, అక్టోబరు 17:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి కూడా భారీ మెజారిటీతో గెలువబోతున్నాం, మళ్లీ ఎన్డియే ప్రభుత్వం ఏర్పడబోతుందని కేంద్ర హోంమంత్రి, బిజెపి అగ్రనేత అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారంనాడు శరణ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈసారి బీహార్ ప్రజలకు నాలుగు దీపావళి పండగలు జరుపుకొనే అవకాశం వచ్చింది. శ్రీరాముడు అయోధ్యకు తిరిగివచ్చినందుకు మొదట దీపావళి చేసుకుంటారు. ఆ తర్వాత ప్రభుత్వ పథకం కింద మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేసినప్పుడు రెండోది, జిఎస్‌టిపై 5శాతానికి తగ్గించినప్పుడు మూడో దీపావళి. ఇక నవంబర్ 14న ఓట్ల లెక్కింపు రోజు నాలుగో దీపావళిని జరుపుకొంటారు. ఎన్‌డియేకు మోడీ ప్రధాన ఆకర్షణ అయినా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోనే బిహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు షా వెల్లడించారు. లాలూ, రబ్రీదేవి జంగిల్‌రాజ్ పాలనకు వ్యతిరేకంగా నితీశ్ పోరాడాడని గుర్తు చేశారు. బీహార్‌ను జంగిల్ రాజ్ నుంచి విముక్తి చేశారని కొనియాడారు. ప్రధాని మోడీ గత 11 ఏళ్లుగా బీహార్ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని వివరించారు. ఎన్‌డియే ప్రభుత్వం ఏర్పాటు కాకముందు బీహార్‌లో వలసలు, దోపిడీలు, హత్యలు, కిడ్నాప్‌లు సాధారణంగా ఉండేవని గుర్తుచేశారు. మరోవైపు గ్యాంగ్ స్టర్ మహ్మద్ శాబుద్దీన్ కుమారుడు ఒసామాకు ఆర్‌జెడి టికెట్ కేటాయించడం పట్ల అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అభ్యర్థులను బరిలో దింపి బీహార్ ప్రజల భద్రతకు ఎలా హామీ ఇస్తారని ప్రశ్నించారు. అలాగే లాలూ ప్రసాద్ యాదవ్, మహాఘట్ బంధన్ పై అమిత్ షా విమర్శలు గుప్పించారు. లాలూ పాలనను చూసిన బీహార్ ప్రజలు, మళ్లీ తమ రాష్ట్రంలో మహాఘట్ బంధన్ తిరిగి అధికారంలోకి రావాలని కోరుకోవడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మిత్రపక్షాలను తక్కువగా చూస్తుందని దుయ్యబట్టారు. ఇతర పార్టీలను తక్కువ చేసి చూడడం వల్ల కాంగ్రెస్ కూడా చిన్నదిగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఉన్న ఈ అహంకారమే ఆ పార్టీని బీహార్ నుంచి బెంగాల్ వరకు అన్ని రాష్ట్రాలలో పట్టును కోల్పోయేలా చేసిందన్నారు. అంతకుముందు బీహార్‌లోని ఎన్‌డియేలో చీలికలు ఉన్నాయనే ఊహాగానాలను కేంద్ర హోంమంత్రి, అమిత్ షా తోసిపుచ్చారు. త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు అధినేత, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్‌డియే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాతే బిజెపి, దాని మిత్రదేశాలు సిఎం అభ్యర్థిని నిర్ణయిస్తాయని వెల్లడించారు. ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ అమిత్ షా కీలక విషయాలను వెల్లడించారు. 'ఎన్నికల ఫలితాల తర్వాతే సిఎం అభ్యర్థిని నిర్ణయిస్తాం... నితీశ్ కుమార్ మళ్లీ బీహార్ ముఖ్యమంత్రి అవుతారా? లేదా? అని నిర్ణయించేది నేను కాదు. ప్రస్తుతానికి, మేము నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్నికల బరిలో దిగుతున్నాం. ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్‌డియే పక్షాలన్నీ కలిసి కూర్చుని తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని నిర్ణయిస్తాయి. 2020 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మోడీని నీతీశ్ కలిశారు. జెడియు కంటే ఎక్కువ సీట్లు గెలుచుకున్న బిజెపికి చెందిన అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కానీ తాము ఎల్లప్పుడూ కూటమిని గౌరవించాం. నితీశ్ కుమార్ సంపాదించుకున్న గౌరవం, ఆయన సీనియారిటీ ఆధారంగా ఆయనకే బీహార్ పగ్గాలు అప్పగించాం' అని అమిత్ షా ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాట్నా పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కలిశారు. బీహార్‌లో తాజా రాజకీయ పరిస్థితులపై దాదాపు 15 నిముషాలపాటు చర్చించారు. ఈ భేటీలో జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, బిజెపి సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## 2,000 తోమహాక్ క్షిపణులతో

# పుతిన్‌పై గురి!

## యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్, అక్టోబరు 17:** ఉక్రెయిన్-రష్యా మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను నయానో, భయానో ఒప్పించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి తోమహాక్ క్షిపణులు రెండు వేళ వరకు అందజేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పుతిన్‌తో ఫోన్‌కాల్ నేపథ్యంలో ఈ విషయంపై స్వయంగా ఆయనతో చర్చించినట్లు తెలిపారు. పుతిన్‌తో ఫోన్‌కాల్ విషయంపై విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు తోమహాక్‌లు అందించవద్దంటూ పుతిన్ మిమ్మల్ని కోరారా? అని ఓ రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ.. 'ఉక్రెయిన్‌కు దయచేసి తోమహాక్‌లు ఇవ్వండి. నేను దాన్ని అభినందిస్తున్నా' అని పుతిన్ అంటాడు అని మీరు అనుకుంటున్నారా? అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తర్వాత మీ ప్రత్యర్థికి 2 వేల తోమహాక్ క్షిపణులు ఇస్తే మీకు అభ్యంతరం ఉంటుందా? అని తాను పుతిన్‌ను ప్రశ్నించానని తెలిపారు. దీనిని పుతిన్ నుంచి బలమైన వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. 'నేను నిజంగా అలాగే అన్నాను. ఈ ఆలోచన పుతిన్‌కు నచ్చలేదు. తోమహాక్ అతి దారుణమైన, అతి విధ్వంసకర ఆయుధం. అలాంటి దీర్ఘశ్రేణి ఆయుధం తమపై కాల్పులు జరపాలని ఎవరూ కోరుకోరు' అని ట్రంప్ అన్నారు. ట్రంప్‌తో ఫోన్‌కాల్‌లో ఈ తోమహాక్ క్షిపణుల గురించి పుతిన్ మాట్లాడారని క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషాకోవ్ పేర్కొన్నారు. అవి ఉక్రెయిన్‌కు అందించడంతో.. అమెరికా-రష్యా సంబంధాలు దెబ్బ తింటాయని పుతిన్ ఉద్ఘాటించినట్లు తెలియజేశారు.

ఇక, పుతిన్‌తో అద్భుతమైన సంభాషణ జరిగిందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా వివరించారు. మరికొన్ని రోజుల్లో హంగరీ రాజధాని బుడాపెస్ట్‌లో పుతిన్‌తో భేటీ కానున్నట్లు తెలిపారు. ఇక్కడి చర్చల్లోనైనా రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ముగింపునకు అడుగులు పడాలని భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

## డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పు: సుప్రీంకోర్టు ఆందోళన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:** డిజిటల్ అరెస్టులు ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా ఇదే. దీని పేరు చెప్పి అవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఈ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సిబిఐలకు వారి స్పందన తెలపాలని న్యాయస్థానం ఆదేశించింది. హర్యానాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌కి ఫిర్యాదు పత్రం రాశారు. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారన్నారు. రూ.కోటి ఇస్తే అరెస్టు నుంచి బయటపడొచ్చని బెదిరింపులకు పాల్పడ్డారని, కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి సొమ్ములు కాజేయడాన్ని సిజెఐతో సహా సీనియర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు.

# హెచ్ - 1 బి ఫీజు పెంపుపై యుఎస్ ఛాంబర్ సవాల్





## అధ్యక్షుడు ట్రంప్‌కు మరో సమస్య
## ఫీజు హెచ్చింపు పూర్తిగా చట్ట విరుద్ధం

**వాషింగ్టన్, అక్టోబర్ 17:** హెచ్1బీ వీసా విషయంలో ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. హెచ్ 1బీ వీసా దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచడాన్ని సవాల్ చేస్తూ యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు గురువారం వాషింగ్టన్‌లోని జిల్లా కోర్టులో ట్రంప్ ప్రభుత్వంపై దావా వేసింది. ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ ఫీజు పూర్తిగా చట్టవిరుద్ధమని, ఇది అమలైతే అమెరికన్ కంపెనీలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ తన పిటిషన్‌లో పేర్కొంది. "ఈ నిర్ణయం వల్ల కంపెనీలు తమ కార్మిక వ్యయాలను విపరీతంగా పెంచుకోవాల్సి వస్తుంది. లేదంటే దేశీయంగా ప్రత్యామ్నాయం లేని అత్యంత నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించుకోవడం తగ్గించుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది అమెరికా ఆర్థిక ప్రత్యర్థులకు మేలు చేకూర్చే ప్రమాదకరమైన విధానమని అభిప్రాయపడింది. ఈ ఫీజు వల్ల అమెరికా కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను నియమించుకోవడం చాలా ఖరీదైన వ్యవహారంగా మారుతుందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ బ్రాడ్లీ ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు ఈ నిర్ణయాన్ని ట్రంప్ ప్రభుత్వం గట్టిగా సమర్థిస్తోంది. అమెరికన్లకే ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ ఫీజును తీసుకొచ్చినట్లు ట్రంప్ గతంలో తెలిపారు. ఈ విధానం వల్ల కంపెనీలు విదేశీ ఉద్యోగులను నియమించు కోవడానికి వెనకాడుతాయని, బదులుగా అమెరికన్ గ్రాడ్యుయేట్లకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లోకి తీసుకుంటాయని వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ వివరించారు. హెచ్1బీ నిబంధనలపై ట్రంప్ సర్కారుకు ఇది రెండో పెద్ద న్యాయ పరమైన సవాలు. ఈ నెల 3న కూడా కొన్ని యూనియన్లు, విద్యాసంస్థలు కలిసి కాలిఫోర్నియా కోర్టులో దావా వేశాయి. ఈ వివాదంపై గందరగోళం నెలకొనడంతో వైట్ హౌస్ గతంలోనే స్పష్టతనిచ్చింది. లక్షడాలర్ల ఫీజు వీసా కోసం దరఖాస్తు చేసుకునే కొత్తవారికి మాత్రమే.

# ఏకకాలంలో భారత్, అఫ్ఘాన్‌తో యుద్ధానికి సిద్ధం

## పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్



**ఇస్లామాబాద్, అక్టోబరు 17:** భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనలు చేసింది. అఫ్ఘానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేసారు. తాలిబాన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. ఖ్వాజా ఆసిఫ్ టివి ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్నకు ఎదురుకాగా.. 'అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను' అని చెప్పారు. అప్పుడే భారత్ గురించి నోరు పారేసుకున్నారు. అలాగే తమ దేశంలో నివసిస్తోన్న అఫ్ఘాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. 'వారి వల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారి ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు. పాక్‌లో అక్రమంగా నివసిస్తోన్న వారిని గుర్తిస్తున్నాం. వారు వెంటనే మా దేశాన్ని వీడాలి' అని వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో ఇరు దేశాల బలగాలు పలుచోట్ల పరస్పరం దాడులకు దిగిన సంగతి తెలిసిందే.

# ఆ అధికారుల ఇళ్లల్లో కరెన్సీ కట్టలు

## - సిబిఐ సోదాలు.. భారీగా నగదు సీజ్ - బంగారు ఆభరణాలు, కార్లు స్వాధీనం
## - పంజాబ్‌లో డిఐజి ఇంట్లో రూ.5 కోట్ల నగదు - ఎన్‌హెచ్ ఇఇ నివాసంలో రూ.2.62 కోట్లు లభ్యం



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** పంజాబ్‌లో లంచం తీసుకుంటూ పట్టుబడిన డిఐజి హర్చరణ్ సింగ్ భుల్లార్, ఎన్‌హెచ్‌ఐడిసిఎల్ ఇఇ మైస్నం రితేన్ కుమార్ సింగ్ ఇళ్లలో సిబిఐ అధికారులు సోదాలు చేశారు. కళ్లు చెదిరేలా ఆ అధికారుల ఇళ్లలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. డిఐజికి సంబంధించి పంజాబ్, చండీగఢ్‌లలో భుల్లార్ నివాసాల్లో సుమారు 5 కోట్ల నగదు, కిలోన్నర బంగారు ఆభరణాలు, స్థిరాస్తుల డాక్యుమెంట్లు, రెండు లగ్జరీ వాహనాల తాళాలు, 22 లగ్జరీ గడియారాలు లభ్యమయ్యాయి. లాకర్ తాళాలు, 40 లీటర్ల దిగుమతి చేసిన మద్యం, డబుల్ బ్యారెల్ గన్, పిస్టల్, రివాల్వర్, ఎయిర్‌గన్‌తో సహా తుపాకులు, మందుగుండు సామగ్రిని సిబిఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అటు జాతీయ రహదారుల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఐడిఎల్) ఎగ్జికూటివ్ డైరెక్టర్ మైస్నం రితేన్ కుమార్ సింగ్‌కు సంబంధించి గువహటి, ఘజియాబాద్, ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో సిబిఐ అధికారులు సోదాలు చేశారు. లెక్కల్లో చూపని రూ.2.62 కోట్ల నగదు, భూములు, 20 అపార్ట్‌మెంట్లకు సంబంధించిన దస్త్రాలు లభించాయి. నిందితుడు, అతని కుటుంబ సభ్యుల పేరు మీదు ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో తొమ్మిది ప్రీమియం అపార్ట్‌మెంట్ యూనిట్లు, ఒక ప్రీమియం ఆఫీస్ స్థలం, మూడు నివాస ప్లాట్లు, బెంగళూరులో లగ్జరీ అపార్ట్‌మెంట్, నివాస ప్లాట్, గువహటితో నాలుగు అపార్ట్‌మెంట్లు, రెండు నివాస ప్లాట్లు, ఇంఫాల్ వెస్ట్‌లో వ్యవసాయ భూమి, రెండు హోమ్‌స్టెడ్ ప్లాట్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఆరు హై-ఎండ్ లగ్జరీ కార్లు, లక్షల విలువైన రెండు ఖరీదైన గడియారాలను కూడా సిబిఐ అధికారులు సీజ్ చేశారు.

# సంక్షిప్తంగా..

## ముత్తాఖీ ప్రెస్‌మీట్‌కు మహిళా జర్నలిస్టులు



**వాషింగ్టన్, అక్టోబరు 17:** ఇటీవల భారత్‌కు వచ్చిన అఫ్ఘాన్ విదేశాంగ మంత్రి అమిర్‌ఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే మహిళలు పాల్గొనకుండా నిషేధం విధించారంటూ విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. తర్వాత ఆయనే స్వయంగా తన ప్రెస్‌మీట్‌కు రావాల్సిందిగా మహిళా జర్నలిస్టులను ఆహ్వానించారు. దీనిపై తాజాగా అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు సిడ్నీ కామ్లేజర్ డోవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మహిళల సమాన హక్కుల కోసం ఎదురొడ్డి నిలబడిన జర్నలిస్టులను చూస్తూ సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. కామ్లేజర్ డోవ్ భారత్‌లోని మహిళా జర్నలిస్టులను ప్రశంసిస్తూ.. భారత్‌కు చెందిన మహిళా జర్నలిస్టులు తమ సమాన హక్కుల కోసం ధైర్యంగా పోరాడారన్నారు.

## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఇంటికి బాంబు బెదరింపు

**చెన్నై, అక్టోబరు 17:** భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నివాసానికి బాంబు బెదిరింపు రావడం శుక్రవారం చెన్నైలో తీవ్ర కలకలం సృష్టించింది. గుర్తుతెలియని వ్యక్తులు పంపిన ఈమెయిల్ హెచ్చరికతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే, క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం ఈ బెదిరింపు కేవలం ఉత్తిదేనని తేల్చడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చెన్నైలోని ఎస్టేట్ పోలీస్ స్టేషన్‌కు ఈ రోజు ఒక ఈమెయిల్ వచ్చింది. నగరంలోని మైలాపూర్ ప్రాంతంలో ఉన్న ఉపరాష్ట్రపతి నివాసంలో బాంబు పెట్టినట్లు ఆ మెయిల్‌లో ఉంది. ఈ హెచ్చరికను ఉన్నతాధికారులు అత్యంత తీవ్రంగా పరిగణించారు. వెంటనే సీనియర్ పోలీసు అధికారులు, బాంబ్ డిటెక్షన్ నిపుణులు, స్నిఫర్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి హుటాహుటిన రంగంలోకి దిగారు. అయితే, విచారణలో ఒక ఆసక్తికర విషయం బయటపడింది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఈ ఏడాది సెప్టెంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన బెదిరింపు వచ్చిన మైలాపూర్‌లోని ఇంటిని దాదాపు ఏడాది క్రితమే ఖాళీ చేసినట్లు పోలీసు వర్గాలు ధృవీకరించాయి. ప్రస్తుతం ఆయన చెన్నైలోని అత్యంత కీలకమైన పోయెస్ గార్డెన్ ప్రాంతంలో ఉంటున్నారు.

## ఏడువేల కిలోమీటర్ల వేగంతో 'ధ్వని' క్షిపణి

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** రక్షణ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధిస్తుంది. హైపర్ సోనిక్ క్షిపణులపై ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ (హెచ్‌జివి) 'ధ్వని ' పరీక్షలను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని డిఆర్‌డిఒ ప్రయత్నిస్తున్నది. అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై భారత రక్షణ రంగం దృష్టి సారిస్తోంది. 2025 డిసెంబర్ నాటికి హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్ ధ్వని పరీక్షలను పూర్తి చేయాలని ప్రయత్నిస్తోంది. బ్రహ్మోస్ ఆపరేషన్ సింధూర్‌లో వినియోగించిన శక్తివంతమైన క్షిపణి బ్రహ్మోస్ భారతదేశం , రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఒక ఒక సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్. దీనిని భూమి, సముద్రం , గాలి నుండి ప్రయోగించవచ్చు. అంతే కాదు,ఇది అత్యంత వేగవంతమైన , శక్తివంతమైన క్షిపణి వ్యవస్థలలో ఒకటిగా పరిగణించబడుతుంది.

ధ్వనివేగానికి మూడు రెట్లు వేగాన్ని కలిగి ఉంది, దాని పరిధి 300 కిలోమీటర్ల వరకు ఉంటుంది.

# గుజరాత్ కొత్త మంత్రివర్గం ప్రమాణం

## కొత్త కూర్పులో 26 మంది..
## క్రికెటర్ జడేజా భార్యకు కేబినెట్ బెర్త్
## ఉప ముఖ్యమంత్రిగా హార్ష్ రమేష్ భాయ్



**అహ్మదాబాద్, అక్టోబరు 17:** గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. 26 మంది సభ్యులతో కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది. శుక్రవారం వారంతా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హోం మంత్రి హార్ష్ సంఘవి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త మంత్రివర్గంలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజా కు కూడా చోటు దక్కింది. ఆమె కూడా ఇవాళ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సహా పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. టీమిండియా క్రికెటర్ రవీంద్ర జడేజా తన కూతురుతో కలిసి హాజరయ్యారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మంత్రులంతా నిన్న మూకుమ్మడిగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ వారి రాజీనా మాలను ఆమో దిం చారు. అనంతరం సీఎం భూపేంద్ర పటేల్ నిన్న రాత్రి గవర్నర్‌ను కలిశారు. మంత్రుల రాజీ నామాలను అధికారికంగా గవర్నర్‌కు సమర్పించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుల, ప్రాంతీయ ప్రాతినిధ్యాన్ని సమతుల్యం చేయడం, ప్రభుత్వంలో కొత్త శక్తిని నింపేందుకు బీజేపీ విస్తృత వ్యూహంలో భాగంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. గుజరాత్ ఉప ముఖ్యమంత్రి గా బీజేపీ నేత హార్ష్ రమేష్‌భాయ్ సంఘవీ శుక్రవారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. గుజరాత్ మంత్రివర్గం పునర్వవస్థీకరణలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా 16 మంది రాష్ట్ర మంత్రులు గురువారం రాజీనామా చేశారు. సంఘవితో పాటు బీజేపీ నేతలు స్వరూజ్‌జీ ఠాకోర్, ప్రవీణ కుమార్ మాలి, రుషీకేశ్ పటేల్, దర్శన్ వాఘేలా, కున్వర్‌జీ బవలియా, రివబ జడేజా, అర్జున్ మోద్వాడియా, పర్సోత్తమ్ సోలంకి, జితేంద్ర వాఘాని, ప్రఫుల్ పాన్‌షేరియా, కునుభాయ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్, ముఖ్యమంత్రి పటేల్ సమక్షంలో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. గుజరాత్ 6వ ఉప ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన వ్యక్తి సంఘవి. కాంగ్రెస్ నేత చిమన్‌బాయ్ పటేల్ తొలి ఉప ముఖ్యమంత్రిగా 1972 నుంచి 73 వరకూ పనిచేశారు.

పటేల్‌తో పాటు కాంగ్రెస్ మరో నేత కాంతిలాల్ ఘాయ్ ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రిగా అప్పటి ముఖ్యమంత్రి ఘన్‌శ్యామ్ ఓజా మంత్రివర్గంలో పనిచేశారు. మూడో ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత కేశూభాయ్ పటేల్ 1990 మార్చి నుంచి అక్టోబర్ నుంచి వరకూ అప్పటి సీఎం చిమన్‌భాయ్ పటేల్ ఆధ్వర్యంలో పనిచేశారు. పటేల్ సైతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా 1995 మార్చి నుంచి అక్టోబర్ వరకూ, తిరిగి 1998 మార్చి నుంచి 2001 వరకూ పనిచేశారు.

## ప్రైవేటు కొరియర్లకు దీటుగా ఇండియాపోస్ట్ సేవలు!

**న్యూఢిల్లీ,అక్టోబరు 17:** భారత తపాలా శాఖ తన సేవలను ఆధునికీకరించే దిశగా ఒక భారీ సంస్కరణలు తెస్తోంది. ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు దీటుగా, దేశంలో ఏ మూలకైనా కేవలం 24 గంటల్లో పార్శిళ్లను చేరవేసే కొత్త విధానాన్ని తీసుకురానుంది. 2026 జనవరి నాటికి ఈ సరికొత్త స్పీడ్ డెలివరీ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం ప్రకటించారు. ప్రస్తుతం ఇండియా పోస్ట్ ద్వారా వేగంగా పంపినా, పార్శిల్ చేరడానికి మూడు నుంచి ఐదు రోజుల సమయం పడుతున్న సంగతి తెలిసిందే. మంత్రి సింధియా మరిన్ని వివరాలు వెల్లడించారు. దేశంలోని అన్ని మెట్రో నగరాలు, రాష్ట్ర రాజధానుల్లో 48 గంటల్లో గ్యారెంటీ డెలివరీ సేవలను కూడా 2026 జనవరి నాటికి ప్రారంభిస్తామని తెలిపారు. అంతేకాకుండా, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఈకామర్స్ సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు స్పష్టం చేశారు. 2026 మార్చి నాటికి ఈ సంస్థలకు చెందిన వస్తువులను వినియోగదారుల ఇళ్లకు చేర్చే లాస్ట్‌మైల్ డెలివరీ సేవలను కూడా ఇండియా పోస్ట్ అందిస్తుందని ఆయన వివరించారు. దాదాపు రెండు నెలల విరామం తర్వాత అమెరికాకు అన్ని రకాల అంతర్జాతీయ పోస్టల్ సేవలను అక్టోబర్ 15 నుంచి తపాలా శాఖ తిరిగి ప్రారంభించింది. దేశవ్యాప్తంగా సుమారు 1,64,999 పోస్టాఫీసులతో ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటి.

## సైనిక స్థావరంపై ఉగ్రవాదుల దాడి



**గువాహతి, అక్టోబరు 17:** ఈశాన్య రాష్ట్రం అసోంలో ఉద్రిక్తత నెలకొంది. భారత సైనిక స్థావరం లక్ష్యంగా ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. 24 గంటల వ్యవధిలోనే ఇది రెండో దాడి కావడం ఆందోళన కలిగిస్తోంది. టిన్ సుకియా జిల్లాలోని కకోపథార్ పట్టణంలో ఉన్న 19 గ్రెనేడియర్స్ యూనిట్‌కు చెందిన ఆర్మీ క్యాంప్‌పై శుక్రవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగింది. గుర్తుతెలియని దుండగులు క్యాంప్‌పైకి గ్రెనేడ్లు విసిరి, కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు సైనికులు గాయపడినట్లు అధికారులు తెలిపారు. స్థానిక కథనాల ప్రకారం అర్ధరాత్రి 12:15 గంటల ప్రాంతంలో మొదలైన కాల్పులు దాదాపు అరగంట పాటు కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ దాడి వెనుక యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం ఇండిపెండెంట్ (ఉల్ఫాఐ) హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని మన్‌మాంలో అస్సాం రైఫిల్స్ దళాలపై ఉల్ఫాఐ తిరుగుబాటుదారులు దాడికి పాల్పడినారు.

# రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలి

## వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## పోలీసు, ఆరోగ్య శాఖ అధికారులతో మంత్రి సమీక్ష

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. తెలంగాణలో మత్తు పదార్థాల వ్యసనాన్ని పూర్తిగా అరికట్టాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యం ఉంటేనే ఈ లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనపై పోరులో పోలీసు, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ మేరకు రెండు శాఖల ఉన్నతాధికారులతో మంత్రి శుక్రవారం సెక్రటేరియట్‌లో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యల గురించి సందీప్ శాండిల్య మంత్రికి వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని గుర్తించి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తున్నామని, ఆ తర్వాత వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు అయినవారిని గుర్తించేందుకు ఆరోగ్యశాఖ సహకారం తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడం కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, సమాజంలోని అన్ని వర్గాలను ఈ పోరాటంలో భాగస్వామ్యం చేయాలని అధికారులను సూచించారు. పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, టీచర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటున్న వారిలో వచ్చే బిహేవియరల్ చేంజెస్ గురించి అవగాహన ప్రతి పేరెంట్స్, టీచర్లకు ఉండాలన్నారు. ఈ విషయంలో విస్తృత ప్రచారం జరగాలని మంత్రి సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో రెగ్యులర్‌గా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తల ద్వారా గ్రామాల్లో, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అన్ని విద్యా సంస్థల్లో యాంటి నార్కొటిక్స్ వింగ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. డ్రగ్స్ వినియోగం నుంచి బయటపడేసేందుకు అవసరమైన డీ అడిక్షన్ సెంటర్లను బలోపేతం చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని టీచింగ్ హాస్పిటళ్లలో డీఅడిక్షన్ వార్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎర్రగడ్డలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో డీఅడిక్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని, అలాగే అవసరాన్నిబట్టి మరిన్ని సెంటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మత్తు పదార్థాలకు అలవాటైన పిల్లలను తల్లిదండ్రులే డీఅడిక్షన్ సెంటర్లకు తీసుకురావాలని మంత్రి కోరారు. పూర్తి ఉచితంగా వారికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తామని తెలిపారు. పిల్లలకు మత్తు పదార్థాలకు అలవాటైనట్టు గుర్తించినా ఆలస్యం చేయొద్దని, ఆలస్యమయ్యేకొద్దీ వారి ఆరోగ్యం మరింత పాడయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. సమావేశంలో టీఎన్‌ఏబీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హెల్త్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, టీఎన్‌ఏబీ ఎస్పీ రూపేశ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్, డాక్టర్ అనిత, న్యాయ శాఖ అడిషనల్ సెక్రెటరీ సునీత పాల్గొన్నారు.

# ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు



## భూపరిపాలనలో మరో ముందడుగు

## ముఖ్యమంత్రి చేతులమీదుగా లైసెన్సుల పంపిణీ: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 17:** తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా రైతాంగానికి మెరుగైన సేవలను అందించడానికి, రాష్ట్రంలో భూములకు సంబంధించిన అనేక సంక్లిష్టమైన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే గ్రామపాలనాధికారులు (జీపీవో)ను అందుబాటులోకి తీసుకురాగా తాజాగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందేలా ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈనెల 19వ తేదీన శిల్ప కళావేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్‌ను జత పరచడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగం పాత్ర మరింత క్రియాశీలం కానుంద న్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతం ఉన్న 350 మంది సర్వేయర్లు సరిపోరని, మరికొంత మంది సర్వేయర్లు అవసరమవుతారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక వైపు లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీచేయడం, ఇంకోవైపు భూముల సర్వేకు అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూశాఖ కార్యదర్శి డిఎస్ లోకేష్‌కుమార్, సర్వే విభాగం కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంత్‌తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావడానికి దరఖాస్తులను ఆహ్వానించగా పది వేల మంది దరఖాస్తు చేసుకోగా తొలివిడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వగా, ఇందులో 3,465 మంది అర్హత సాధించారని తెలిపారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని తెలిపారు. రెండో విడతలో మరో మూడు వేల మందికి ఆగస్టు 18వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించామని, ఈనెల 26వ తేదీన జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి 40 రోజుల పాటు అప్రంటిస్ శిక్షణ ఉంటుందని వీరి సేవలు కూడా డిసెంబర్ రెండవ వారం నాటికి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు ఎంఐఎం దూరం

## నవీన్‌యాదవ్‌కు మద్దతు ప్రకటించిన అసదుద్దీన్ ఒవైసీ

## ప్రచారానికి రానన్న అసద్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 17, ప్రభాతవార్త:** అత్యధికంగా మైనార్టీలు ఉన్న



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌తో అసదుద్దీన్ ఒవైసీ

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల బరి నుంచి ఎంఐఎం పార్టీ తప్పుకొంది. తమ పార్టీ నుండి అభ్యర్థిని నిలపడం లేదని తేల్చి చెప్పింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు తన మద్దతును ప్రకటించింది. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లోని మజీద్‌లో నమాజ్‌కు వచ్చిన అసదుద్దీన్ ఓవైసీని ఆదే సమయంలో సమీపంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ సమర్పించి బయటకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్‌కు అసద్ తన పూర్తి మద్దతును ప్రకటించారు. కొన్ని మీడియా ఛానెళ్లతో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మాట్లా డుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, మురికి వాడల్లో సమస్యలు ఎలాంటి పరిష్కారం నోచుకోలేదన్నారు. అనారోగ్యం తో ఉన్న మాగంటి గోపీనాథ్‌కు గత ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వడం తప్పు అనే రీతిలో ఆయన వ్యాఖ్యలు చేశారు. సెంటిమెంట్ కాదని, అభివృద్ధి ముఖ్యమని, అసెంబ్లీ ఎన్నికల్లో 37 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్ని కల్లో కేవలం 15 శాతం ఓట్లు సాధించిందన్నారు. బీఆర్ఎస్ ఓట్లన్ని ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మళ్లినట్లు స్పష్టం అవుతుందన్నారు. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన సిపిఐ

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నవంబరు 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్ధతు ఇవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు కోరుతూ మహేశ్‌కుమార్ గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చెర్మన్ కె. నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఈటి నరసింహా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, కలవేణ శంకర్, ఎం. బాలనరసింహా, బాగం హేమంత రావు, వి.ఎస్.బోస్, సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యంలతో బేటి అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ సంపూర్ణ మద్దతు అందిస్తుందని రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన అంశంపై కూడా చర్చించినట్టు తెలిసింది.

# నవీన్‌యాదవ్‌కు వస్తున్న క్రేజ్ ఓర్వలేని బిఆర్ఎస్

## పిసిసి అధికార ప్రతినిధి నిజాముద్దీన్


**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ప్రజలలో నవీన్ యాదవ్ కు వస్తున్న క్రేజ్ చూసి బిఆర్ఎస్ పార్టీ ఓర్వలేక ఆయనపై తప్పుడు ప్రచారంతో ఆరోపణలు చేస్తోందని టిపిసిసి అధికార ప్రతినిధి నిజాముద్దీన్ ఆవేదన చెందారు. గాంధీభవన్‌లో టిపిసిసి అధికార ప్రతినిధి నిజాముద్దీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ ముస్లింలపై తప్పుడు వ్యాఖ్యానాలు చేశారని తప్పుడు కథనాలు సృష్టించి బిఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ముస్లిం ఓటర్లను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్‌లో 10 ఏళ్ల బిఆర్ఎస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకు నేందుకు నవీన్ యాదవ్ పై బురద జల్లుతున్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ ఓటర్లు బిఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ దీనిని సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



# బాలల హక్కుల పరిరక్షణతో ఉన్నత విలువలు కలిగిన సమాజం

## పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ఆధునిక జీవనశైలి బాలల హక్కులకు భంగం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయని వారి హక్కుల పరిరక్షణ తోనే ఉన్నత విలువలు కలిగిన సమాజం ఏర్పడుతోందని పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చైల్డ్ రైట్స్ కమిషన్ ఆహ్వానం మేరకు చైల్డ్ రైట్స్ కమిషన్‌ను టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికలు కష్టం వచ్చినప్పుడు చెప్పుకోవాల్సిన 1098టోల్ ఫ్రీనెంబర్‌పై విస్తృత ప్రచారం జరుగాలని కోరారు. బాలబాలికపై పెరుగుతున్న హింసను పీడనను కట్టడి చేసి బాల్యం కేవలం పాఠశాలకు పుస్తకాలకు క్రీడలకు మాత్రమే పరిమితం చేయాలని వారితో ఏలాంటి పనులు చేయించడం మన జాతి నిర్మాణంకు మంచిదికాదని చెప్పారు. పుట్టిన ప్రతి బాలబాలిక వెయ్యి రోజులు ఆరోగ్యంగా ఆహ్లాదంగా పెరిగితే వారిలో మానసిక పరిపక్వత అభివృద్ధి చెంది మంచి మేధావులుగా తయారుతారని అలాంటి పరిస్థితికి చైల్డ్‌రైట్ కమిషన్ దారులు వేయాలని కోరారు. మహేష్ కుమార్ గౌడ్‌ను కమిషన్‌కు చైర్ పర్సన్ కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి ,కమిషన్ సభ్యులు వచన్ కుమార్,వందన గౌడ్, చందన, బండి అపర్ణ, ప్రేమలత అగర్వాల్ పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. చైల్డ్ రైట్స్ కమిషన్ రాష్ట్రంలో బాగా పనిచేస్తుందని అదేవిధంగా భవిష్యత్తులో కూడా బాలల హక్కులు పరిరక్షణ కోసం మరింతగా కృషి చేస్తామని చైల్డ్‌రైట్ కమీషన్ మహేష్‌కు హామిఇచ్చింది.



సిఎం ప్రజావాణి కార్యక్రమంలో చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

# సిఎం ప్రజావాణిలో 236 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 17, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 236దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 63 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 63 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 02 దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 53దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్యా దేవరాజన్‌లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**భారీగా తరలివచ్చిన ల్యాబ్ టెక్నీషియన్లు**

తమ సమస్యల పరిష్కారం కోసం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ సీఎం ప్రజావాణీకి భారీ ఎత్తున తరలి వచ్చారు.వారి సమస్యలు విన్న చిన్నారెడ్డి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేసారు.దీంతో వారు సంతోషం వ్యక్తం చేసారు.

# కాంగ్రెస్ పార్టీలో స్వాతంత్ర్యం ఎక్కువ

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీలో నియంత పాలన ఉండదు స్వాతంత్రం ఉంటుందని కొండ సురేఖ అంశం టీ కప్పులో తుఫాన్ లాంటిదని ఎంపి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఢిలీలో విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ కొండా సురేఖ అంశంపై ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి ప్రెసిడెంట్ చర్చిస్తున్నారని కాంగ్రెస్ పార్టీలో అప్పుడప్పుడు సమస్యలు వస్తాయిఅవి సర్దుమనుగుతాయి అని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలు, రేపటి బిసి బంద్ ముఖ్యం, ఆ బంద్ కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తుందని ఇది మా చిత్తశుద్ధి నిదర్శంన అన్నారు.రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జన గణనలో, కుల గణన జరగాలని కోరారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కుల గణన చేసిందిస్థానిక సంస్థల 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పి వేశామని గుర్తుచేశారు. బిసి రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి తో ఉంది,అన్ని పొలిటికల్ పార్టీలతో ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి మద్దతు కోరామని అన్నారు. ఆర్ కృష్ణయ్య పై గురుత్వర బాధ్యత ఉంది ఆర్ కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా బిసి రిజర్వేషన్ కోసం చేయాలని కోరారు. బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు బండి, కిషన్ రెడ్డి, సంజయ్ ఢిల్లీకి తీసుకొచ్చిబిసి రిజర్వేషన్ బిల్లు పై ప్రధానితో చర్చించాలని ఆయన సూచించారు. మేము కూడా మద్దతు ఇస్తామని అన్నారు.మీతో ప్రధాని, రాష్ట్రపతిని కలుస్తామని చామల అన్నారు, కాంగ్రెస్ పార్టీబిసి కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాం రేపటి బిసి బంద్ ను జయప్రదం చేయండని కోరారు. బిసి లకు న్యాయం చేసి బిజెపి క్రెడిట్ తీసుకున్న మాకు నష్టం లేదు కేబినెట్ లో ఆమోదం తెలిపి గవర్నర్ కి పంపించామన్నారు రేపటి బిసి బంద్ కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపై కొచ్చి బిసి లకు న్యాయం చేయాలని కోరారు.

# జూబ్లీ ఎన్నికలు సెమీ ఫైనల్

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్ (బేగంపేట) అక్టోబరు 17, ప్రభాతవార్త:** జూబ్లీ హిల్స్‌లో జరగనున్న ఉప ఎన్నికలు తమకు సెమీ ఫైనల్ లాంటివి అని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ పరిధిలోని వెస్లీ కళాశాలలో క్రైస్తవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిం చారు. ఈ సమ్మేళ నంలో మంత్రి అడ్లూరి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకు రావాలని, ఆ ఎన్నికలకు ఇప్పటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సెమీఫైనల్ లాంటి వని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు.క్రిస్టియన్, దళిత,మైనార్టీ పేద వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని అన్నారు. జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల్లో దళిత, క్రిస్టియన్, మైనార్టీ వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు కోసం కృషి చేయాలని ప్రతిఒక్కరూ ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



వెస్లీ కళాశాలలో క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్.

**ప్రాణమున్నంత వరకు కాంగ్రెస్ లోనే: మంత్రి అడ్లూరి**

2023 ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకత్వం తనకు ఫోన్ చేసి చొప్పదండి టికెట్‌తో పాటు రూ 50కోట్లు ఇస్తామని,పోటీచేయాలంటూ తనను కోరిందని అయినా తాను పట్టించుకోలేదన్నారు.ప్రాణ మున్నంత వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉండాలని నిశ్చయించుకుని ఉండిపోయానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు.తాను ఎన్నికల్లో గెలిచాక కూడా బీఆర్ఎస్,బీజేపీ నుంచి కూడా పిలుపు వచ్చిందన్నారు.

# అభివృద్ధి విషయంలో అనిరుధ్‌రెడ్డి అసంతృప్తి గళం

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** కాంగ్రెస్‌లో నిత్యం ఎక్కడో ఒకచోట అసంతృప్తి స్వరం సొంత పార్టీ నేతలు వినిపించడమే సర్వసాధారణంగా మారింది. అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇంటికి అర్ధరాత్రి పోలీసులు రావడంతో 36 గంటలు హైడ్రామా జరిగిన విషయం రాష్ట్ర ప్రజలు మరిచిపోకముందే మరోమారు ముఖ్యమంత్రి సొంత ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యే అభివృద్ధి విషయం లో జరుగుతున్న వివక్షపై అసంతృప్తి గళం విప్పారు. కేవలం ముఖ్యమంత్రి, మంత్రుల నియోజక వర్గాలు మాత్రమే అభివృద్ధి చెందుతు న్నాయని అర్థం వచ్చేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. సంచలనాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన అనిరుధ్ రెడ్డి సమయం వస్తే యథార్థవాదిగా మాట్లాడుతూ అధికార పార్టీని ఇరుకున పెడుతూనే ఉంటారు. శుక్ర వారం జడ్చర్ల డిసిసి అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి జరిగిన అభిప్రాయ సేకరణ కార్యక్ర మంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ "మరో రెండు సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నేను కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని అవుతానని మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో మంత్రుల నియోజకవర్గాలకే నిధులు వెళుతున్నాయి. ఒకసారి కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో చూడండి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్ల దాదాపుగా రూ.5000 కోట్లతో అభివృద్ధి పనులు అక్కడే జరుగుతు న్నాయి. మంత్రుల నియోజకవర్గాల లోనూ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు పనులు జరుగుతు న్నాయి అన్నారు. నా జడ్చర్ల నియోజక వర్గం ప్రజలు ఎన్నో ఆశలతో నన్ను ఎన్నికలలో గెలిపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతకైనా పోరాడుతాను అని చెప్పారు. ఇంకో రెండు సార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే,నేను కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని అవుతానినియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తాను అని ఎమ్మెల్యే చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళు కావస్తోంది ఎమ్మెల్యేలు కూడా తమకు అసెంబ్లీ నియోజకవర్గం అభివృద్ధి కావాలని కోరుతున్నారని పేర్కొన్నారు.



# న్యాయం జరిగేలా చూడండి

## సిపిఐ నేతలకు ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్ మెంట్‌లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు తమ సమస్యలను పరిష్కరిం చాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితులు శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం ముగ్ధూమ్ భవన్‌లో పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులకు విజ్ఞప్తి చేశారు. భూనిర్వాసిత రైతులు, ప్లాట్ల యజమానులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజే శారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితులు చింతల దామోదర్ రెడ్డి, నడికుడి అంజయ్య, గుజ్జుల సురేందర్ రెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, జాల వెంకటేష్ యాదవ్, జాల శ్రీశైలం యాదవ్, సందగల మల్లేష్ గౌడ్, నాగవల్లి దశరథగౌడ్, నెల్లికండి నాగార్జున యాదవ్, గాజుల భగత్, రావికంటి శ్రీనివాస్, బద్రీద్దున్, తాటికొండ నవీన్ పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు విడుదల

## పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్‌నికోలస్ ఉత్తర్వులు

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం పెండింగ్ బిల్లులను విడుదల చేశారు. జులై నెల వరకు ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఏప్రిల్, జూన్, జులై నెలలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రూ. 25,64,91,000 విడుదల చేశారు. అలాగే 9, 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న నేపథ్యంలో జనరల్ విద్యార్థులకు రూ. 18,88,91,494, ఎస్సీ విద్యార్థులకు రూ. 5,84,13,717, ఎస్టీ విద్యార్థులకు 3,70,70,789 విడుదల చేశారు. 9, 10వ తరగతి విద్యార్థులకు జులై వరకు రూ. 28,43,76,000 విడుదల చేశారు. పెండింగ్ బిల్లులను విడుదల చేసిన నేపథ్యంలో మండల విద్యాధికారులు సంబంధిత ఏజెన్సీలకు బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలస్ ఆదేశించారు.

# నవంబరు 23న 'మాలల రణభేరి మహాసభ'

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

**హైదరాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త:** నవంబర్ 23 న జరగనున్న మాలల రణభేరి మహాసభ విజయవంతం చేయాలని మాల మానవుడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో చెన్నయ్య మాట్లాడుతూ నవంబర్ 23న సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్లో జరిగే ఈమహాసభకు మాలలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. మాలల భవిష్యత్తును అంధకారం చేసే విధంగా ఎస్సీ వర్గీకరణ అనంతరం చేసిన రోస్టర్ పాయింట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగేలా సబ్ కమిటీ లోని కొందరు మంత్రులు కుట్ర చేశారని ఒక శాతం కేటాయించిన గ్రూప్ 1 లోని కులాల కంటే, 5 శాతం కేటాయించిన గ్రూప్ 3 లోని మాలలకు తక్కువ ఉద్యోగాలు వస్తున్నాయంటే మాలలపై ఎంత కుట్ర జరిగిందో అర్థం జేసుకోవాలన్నారు.

బిసిలకు 42 రిజర్వేషన్లను చట్టబద్ధం చేసేందుకు తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మాల మహానాడు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని చెన్నయ్య పేర్కొన్నారు

# రాంకీ సంస్థకు జిహెచ్ఎంసి నోటీసులు

## సమయానికి చెత్త తొలగించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** నగరంలోని చెత్త సేకరణ కార్యకలాపాల్లో ఆలస్యం, నిరక్ష్యల్ల కారణంగా హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ లిమిటెడ్ ( రాంకీ) సంస్థకు శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ నోటీసు జారీ చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న 2,532 గార్బేజ్ వల్నరెబుల్ పాయింట్ (జివిపిఎస్) లలో, అలాగే బిన్ పాయింట్ లలోప్రతి రోజూ ఉదయం 9.30లోపు చెత్త తొలగించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాస్తవానికి రాంకీ సంస్థకు జిహెచ్ఎంసికి మధ్య 10.30 గంటల కల్లా చెత్తను తొలగించేలా ఒప్పందం ఉంది. అక్టోబర్ 16 నగర వ్యాప్తంగా ఉన్న 2,532 గార్బేజ్ వల్నరెబుల్ పాయింట్‌లలో కేవలం 1,879 మాత్రమే నిర్దేశిత సమయంలో తొలగించింది. నిర్దేశిత సమయంలో అలాగే నగరంలో ప్రతిపాదించిన 2,000 సెకండ్ స్టోరేజ్ బిన్లలో 850 బిన్ లను మాత్రమే ఏర్పాటు చేసింది. మిగిలిన బిన్లను వెంటనే ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించారు. నగర ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉదయం 09.30 గంటల కల్లా వ్యర్థాలను తొలగించాలని కమిషనర్ సంస్థను ఆదేశించారు. ఈ ఆదేశాలను పాటించకపోతే, ఒప్పందంలోని నిబంధనల ప్రకారం హెవీ పెనాల్టీలు విధించడంతోపాటు చర్యలు తీసుకుంటా మని జీహెచ్ ఎంసీ కమిషనర్ హెచ్చరించారు.



# ఫ్రాన్స్‌లో భారత రాయబారితో అసెంబ్లీ స్పీకర్, చైర్మన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు17:** బార్బడోస్ దేశంలో జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఏ) కాన్ఫరెన్స్ అనంతరం స్టడీ టూర్లో భాగంగా ఫ్రాన్స్ లో తెలంగాణ శాసన సభా బృందం పర్యటిస్తోంది. శుక్రవారం ఫ్రాన్స్ దేశ రాజధాని ప్యారిస్ లోని భారతదేశ రాయబార కార్యాలయంలో చీఫ్ అంబాసిడర్ సంజీవ్ సింఘాలాతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి.నరసింహాచార్యులు, అధికారులతో కూడిన తెలంగాణ రాష్ట్ర శాసన సభా బృందం సమావేశమైంది. ఈసందర్భంగా తెలంగాణ శాసన బృందం మాట్లాడుతూ.... భారతదేశంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం అని తెలిపారు. తెలంగాణ రైజింగ్ మోటోతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది, ముఖ్యంగా పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహిస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నది. అదే విదంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నందున పర్యాటక, ఆతిథ్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నదని వివరించారు. హైదరాబాద్ నగరం రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్‌గా ఉంటూ ఐటీ ఎగుమతులలో రెండవ స్థానం, బల్క్ డ్రగ్స్ ఎగుమతులలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్నదని వివరించారు. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానం అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు మంచి వాతావరణం, అనుకూలత ఉన్నాయని తెలిపారు. రాయబారి సింఘాలా మాట్లాడుతూ భారతదేశంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ స్టేట్ అని కితాబిచ్చారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఫ్రాన్స్ దేశానికి పర్యాటకులు బాగా వస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు తమవంతుగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాయబారి సింఘాలాను పోచంపల్లి పట్టు శాలువాతో తెలంగాణ శాసనసభా బృందం సన్మానించింది.

# రాజుకుంటున్న 'పోడు రగడ'

## అటవీ అధికారులపై దాడి..

## గాయపడిన బీట్, సెక్షన్ ఆఫీసర్లు

**కరకగూడెం, ప్రభాతవార్త:** మండలంలో పోడు భూములపై మరోసారి ఉదిక్తత నెలకొంది. శుక్రవారం ఉదయం అశ్వాపురంపాడు అటవీ ప్రాంతంలో వలస గిరిజనులు అటవీ అధికారులపై వేట కొడవళ్లతో దాడి చేసిన ఘటన మండలంలో కలకలం రేగింది. సెక్షన్ అధికారి గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురంపాడు అటవీ ప్రాంతంలో కొంతమంది వలస గిరిజనులు ఆర్ఓఎఫ్ఆర్ భూములలో ఎలక్ట్రానిక్ మెషిన్ (హార్వెస్టర్) పని చేయరాదు అని బీట్ అధికారి కోటేశ్ అక్కడికి వెళ్లి పని ఆపి మాట్లాడుతున్న క్రమంలో గిరిజనులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడారు. పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా మారడంతో కోటేశ్ తన పై అధికారి అయినటువంటి సెక్షన్ అధికారి గోవిందుకు సమాచారం తెలిపాడు. కొద్ది సేపటిలో సెక్షన్ అధికారి గోవిందు అక్కడికి చేరుకోగానే గిరిజనులు వారిని చుట్టుముట్టారు. మద్యం సేవించి ఉన్న కొంతమంది గిరిజనులు అటవీ అధికారులపై వేట కొడవళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో సెక్షన్ అధికారి గోవిందు, స్వల్ప గాయాలతో తప్పించుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందిన అనంతరం కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అటవీ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## చిల్డ్రన్‌హోంలో లైంగికదాడి కేసులో

# పెరుగుతున్న బాధితులు

## నిందితుడిపై మూడు పోక్సో కేసులు నమోదు

**హైదరాబాద్ (సైదాబాద్), అక్టోబరు 17, ప్రభాతవార్త:** సైదాబాద్‌లోని చిల్డ్రన్ హోంలో లైంగిక దాడి కేసులో బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. పోలీసుల దర్యాప్తులో ఇప్పటి వరకు పదికి పైగానే బాధితులను గుర్తించినట్లుగా తెలుస్తుంది. అయితే దీనిని పోలీసులు నిర్ధారించాల్సి ఉంది. బాధితుల్లోని ఒక బాలుడి తల్లి ఫిర్యాదుతో వెలుగు చూసిన ఈ దారుణం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురిచేసేలా ఉందని సమాచారం. మొదట్లో ఒక బాలుడే బాధితుడు అనుకున్నప్పటికి ఆ తర్వాత బాధిత బాలుర సంఖ్య పదికి పైగానే ఉన్నట్లుగా తేలడంతో పోలీసులు సైతం ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే నిందితుడు రహ్మాన్‌పై మూడు పోక్సో కేసులు నమోదయ్యాయి. బాధిత బాలురు మైనర్‌లు కావడం వల్ల వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వారిని పిలిపించి మిగతా కేసులు కూడా నమోదు చేసే దిశగా పోలీసులు చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తుంది.

# ముగ్గురు బాలికలపై లైంగిక దాడి

**హైదరాబాద్ (సైదాబాద్), అక్టోబరు 17, ప్రభాతవార్త:** ముగ్గురు మైనర్ బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సైదాబాద్ పరిధిలో నివాసముంటున్న ముగ్గురు మైనర్ బాలికలను వారి ఇంటి సమీపంలోనే నివాసముంటున్న ఇర్ఫాన్, ఆ బాలికలను తమ ఇంట్లోకి పిలిచి వారికి అశ్లీల వీడియోలు, ఫోటోలు చూపించాడు. బాలికల ప్రైవేటు భాగాలను తాకుతూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెపితే చంపేస్తానని బెదిరించడంతో వారు ఎవరికి చెప్పలేదు. అయితే బాలికలు చదువుతున్న పాఠశాల ఉపాధ్యాయురాలు బాలికల తల్లికి ఫోన్ చేసి మీ పిల్లలు పాఠశాలలో అసభ్యకరమైన టాపిక్ మాట్లాడుతున్నారని చెప్పింది. దీంతో బాలికల తల్లి పాఠశాలకు వెళ్లి తమ పిల్లలను ఆరా తీయగా జరిగిన దారుణం వెలుగు చూసింది. బాధిత బాలికల తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఎసిబి వలలో వరంగల్ మత్స్యశాఖ అధికారులు

**వరంగల్ క్రైం అక్టోబరు 17, ప్రభాతవార్త:** వరంగల్ మత్స్యశాఖ కార్యాలయంలో ఓ సొసైటీ నుంచి 75 వేలు లంచం తీసుకుంటూ జిల్లా అధికారితో పాటు ఫీల్డ్ ఆఫీసర్ పట్టుబడ్డారు. అధికా రులకు రెడ్ హ్యాండెడ్ గా జిల్లా అధికారిని నాగమ ణి ఆదేశాల మేరకు లంచం డిమాండ్ చేసిన ఆఫీసర్ హారీష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఫీల్డ్ ఆఫీసర్ హారీష్ జిల్లా అధికారి నాగమణిని పక్క సమాచారంతో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఎసిబి అధికారులు తెలిపారు. ఒక సొసైటీకి అనుమతిని ఇవ్వకుండా కాలయాపన చేసి అట్టి అనుమతికి సంబంధించి విషయంలో డబ్బులు డిమాండ్ చేసారని బాధితులు తెలిపారు. మత్స్యశాఖ కార్యాలయంలో ప్రతీ పనికి డబ్బులు ఇవ్వనిదే పనులు ముందుకు జరగవని బాధితులు ఆరోపిస్తున్నారు.



# ఆపరేషన్ కగార్ ఎఫెక్ట్.. మూడుకు పడిపోయిన నక్సల్ ప్రభావిత జిల్లాలు

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో నక్సలైట్ల ఉనికిని పూర్తిగా నిర్మూలించేందుకు నిర్ణయించిన కేంద్రం అందుకు తగినట్లుగా వ్యూహాలను అమలు చేయసాగింది. ఈ క్రమంలోనే దేశ వ్యాప్తంగా నక్సల్స్ ప్రభావిత జిల్లాలు మూడుకు పరిమితమయ్యాయి. ఒకప్పుడు ఉమ్మడి ఏపి సహా ఒడిషా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, బిహార్, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లోని 126 జిల్లాలు నక్సల్స్ ప్రభా విత ప్రాంతాలుగా కేంద్రం గుర్తించడం తెలిసిందే. అయితే గడచిన రెండేళ్లుగా చోటుచేసుకున్న అనేక పరిణామాలు నక్సలైట్ల ఏరివేతకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ కారణంగా ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లాలు మూడింటికి పడిపోయాయి. ఛత్తీస్‌ఘడ్‌లోని బీజాపూర్, నారాయణ్‌పూర్, సు కుమా జిల్లాలను మాత్రమే నక స్సల్స్ ప్రభావిత జిల్లాలుగా కేంద్ర హోం శాఖ గుర్తించింది. గత ఏడాది ఈ సంఖ్య ఆరుగా వుండడం గమనార్హం. ఈ ఆరు జిల్లాలలో ఐదు ఛత్తీస్‌ఘడ్‌లో వుండగా ఒకటి మహారాష్ట్రలోని గడ్చిరోలిగా వుండేది. ఇక నక్సల్స్ ప్రభావం కొంతమేర వున్న జిల్లాల సంఖ్య కూ డా 18 నుంచి 11కు తగ్గిందని కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన ఎదురు కాల్పుల్లో 312 మంది మావోయిస్టులు మరణించగా ఇందులో కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సహా ఎనిమిది మంది పొలిట్ బ్యూరో సభ్యులు వున్నారు. ఇదే సమయంలో 836 మంది నక స్సలైట్లను ఆయా జిల్లాల పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పాటు 1639 మంది మావోయిస్టులు ఆయా రాష్ట్రాల పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కేంద్ర కమిటీ సభ్యులతో పాటు ఆయా రాష్ట్రాల కమిటీ సభ్యులు, ముఖ్య నేతలు కూ డా వున్నారు. కాగా నక్సలైట్ల లొంగుబాటు ఇంకా కొనసాగుతూనే వుంది. కేంద్రంతో తాము చర్చలకు సిద్దమని మావోయిస్టులు ప్రకటించగా ఈ వి షయంలో కేంద్రం ససేమిరా అనడంతో నక్సలైట్ల కోసం కేంద్ర బలగాలు కూంబింగ్ నిరంతరంగా కొనసాగుతూనే వుంది.

**మావోయిస్టుల రెడ్ కారిడార్‌ను నిర్మూలించిన పోలీసులు**

ఇదిలావుండగా మావోయిస్టులు 2010లో నేపాల్‌లోని పశుపతి నుంచి ఎపిలోని తిరుపతి వరకు నక్సలైట్ల కారిడార్‌గా మార్చేందుకు వ్యూహం రచిం చారు. ఇందులో నేపాల్ నుంచి బిహార్ మీదుగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఉమ్మడి ఎపి, ఒడిషా, బెంగాల్. ఝార్ఖండ్‌లోని అనేక జిల్లా లు వున్నాయని కేంద్ర హోం శాఖ గుర్తించింది. 2013లో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు దేశంలో 126గా వుండేవి. అప్పట్లో నక్సలైట్లపై పోరుకు ఆ యా రాష్ట్రాల పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి సాగేవి. ఇప్పుడు కేంద్ర బలగాలు ఒక్క ఛత్తీస్‌ఘడ్‌తో పాటు పరుగునే మహారాష్ట్రలో గల గడ్చిరోలికే పరిమితం అయ్యాయి. ఇతర రాష్ట్రాలలో నక్సలైట్ల ఏరివేతకు కేంద్రబలగాల అవసరం లేకపోగా ఆయా రాష్ట్రాల పోలీసులే సొంతంగా గాలింపు చేబడుతున్నారు.

# రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి గన్‌కల్చర్ తీసుకువచ్చారు

## వ్యాపారవేత్తలకు తుపాకులు చూపించి బెదరిస్తున్నారు: మాజీమంత్రి హారీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 17:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గన్ కల్చర్‌ను ప్రోత్సహిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హారీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు తుపాకులు చూపి వ్యాపారవేత్తలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. గతంలో కేటీఆర్ వర్షంలో సైతం టెక్ మహీంద్ర సీఈవో గుర్నానీకి గొడుగు పట్టి పెట్టుబడులను ఆహ్వానించిన చరిత్ర తమదని గుర్తు చేశారు. తెలంగాణలో పెట్టుబడులు తగ్గిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రభుత్వ విజయోత్సవాలు నిర్వహిస్తామని కాంగ్రెస్ చెబుతోందని, అయితే తుపాకులు పెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడినందుకు ఈ ఉత్సవాలు చేస్తున్నారా అని హారీశ్ రావు ప్రశ్నించారు. కాంట్రాక్టుల కోసం మంత్రివర్గ సమావేశంలో మంత్రులు కొట్లాడుకుంటున్నారని, వారి మధ్య తగాదాలు పెరిగి రోజూ వీధిన పడి పరువు తీస్తున్నందుకు విజయోత్సవాలు జరుపుకుంటున్నారా అని ఆయన ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ప్రాజెక్టులు కట్టలేదని, పైగా ఉన్న పథకాలను రద్దు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

అందుకే విజయోత్సవాలు జరుపుకుంటున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, సినీ పరిశ్రమ పెద్దలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, పేదలకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణను సాధించి, పదేళ్లు అద్భుతంగా పాలించిన తమ పార్టీకి రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ భవన్ తలుపులు ప్రతి ఒక్కరికీ తెరిచే ఉంటాయని అన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి ఖాకీ బుక్‌లో మంత్రులకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా అని హారీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలో పింక్ బుక్, రెడ్ బుక్, బ్లూ బుక్ లేవని డీజీపీ ఇటీవల చెప్పారని, కానీ స్వయంగా మంత్రి కుటుంబ సభ్యులే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. సామాజిక మాధ్యమాల్లో రీట్వీట్ చేస్తేనే రాత్రికి రాత్రి అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. కొంతమంది తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే డీజీపీకి కనిపించడం లేదా అని నిలదీశారు. తెలంగాణలో మంత్రుల పంచాయితులను పరిష్కరించేందుకు మంత్రివర్గ సమావేశాలు నిర్వహిస్తున్నారని హారీశ్ రావు ఎద్దేవా చేశారు. కమీషన్ కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం మరొకరు, వాటాల కోసం మరొకరు, అక్రమ వసూళ్ల కోసం, కబ్జాల కోసం మంత్రులు వర్గాలుగా విడిపోయారని ఆయన ఆరోపించారు. మంత్రివర్గ సమావేశం దండుపాళ్యం ముఠాలా మారిపోయిందని ఆయన విమర్శించారు.

# రాష్ట్రంలో గన్‌కల్చర్ తెచ్చింది బిఆర్ఎస్ పార్టీయే: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 17:** నా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి చెబుతున్నా, నన్ను కన్న సమ్మయ్య సమ్మక్క సాక్షిగా చెపుతున్నా గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎలాంటి రాద్ధాంతం జరగలేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

మంత్రివర్గ సమావేశంలో రాద్ధాంతం జరిగిందన్న అంశాన్ని బిఆర్ఎస్ నేత హారీష్‌రావు నిరూపించగలడా? అని ప్రశ్నిం చారు. కేబినెట్ అజెండా, ప్రజల సమస్యలు తప్పా ఇంకేమీ చర్చ జరగలేదని అన్నారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రి సీతక్క శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తన తల్లి తండ్రుల సాక్షిగా ప్రమాణం చేసి హారీష్ రావుకి సీతక్క సవాల్ విసిరారు.

జరగని విషయాలను జరిగిందని మాట్లాడి హారీష్ రావు నీచమైన స్థాయికి దిగజారి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విడివిడిగా సీఎంతో మాట్లాడినపుడు కూడా ఇతర మంత్రుల మీద చర్చ జరగలేదని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రంలో గన్ కల్చర్ తెచ్చింది బీఆర్ఎస్ పార్టీయేనని అన్నారు.

అబద్ధానికి ఆరడుగుల సాక్ష్యం హారీష్ రావు అంటూ ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బిఆర్ఎస్ హయాంలోనే రోడ్లపై అడ్వకేట్లను చంపింది బీఆర్ఎస్ నేతలేనని అన్నారు. దండుపాళ్యం, దండుకున్న పాళ్యం బీఆర్ఎస్ పార్టీనేనని మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌజ్ కి పరిమితమైతే రేవంత్ రెడ్డి ప్రజా పాలన అందిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో తూతూ మంత్రంగా క్యాబినెట్ సమావేశాలు జరిగేవని అన్నారు.

హారీశ్‌రావుపై కేసీఆర్ కూతురు కవిత అనేక విషయాలను బయట పెట్టారని, కవిత ఆరోపణలపై హారీశ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గోల్డెన్ టెంపుల్‌ను దర్శించిన కేంద్రమంత్రి

## నేడు పంజాబ్ వరద ప్రాంతాల్లో పర్యటించనున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 17:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం సాయంత్రం పంజాబ్ రాష్ట్రంలోని అమ్రుత్ సర్ గోల్డెన్ టెంపుల్ (స్వర్ణ దేవాలయం) ను దర్శించుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా బండి సంజయ్ గురువారం శ్రీనగర్‌లో పర్యటించారు. ఆలిండియా జూడో పోటీల ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతి అందజేశారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ సమీపంలోని దచ్చిగాం నేషనల్ పార్క్‌ను సందర్శించారు. కాశ్మీర్‌లోని అద్భుతమైన ప్రకృతి రమణీయ ప్రాంతం దచ్చిగాం నేషనల్ పార్క్. 141 చ.కిమీ ప్రాంతంలో విస్తరించి ఉన్న పార్క్ ను 1910లో నాటి మహారాజు హారిసింగ్ ఏర్పాటు చేశారు. చుట్టూ పర్వత శ్రేణులు, గలగల పారే సెలయేర్ల సవ్వడుల మధ్య తీరొక్క పూల తోటతో ఈ పార్క్ ఏర్పాటైంది. 1981లో దీనిని అధికారికంగా నేషనల్ పార్క్‌గా ప్రకటించారు. జింకల సంరక్షణకు ప్రధాన కేంద్రమిది. హంగుల్ జింక (కశ్మీర్ స్టాగ్), హిమాలయన్ నల్ల ఎలుగుబంటి, మస్క్ డీర్, హిమాలయన్ గ్రే లాంగూర్, లెపర్డ్, బార్కింగ్ డీర్, జంగిల్ క్యాట్ వంటి జంతువులు ఈ పార్క్‌లో దర్శన మిస్తాయి. ఇంతటి కమనీయమైన నేషనల్ పార్క్‌ను తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండి అనేక మంది ప్రధానులు, రాష్ట్రపతులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు సందర్శించారు.



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవించి ఉన్నంత కాలం ఇక్కడికి వచ్చేవారని స్థానికులు చెబుతున్నారు. పలు బాలీవుడ్ దర్శకులు కాశ్మీర్ అందాలను చూపించే సినిమాలను ఇక్కడ చాలా నిర్మించారని తెలిపారు. ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంగా ఈ పార్క్ కు పేరుంది. ఇంతటి విశిష్టమైన దచ్చిగాం నేషనల్ పార్క్ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ సందర్శించారు. దాదాపు మూడు గంటలపాటు పార్క్ అంతా కలియ తిరిగారు. పార్క్ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బలగాలు ఆపరేషన్ మహదేవ్ పెహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టిన ప్రాంతానికి సమీపంలోనే ఈ పార్క్ ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్ర భద్రతా సిబ్బంది, జమ్మూకాశ్మీర్ పోలీసు ఉన్నతాధికారులతో కలిసి అల్పాహారం సేవించారు. అనంతరం శ్రీనగర్ నుండి అమ్రుత్ సర్ వెళ్లిన బండి సంజయ్ స్థానిక బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. బండి సంజయ్‌కు స్థానిక విమానాశ్రయంలోనే ఘన స్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు, బీజేపీ కార్యాలయంలో ఆయనతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. అక్కడి నుండి సాయంత్రం నేరుగా సిక్కు మతస్తుల అత్యంత పవిత్ర స్థలమైన స్వర్ణ దేవాలయానికి వెళ్లారు. ఆలయ సిబ్బంది కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. ఆలయ చరిత్రను వివరించారు. ఆలయ విశిష్టతను తెలియజేశారు. వారితో కలిసి టెంపుల్‌ను దర్శించుకున్న బండి సంజయ్ రాత్రి వేళల్లో బంగారపు కాంతుల్లో మెరుస్తున్న ఆలయం అద్భుత దృశ్యంగా కన్పిస్తోందని పేర్కొన్నారు. శనివారం పంజాబ్‌లో వరదల వల్ల నష్టపోయిన ప్రాంతాలను, మారుమూల గ్రామాలను సందర్శించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు.

# చిట్టీల పేరిట ఆర్ఎంపి వైద్యుడు కోట్లాది రూపాయల మోసం

## బాధితుల ఆవేదన

**హైదరాబాద్ (కొంపల్లి), అక్టోబరు 17, ప్రభాతవార్త:** పైసా పైసా కూడబెట్టి.. చిట్టీలు కట్టి మోస పోయారు కొందరు అమాయకులు. ఓ ఆర్ఎంపీ వైద్యుడు, అతని అకౌంటెంట్ చిట్టీల పేరుతో కోట్లాది రూపాయల మోసానికి తెరలేపారు. ఆర్ఎంపీ వైద్యుడు ఆత్మహత్యకు యత్నించగా.. అకౌంట్ మాత్రం తాను ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ సూసైడ్ రాసి ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. బాచుపల్లి పోలీసులు తెలిపిన ప్రకారం మియాపూర్ పరిధిలోని మయూరినగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అలీ నిజాంపేట్‌లో రేష్మా క్లీనిక్ పేరుతో గత 20 సంవత్సరాలుగా దవాఖాన నడుపుతున్నాడు. స్థానికంగా మంచి పేరు రావడంతో సైడ్ బిజినెస్‌గా చిట్టీల వ్యాపారం మొదలు పెట్టి అటు క్లినిక్, ఇటు చిట్టీల వ్యాపారాన్ని సమాంతరంగా నడుపుతున్నాడు. క్రమంగా కాలనీ పెరగడం, కస్టమర్లు అధికం కావడంతో కొన్నేండ్లుగా రూ.50లక్షలు, 30లక్షలు, 20 లక్షల చిట్టీలు నిర్వహిస్తున్నాడు. సుమారు 150 మంది కష్టమర్లు ఇతని వద్ద చిట్టీలు వేస్తుండటంతో ఈ వ్యవహారాలు చూసేందుకు బండారి లే అవుట్ కాలనీకి చెందిన మహేశ్‌ను అకౌంటెంట్‌గా నియమించుకున్నాడు. గత రెండేండ్లుగా చిట్టీల డబ్బులు వసూలు కాకపోవడం ఓ కారణమైతే, ఎత్తుకున్న వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో కష్టమర్లల్లో ఆందోళన మొదలైంది. ఈ విషయంలో ఆర్ఎంపీ వైద్యుడు అలీపై ఒత్తిడి పెరిగింది. దీంతో ఆయన ఈనెల 8వ తేదీన క్లీనిక్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పనిచేసే సిబ్బంది, కుటుంబసభ్యులు వెంటనే అతడిని నిజాంపేట్ రోడ్డులోని ఓ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. అలీ భార్య ఫిర్యాదు మేరకు ఆ రోజే పోలీసులు కేసు నమోదు చేశారు. అనం తరం చికిత్సతో కోలుకున్న అలీ ఈనెల 14వ తేదీ నుంచి మళ్లీ క్లినిక్‌కు వస్తుండటంతో మరోసారి బాధితులు చిట్టీల డబ్బుల కోసం అలీ క్లినిక్‌కు, నివాసానికి క్యూ కట్టారు. ఈ నేపథ్యంలో చిట్టీలకు సంబంధించిన కోట్లాది రూపాయలు ఏమయ్యాయనే విషయమై చిట్టీల నిర్వాహకుడు అలీ, అతడి అకౌంటెంట్ మహేశ్ మధ్య వివాదం నడుస్తున్నది. మహేశ్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం పెద్దసంఖ్యలో బాధితులు రేష్మా క్లీనిక్ వద్దకు చేరుకుని అలీని నిలదీశారు. దీంతో తనను అకౌంటెంట్ మోసగించాడని అలీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధితులు మాత్రం అలీ తమను మోస గించినట్లు కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు నష్టపోయిన మొత్తం కోట్లల్లో ఉంటే కేసును ఆర్థిక నేరాల విభాగానికి (ఈఓడబ్ల్యూ) అప్పగిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

నాకు ఇద్దరు ఆడపిల్లలు, కష్టపడి మేము టైలరింగ్ చేసుకుని నెల నెల చిట్టీ కట్టాము. మొదట్లో చిట్టీలు బాగా ఇచ్చేవారు. రూ.11లక్షలు చిట్టీ వేశాము. లాస్ట్ చిట్టీ మాదే.. వచ్చే నెల పాడుకోండి అంటూ ఇప్పటివరకు అమౌంట్ ఇవ్వలేదు. అందరినీ ఇలా మోసం చేశాడని తెలిసిందని బాధితురాలు వరలక్ష్మి అన్నారు.

మా అమ్మ 4 సంవత్సరాల నుంచి రూ.50లక్షలు, రూ.30లక్షలు, రూ.25లక్షలు చిట్టీలు వేశారు. మానాన్న యుగండా వెళ్లి సంపాదించిన డబ్బులు అవి. ఆ డబ్బుతో ఇల్లు కొనిచ్చాడు. ఇతని మాయ మాటలు నమ్మి మా అమ్మ ఇల్లు అమ్మేసి చిట్టీలు వేసింది. పోలీసులను ఆశ్రయిస్తే మా గోడు వినేవాళ్లేలేరు. మోసం చేసిన అతన్ని మాత్రం దర్జాగా కూర్చోబెట్టారని దీప తల్లి చెప్పారు.

నాకు ఇద్దరు అమ్మాయిలు. నేను 2017 నుంచి చిట్టీలు వేస్తున్నాను. కానీ చిట్టీ అయిపోయిన కూడా తన దగ్గరే పెట్టుకుని వడ్డీ ఇస్తానని చెప్పాడు. రూ.50లక్షల చిట్టీలో 50మందే ఉండాలి కానీ 54 మంది ఉన్నారు. ఎంతో నమ్మకంగా నడిపిస్తూ వచ్చాడు. రూ.50లక్షల చిట్టీలో 18చిట్టీలు ఆయనే పాడుకున్నారు. గుమస్తా రెండు కోట్ల, ఆరవై లక్షలతో అకౌంటెంట్ వెళ్లిపోయాడని బాధితురాలు శివలీల చెప్తున్నారు.

## శబరిమలై బంగారం కేసు

# ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్‌పొట్టి అరెస్టు

**తిరువనంతపురం, అక్టోబరు 17:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శబరిమల బంగారం మాయం కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఉన్నికృష్ణన్ పొట్టిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్ట్ చేసింది. విచారణలో ఉన్నికృష్ణన్ చెప్పిన విషయాలు ఇప్పుడు కేరళలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బంగారం చోరీ పథకం ప్రకారమే జరిగిందని, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధికారులకు దీని గురించి ముందే తెలుసని ఆయన అంగీకరించినట్లు సమాచారం. కేరళ హైకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సిట్ బృందం, ఎస్పీ బిజోయ్ నేతృత్వంలో విచారించింది. అనంతరం ఈ ఉదయం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తిరువనంతపురం జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కోర్టులో హాజరుపరిచేంత వరకు ఆయన సిట్ కస్టడీలోనే ఉండనున్నారు. శబరిమల ఆలయ గర్భగుడి ద్వారపాలకుల విగ్రహాలు, గడపకు బంగారు తాపడం చేయించే పనుల్లో భారీగా అవకతవకలు జరిగాయి. స్పాన్సర్ ముసుగులో ఉన్నికృష్ణన్ పొట్టి దాదాపు 475 గ్రాముల బంగారాన్ని అపహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాపడం కోసం కేవలం మూడు గ్రాముల బంగారం మాత్రమే వాడి, మిగిలినదంతా పక్కదారి పట్టించాడని దర్యాప్తులో తేలింది. ఇదే పని కోసం బెంగళూరుకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి కూడా పొట్టి డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో సిట్ అధికారులు రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి మొత్తం 10 మందిని నిందితులుగా చేర్చారు.

# జూబ్లీహిల్స్ పరిధిలో నవంబరు11న ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు సెలవు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,అక్టోబరు17:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి నవంబర్ 11న ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్నందున, ఆ రోజు నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 21 వరకు నామినేషన్లకు తుది గడువు ఉంది. వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినే షన్లు దాఖలు చేస్తున్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది.

# మెహుల్‌చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు బెల్జియంకోర్టు ఉత్తర్వులు

## అప్పీలుకు వెళ్లే యోచనలో చోక్సీ

**బ్రస్సెల్స్, అక్టోబరు 17:** పంజాబ్‌నేషనల్ బ్యాంకు రూ.13వేల కోట్ల కుంభకోణంలో కీలక నిందితుడుగా ఉన్న ఆభరణాల వ్యాపారి గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్‌చోక్సీని భారత్‌కు అప్పగించేందుకు బెల్జియం కోర్టు ఆదేశించింది. ఆంట్‌వెర్ప్‌లో ఉన్న కోర్టు ఇందుకు సంబంధించి భారత విజ్ఞప్తిపై ప్రాథమిక ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఈ కోర్టు ఉత్తర్వులపై చోక్సీ అప్పీలుకువెళ్లే అవకాశం ఉంది. బెల్జియంలో ఉన్న చోక్సీని గత ఏప్రిల్ 12వ తేదీ అధికారులు అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. 65 ఏళ్ల ఉద్దేశపూర్వకంగా పరారీలో ఉన్న నిందితుడుగా పేర్కొంటున్న చోక్సీని బెల్జియం అదికారులు భారత్ విజ్ఞప్తిపై అరెస్టుచేసారు. ఆంటిగ్వాలో 2018 నుంచి చోక్సీ నివసిస్తున్నాడు. కరేబియన్ దేశం పౌరసత్వాన్ని సాధించిన చోక్సీ ఆయన భారత పాస్‌పోర్టుకూడా చెలామణీలోనే ఉంది. 2023 నవంబరులో బెల్జియంకు చేరిన చోక్సీ వైద్య చికిత్సలకోసం వచ్చినట్లు చెప్పుకున్నాడు. రెండు అరెస్టు వారంట్లను బెల్జి యం అధికారులకు భారత దర్యాప్తు ఏజెన్సీలు అందచేసాయి. స్పెషల్ ముంబయి కోర్టు జారీచేసిన ఉత్తర్వులు 2018, 2021లో జారీచేసిన ఉత్తర్వులను బెల్జియం అధికారులకు అందించారు. వీటితోపాటు ఆర్థికనేరగాడు అని చోక్సీని భారత్‌కు అప్పగించాలని కూడా విజ్ఞప్తి చేసారు.



## సెల్‌ఫోన్ చోరీ, మిస్సింగ్ కేసులు..

# రికవరీలో మొదటి స్థానంలో తెలంగాణ

## సిఇఐఆర్ పోర్టల్‌తో బాధితులకు ఊరట

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త:** సెల్‌ఫోన్‌ల చోరీలు, మిస్సింగ్ కేసుల విచారణ, నేరగాళ్ల నుంచి రికవరీలో తెలంగాణ సిఐడి విభాగం దేశ ంలో మళ్లీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ విషయంలో ఏడాదిగా మొదటి స్థానంలో వున్న తెలంగాణ పోలీసు విభాగం దేశ వ్యాప్తంగా అన్ని పో లీసు విభాగాల గణాంకాల పరిశీలన తరువాత తన స్థానాన్ని మరోసారి పదిలం చేసుకుంది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహకారంతో దేశ వ్యాప్తంగా ఏర్పాటైన సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సిఈఐఆర్)తో పైలట్ ప్రాజెక్టుగా మొదట కర్నాటక, మహారాష్ట్ర, ఢిల్లీ సహా ఈశాన్య రా ష్ట్రాలలో సెల్‌ఫోన్ల చోరీలు, విచారణ రికవరీలను 2022 సెప్టెంబర్‌లో అమలు చేయగా తెలంగాణలో 2023 ఏప్రిల్‌లో అమలు చేశారు. అప్పటి నుంచి 2025 అక్టోబరు 16వ తేదీ వరకు అంటే రెండున్నరేళ్ల కాలంలో రాష్ట్ర పోలీసు విభాగం లక్షా 20 వేల సెల్ ఫోన్లను రికవరీ చేసి రికార్డు సృష్టించింది. సిఐడి ఆధ్వర్యంలో పనిచేసే ప్రత్యేక విభాగం దీనికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 31 పోలీసు యూనిట్ల లోని 780 పోలీసు స్టేషన్లకు సిఈఐఆర్ యూజర్ ఐడిలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అన్ని పోలీసు స్టేషన్లలో ఎంపిక చేసిన వారికి దీని అమలుకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. మొత్తం మీద సెల్‌ఫోన్ల రికవరీలో హైదరాబాద్‌లో రెండున్నరేళ్లలో 84 వేల మూడు ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ కాగా వీటిలో 45 వేల 261 ఫోన్లను గుర్తించేవిగా నిర్ధారించి అందులో 8382 ఫోన్లను నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీని తరువాత కామారెడ్డి జిల్లాలో 9638 ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ కాగా వీటిలో 5869 ఫోన్లను గుర్తించేవిగా నిర్ధారించి అందులో 3860 ఫోన్లను నేరగాళ్ల నుంచి స్వాధీనం చే సుకున్నారు. దీని తరువాత రాజన్న సిరిసిల్లా జిల్లాలో 4192 ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ కాగా వీటిలో 2482 ఫోన్లను గుర్తించేవిగా నిర్ధారించి అందులో 2074 ఫోన్లను నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. దీని తరువాత జోగుళాంబ గద్వాల జిల్లాలో 4155 ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ కాగా వీటిలో 2811 ఫోన్లను గుర్తించేవిగా నిర్ధారించి అందులో 1998 ఫోన్లను నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. వీటి తరువాత సూర్యాపేట్ జిల్లాలో 5141 ఫోన్లు చోరీ లేదా మిస్సింగ్ కాగా వీటిలో 3298 ఫోన్లను గుర్తించేవిగా నిర్ధారించి అందులో 2267 ఫోన్లను నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో సిఐడి సాధించిన ఘనతపై ఆ విభాగం అదనపు డిజి చారు సిన్హా సంతోషం వ్యక్తం చేశారు. అందరి కృషివల్లే ఇది సాధ్యమయ్యిందని ఆమె తెలిపారు.

# ఫ్యామిలీతో ఎంజాయ్ చేస్తారని గ్యారెంటీ ఇస్తున్నాం

## హీరో కిరణ్ అబ్బవరం



సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా కె- ర్యాంప్. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కె- ర్యాంప్ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు హైదరాబాద్ లో మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ యూనిట్ సభ్యులందరి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవోపీ సతీష్ రెడ్డి మాట్లాడుతూ కిరణ్ అబ్బవరంను కొత్తగా చూపించాలనే ప్రయత్నంతో టీమ్ లోని ప్రతి ఒక్కరం వర్క్ చేశాం. అన్నీ అనుకున్నట్లుగా, చాలా ఫాస్ట్ గా 'కె- ర్యాంప్' మూవీ కంప్లీట్ చేశాం. ఒక ఔట్ అండ్ ఔట్ ఎంటర్ టైనర్ లో కిరణ్‌ని చూడబోతున్నాం. ఈ దీపావళి బాక్సాఫీస్ కు టాపర్ మా సినిమా కావాలని కోరుకుంటున్నా. మంచి ఎంటర్ టైనింగ్ మూవీ ఇది. ఫ్యామిలీ అందరికీ నచ్చుతుంది. డైరెక్టర్ నాని తను అనుకున్న స్టోరీ కన్విక్షన్ తో రూపొందించారు. కిరణ్‌కి ఈ సినిమా మంచి హిట్ ఇవ్వాలని కోరుకుంటున్నా. అన్నారు.

హీరోయిన్ కామ్నా జెఠ్మలానీ మాట్లాడుతూ, ఈ సినిమాతో నాకు ఎమోషనల్ బాండింగ్ ఉంది. నేను చాలా గ్యాప్ తర్వాత కమ్ బ్యాక్ ఇస్తున్న సినిమా ఇది. మీ కోసం ఈ దీపావళికి పవర్ ఫుల్ ఎంటర్ టైన్ మెంట్ లోడ్ అవుతోంది. కిరణ్ ఒక పవర్ హౌస్ పర్ ఫార్మర్. ఆయనకు ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలి. డైరెక్టర్ జైన్స్ నాని మాట్లాడుతూ ఫస్ట్ మూవీ చేసే అవకాశం కల్పించిన హాస్య మూవీస్ ను లైఫ్ లో మర్చిపోలేను. మమ్మల్ని రోజు ఫాలో చేసి చాలా ఫాస్ట్ గా షూటింగ్ చేసేలా మోటివేట్ చేశారు ప్రొడ్యూసర్ రాజేశ్. మా డీవోపీ సతీష్, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మ కడలి, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ వీళ్లందరి సపోర్ట్ వల్లే సినిమా ఇంత బాగా వచ్చింది. మీ అందరి సపోర్ట్ తప్పకుండా ఇస్తారని కోరుకుంటున్నా. అన్నారు. హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ కె ర్యాంప్ మూవీ చూశాక ప్రేక్షకులు నన్ను మరింతగా ఇష్టపడతారు. ఇలాంటి మంచి రోల్ నేను చేయగలను అని నమ్మి అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ నానికి థ్యాంక్స్. అమా టీమ్ అంతా ఎంతో ప్యాషనేట్‌గా వర్క్ చేశారు. నాపై మీరంతా చూపిస్తున్న లవ్‌కు థ్యాంక్స్. ఈ నెల 18న కె ర్యాంప్ మూవీని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, కె- ర్యాంప్ మూవీకి మొదటి నుంచీ సపోర్ట్ అందిస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మేమంతా ఒక మంచి సినిమా చేశామనే నమ్మకం ఉంది. మంచి సినిమా చేసినప్పుడే మిమ్మల్ని థియేటర్స్ రమ్మని కాన్ఫిడెంట్ గా పిలుస్తాం. ఈ సినిమా అనుకున్నప్పుడే దీపావళి రిలీజ్ అని ఫిక్స్ అయ్యాం. ఖచ్చితంగా ఫ్యామిలీతో కలిసి నవ్వుకునే సినిమా అవుతుందని నమ్మాం. మేము అనుకున్న దానికంటే మూవీ ఇంకా బాగా వచ్చింది. మాకు వీలైనంత ప్రమోషన్ చేశాం. సాధ్యమైనంతగా మూవీని మీకు రీచ్ చేసేందుకు ప్రయత్నించాం. కె ర్యాంప్ మీ ఫ్యామిలీ అందరితో కలిసి కూర్చుని నవ్వుకునే మూవీ. నన్ను మా టీమ్ అందరినీ నమ్మండి సినిమా బాగా వచ్చింది. ఈ దీపావళి పండుగ కె ర్యాంప్ మూవీతో మరింత సరదాగా ఉంటుంది. నా ఫ్యాన్స్ అన్నా పిలిస్తే కరిగిపోతాను. అన్న మంచి సినిమా చేశాడని మీరు చెప్పుకునేలా ప్రతి సినిమాకు బెటర్ మెంట్ చేసుకుంటూ వస్తున్నా. మీరు గర్వపడేలా మూవీస్ చేస్తాను. ఈ నెల 18న థియేటర్స్ లో కె ర్యాంప్ ర్యాంపేజ్ చూస్తారు.. థియేటర్స్‌లోకి వెళ్లేముందు ఇది కంప్లీట్ ఎంటర్ టైనర్ అని గుర్తుపెట్టుకోండి. మీ టికెట్ డబ్బులు వృథా కావు. టికెట్ బుక్ చేయాలా వద్దా అనుకునేవారు కాన్ఫిడెంట్‌గా బుక్ చేసుకోండి మిమ్మల్ని గ్యారెంటీగా నవ్విస్తాం. ఈ సినిమాకు తప్పకుండా సక్సెస్ మీట్ ఉంటుంది. ఆ సక్సెస్ మీట్ లో నా టీమ్ అందరి గురించి మాట్లాడుతా అన్నారు.




**క్యూట్ లుక్స్ తో ఆకట్టుకుంటున్న అదితి..** తాజాగా బ్యూటీ అవార్డ్స్ 2025 ఈవెంట్ లో బేబీ డాల్ లా మెరిసింది. తెలుగు హీరోయిన్ అదితి రావు హైదరి తాజాగా బ్యూటీ అవార్డ్స్ 2025 ఈవెంట్ లో బేబీ డాల్ లా మెరిసింది. తాజాగా ముంబై జూహులోని జె డబ్ల్యూ మారియట్ బ్యూటీ అవార్డ్స్ తన 19వ ఎడిషన్ నిర్వహించింది. ఇక బ్యూటీ ప్రేన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ అందుకుంది.. అయితే ఈ అవార్డ్స్ వేడుకలో అదితి రావు హైదరి తన లుక్ తో అందరినీ ఆశ్చర్యపరచింది. బేబీ డాల్ లాంటి డ్రెస్సులో అద్భుతంగా కనిపించింది. గ్లామర్ అందాలు హైలైట్ అయ్యేలా టాప్ తో పాటు ఓ బెలూన్ లాంటి స్కర్ట్ తో స్టైల్ చేసింది. ఈ డ్రెస్ లో అదితీ రావు హైదరి అచ్చం బేబి డాల్ లాగే కనిపిస్తోంది. ఈ డ్రెస్ కి తగ్గట్టుగానే తన హెయిర్ కట్ కూడా మార్చుకుంది. డ్రెస్ కు తగ్గట్టుగా హెయిర్ కట్ చేయించుకొని తన కళ్ళతో హైలెట్ చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలను అదితి రావు హైదరి తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసుకోగా..ఈ ఫోటోలు చూసిన చాలా మంది జనాలు ఇదేంటి అదితి రావు హైదరి లుక్ ని ఇలా చేంజ్ చేసేసింది అని షాక్ అవుతున్నారు.

# 'తెలుసుకదా' దీపావళికి హ్యాపీ మెమొరీ అవుతుంది


స్టార్‌బాయ్ సిద్దు జొన్నల గడ్డ

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ తెలుసు కదా. మిరాయ్ లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ తర్వాత పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశిఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్‌ఫిల్మ్ మేకర్ నీరజా కోన దర్శకత్వం వహించారు. అక్టోబర్ 17న గ్రాండ్ గా విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తో హౌస్ ఫుల్ గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. తెలుసు కదా సినిమా నేను చేయాలని డిసైడ్ అయినప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. యాక్టర్‌గా కాదు రైటర్ గా భయం ఉండేది. ప్రతి సీన్లో పంచులు లేకపోతే థియేటర్ని హోల్డ్ చేయగలమా లేదా అనే భయం ఉండేది. . ఈ సినిమాని ఫ్రెండ్స్, పేరెంట్స్, ఫ్యామిలీ ఎవరితో కలిసి వెళ్లిన సరే ఎంజాయ్ చేస్తారు. వరుణ్ మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తాడు. శ్రీనిధి రాశి హర్ష ఈ పాత్రలన్నీ మీకు కనెక్ట్ అవుతాయి. దీపావళిని సేఫ్ గా సెలబ్రేట్ చేసుకోండి. తప్పకుండా ఈ దివాళికి సినిమాకి వెళ్ళండి. తెలుసు కదా సినిమా ఈ దీపావళికి మీకు హ్యాపీ మెమోరీ అవుతుంది.డైరెక్టర్ నీరజకోన మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. ఇది నా ఫస్ట్ ఫిలిమ్. సినిమాకు వస్తున్నా రెస్పాన్స్ చూస్తుంటే చాలా ఎమోషనల్ గా ఉంది. అందరి నుంచి అద్భుతమైన సపోర్టు వచ్చింది. ఆడియన్స్ సినిమాకు చానా అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. ఆడియన్స్ రెస్పాన్స్‌కి థాంక్స్. మా నిర్మాతలు విశ్వ, కృతి, హీరో సిద్ధు, హీరోయిన్స్ రాశి శ్రీనిధికి మా టెక్నీషియన్స్ అందరికీ థాంక్యూ వెరీ మచ్. టిల్లు మీ అందరిని నవ్విస్తే వరుణ్ అందరికీ కనెక్ట్ అవుతాడు. అద్భుతమైన రెస్పాన్స్ ఇచ్చిన ఆడియన్స్ కి థాంక్యూ సో మచ్

# 'ప్రభుత్వ సారాయి దుకాణం' పై మహిళా సమాఖ్య ప్రతినిధి ప్రెసిడెంట్స్ కంప్లైంట్

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది రచనా దర్శకత్వంలో ఎస్వీఎస్ ప్రొడక్షన్స్ శ్రీనిధి సినిమాస్ బ్యానర్ పై దైవ నరేష్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మాతలుగా ప్రేక్షకులు ముందుకు రారన్న చిత్రం ప్రభుత్వ సారాయి దుకాణం. ఇటీవల ఈ చిత్ర టీసర్ విడుదల కావడం జరిగింది. అయితే ఆ టీజర్ లోని డైలాగులు కొంత అసభ్యకరంగా ఉన్నాయంటూ చర్చలు వినిపించాయి. అలాగే ఈ చిత్ర టీచర్‌లో తెలంగాణ యాసను దుర్వినియోగం చేస్తూ ఆడవారిని అవమానిస్తూ డైలాగులు ఉన్నాయంటూ నేడు కొంతమంది మహిళలు స్పందించడం జరిగింది.

తెలుగు ఫిలిమ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి దామోదర ప్రసాద్‌ని కలిసి మహిళా సమాక్య ప్రతినిధులు కంప్లైంట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సమైక్య ప్రతినిధి దీపా దేవి మాట్లాడుతూ, "ప్రభుత్వ సారాయి దుకాణం అనే చిత్రం టీజర్‌లో మహిళలను కించపరుస్తూ డైలాగులు ఉన్నాయి. తెలంగాణలోని మహిళలు ఎంత నీచంగా మాట్లాడుతారా? అంతేకాక ఆడవారితో కూడా అటువంటి బూతులతో కూడిన డైలాగులు చెప్పించారు. భవిష్యత్తును ఎటు తీసుకువెళ్దాం అనుకుంటున్నారు? తెలంగాణ సంస్కృతిని, సాంప్రదాయాన్ని ఏం చేద్దాం అనుకుంటున్నారు? ఈ చిత్రం విడుదలయితే మేము ఊరుకోము, ఖబర్దార్. దర్శకుడు జాతీయ అవార్డు గ్రహీత ఇటువంటి చిత్రాలు తీయడం అనేది చాలా తప్పు. మహిళలు మీకు అలా కనిపిస్తున్నారా? రాజకీయాలలోని మహిళల గురించి మీరు ఏమనుకుంటున్నారు? ఈ సినిమాను విడుదల కానివ్వము. అవసరమైతే సంసార్ బోర్డును ముట్టడిస్తాం అన్నారు. మరొక మహిళ సమైక్య ప్రతినిధి నీరజ మాట్లాడుతూ రోజురోజుకు సినిమాలు తీసే విధానం దిగజారిపోతుంది. కేవలం డబ్బులు సంపాదించుకోవడం కోసం ఎలా పడితే అలా సినిమా తీస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సారాయి దుకాణం అనే టైటిల్ తో వస్తున్న చిత్రంలో తెలంగాణ యాసను అవమానిస్తున్నారు. ప్రపంచమంతా మన తెలంగాణ అభివృద్ధిని చూస్తుంటే ఇటువంటి నిజమైన భాషతో ఆడవారిని దూషిస్తూ ఇటువంటి సినిమాలు తీయడం, యువతను తప్పుదారి పట్టించేలా ఇటువంటి సినిమాలు తీయడం మంచిది కాదు. జాతీయ అవార్డు గెలుచుకున్న దర్శకుడు ఇటువంటి చిత్రాలు చేయడం అనేది సరైనది కాదు. మీ ఇంట్లో ఆడవారు ఇటువంటి బూతులతో కూడిన భాషను ఉపయోగిస్తే మీరు ఊరుకుంటారా? ఈ సినిమాను నిలిపివేయకపోతే దర్శకుడు ఇంటిని ముట్టడిస్తాం. డబ్బు కోసం ఇటువంటి సినిమాలను చేయకండిఅని అన్నారు. ధనమ్మమాట్లాడుతూ, ఎంతో గౌరవంగా ఎన్నో పండుగలు వ్యవహారించే తెలంగాణ మహిళలను కించపరుస్తూ ఇటువంటి సినిమాలు చేయకండి. ప్రభుత్వ సారాయి దుకాణం సినిమాలో ఎన్నో బూతులు ఉన్నాయి. ఈ సినిమాను వెంటనే నిలిపివేయాలని కోరుతున్నాము. లేదంటే చాంబర్‌ను, సెన్సార్ బోర్డును ముట్టడిస్తాము.. అని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఫిలిం ఛాంబర్ ముఖ్య కార్యదర్శి మాత్ర ప్రసాద్‌కి ఈ చిత్రాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ మహిళా సమస్యల ప్రతినిధులు దీపా దేవి, పద్మ, నీరజ, ధనమ్మ, చంద్రమ్మ, నసీమా తదితరులు వినతిపత్రం అందజేశారు.




# పంచాయతీ సెక్రెటరీ శ్రీరామ్‌గా శివాజీ ఫస్ట్ లుక్ రిలీజ్



శీ శివాజీ ప్రొడక్షన్స్ పై రెండవ ప్రాజెక్టుగా సుధీర్ శ్రీరామ్ రచన దర్శకత్వంలో వింటేజ్ బ్లాక్ బస్టర్ కపుల్ నటుడు శివాజీ, లయ జంటగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మరోసారి ఈటీవీ విన్ తో కలిసి శివాజీ పనిచేస్తున్నారు. 90ఖ్బి వెబ్ సిరీస్ లో శివాజీతో కలిసి నటించిన బాల నటుడు రోహన్, అలీ, ధనరాజ్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీరామ్ గా కనిపించనున్న శివాజీ ఎంతో నిజాయితీపరుడైన వ్యక్తి. తప్పుని సమర్థించని మనస్తత్వం, అన్యాయాన్ని సహించలేని క్యారెక్టర్. తన వల్ల మాత్రమే కాదు, ఏ ఒక్కరి వల్ల కూడా జనం ఇబ్బంది పడకూడదు అని ఆలోచించే మనిషి. భార్య బిడ్డలే ఇతని ప్రపంచం. వాళ్ళని ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమిస్తాడు. వాళ్ళ దాకా వస్తే ప్రాణం ఇవ్వడానికైనా వెనుకాడని మనిషి.

దీపావళి పండుగ సందర్భంగా ఈ చిత్రం నుండి పోస్టర్ విడుదలైంది. ఆ పాస్టర్ చూస్తుంటే గ్రామీణ వాతావరణంలో శ్రీరామ్ తన కుటుంబంతో కలిసి దీపావళి పండుగ చేసుకునేందుకుగాను దీపావళి పటాసులు తీసుకుని వెళుతున్నట్లు అర్థమవుతుంది. ఇక ఈ చిత్ర టైటిల్, చిత్రానికి సంబంధించిన ఇతర విశేషాలు చిత్ర బృందం వెల్లడించాల్సి ఉంది.

# రెడ్ డ్రెస్‌లో బుట్ట బొమ్మ.. ఫిదా అవుతున్న అభిమానులు



రెడ్ డ్రెస్‌లోబుట్ట బొమ్మలా కనిపిస్తున్న పూజహెగ్డేని అలా చూస్తూఉండిపోతున్నారు ఫాలోవర్స్. అంతేకాకుండా తన రొమాంటిక్ లుక్ తో స్మైలింగ్ ఫేస్ తో చూసే వాళ్లందర్నీ తన చూపుతోనే కట్టిపడేస్తుంది. ఈ డ్రెస్సు లో పూజ హెగ్డే ఫ్యాషన్ తో పాటు ట్రెడిషన్ ని కూడా ఎంత ఫాలో అవుతుందో అర్థం చేసుకోవచ్చు.గ్లామర్ గా కనిపించడంతోపాటు ట్రెడిషన్ ని ఫాలో అవుతూ పూజ హెగ్డే వేసుకున్న డ్రెస్సుపై చాలా మంది కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు. అలా ఎప్పుడూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా ఉండే పూజ హెగ్డే తాజా స్టైలిష్ ఫోటోలకి మాత్రం చాలా మంది అభిమానులు ఫిదా అయిపోతున్నారు .

# సూపర్‌స్టార్ మహేష్‌బాబు లాంచ్ చేసిన 'జటాధర' ట్రైలర్

నవ దళపతి సుధీర్ బాబు మోస్ట్ ఎవైటెడ్ సూపర్‌నేచురల్ ఫాంటసీ థ్రిల్లర్ జటాధార నవంబర్ 7న థియేటర్లలోకి రానుంది. సూపర్‌స్టార్ మహేష్ బాబు ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ ప్రేక్షకులకు టెర్రిఫిక్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది.

పురాతన కాలంలో సంపదను దాచడానికి 'పిశాచ బంధనం" అనే ఘోర మంత్రాన్ని ఉపయోగించేవారు. ఇది ఆ సంపదను కాపాడేందుకు రాక్షసాత్మల్ని ఆహ్వానించే మంత్రం. భూతాలు లేవని నిరూపించాలనుకునే ఒక స్కెప్టిక్ ఘోస్ట్ హంటర్, ఒకరి లోభం కారణంగా ఈ బంధనాన్ని భంగం చేస్తాడు. దీంతో "ధన పిశాచ" అనే శాపగ్రస్త దయ్యం మేల్కొంటుంది. ఒక చిన్నారి బలి జరగబోతోందన్న భయంకర కలతో, ఆ హంటర్ ఒక దుష్ట శక్తిని అడ్డుకోవడానికి బయలుదేరుతాడు. ఈ అల్లకల్లోలానికి అర్థం కాని దశలో ప్రారంభమవుతుంది శివుడు, సృష్టి .. వినాశనానికి ప్రతిరూపమైన ఆ దివ్య శక్తి. ట్రైలర్‌లో భూతపిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలు కళ్ళు తిప్పుకోలేని విధంగా చూపించారు. ముఖ్యంగా సుధీర్ బాబు నేలపై వున్న రక్తం త్రాగుతూ తపస్సులోకి వెళ్ళే సన్నివేశం గూస్ బంప్స్ తెప్పించింది.



పాత్ర కోసం ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అద్భుతంగా వుంది. సోనాక్షి సిన్హా ధన పిశాచిగా అదరగొట్టింది. అవసరాల శ్రీనివాస్, శిల్పా శిరోద్కర్ పాత్రలు ఆసక్తి రేకెత్తిస్తున్నారు.వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం హారర్ ఎలిమెంట్స్ తో పాటు భారతీయ పురాణ వైభవాన్ని అద్భుతంగా చూపిస్తున్నాయి. సమీర్ కళ్యాణి సినిమాటోగ్రఫీ గ్రాండ్ గా వుంది. రాజీవ్ రాజ్ సంగీతం ప్రతి రీచువల్ సీన్‌లోనూ టెన్షన్, థ్రిల్‌ని పెంచింది. జీ స్టూడియోస్ ,ప్రేరణ అరోరా ) సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం, డివోషనల్ ఫాంటసీ హారర్ జానర్ ని రిడిఫైన్ చేసేలా వుంది. ట్రైలర్ సినిమాపై బజ్ మరింతగా పెంచింది. సినిమా నవంబర్ 7న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది .

# రామాయణ ట్రైలర్‌పై క్రేజీ రూమర్స్



బాలీవుడ్ సినిమా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రమే 'రామాయణ'. బాలీవుడ్ సూపర్ స్టార్ రణబీర్ కపూర్ హీరోగా సాయి పల్లవి హీరోయిన్‌గా దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న ఈ భారీ విజువల్ వండర్ పై మంచి అంచనాలు ఉన్నాయి. ఆ మధ్య వచ్చిన గ్లింప్స్ తోనే సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. ఇక ఈ సినిమా గ్లోబల్‌గా కూడా ఆకట్టుకుంటుంది అని అంతా నమ్ముతున్నారు.అయితే ఓ క్రేజీ బజ్ ఈ సినిమాపై ఇప్పుడు వినిపిస్తుంది. దీని ప్రకారం రామాయణ ట్రైలర్ కి ఆల్రెడీ ముహూర్తం ఫిక్స్ చేసినట్టు తెలుస్తుంది. అందుకోసం మేకర్స్ గ్లోబల్ వేదిక ఎంచుకున్నారట. ప్రముఖ హాలీవుడ్ ఈవెంట్ కామిక్ కాన్ ఈవెంట్ లో వచ్చే ఏడాది జూలై లో ఈ ట్రైలర్‌ని లాంచ్ చేయనున్నట్టుగా ఇపుడు వినిపిస్తుంది. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది. అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ చిత్రంలో యష్, సన్నీ డియోల్, కాజల్ అగర్వాల్‌లు కూడా నటిస్తున్నారు .

# భక్తి శ్రద్ధలతో ధన త్రయోదశి

దీపావళి వస్తోంది అంటేనే ఒక వారం నుండి హడావిడి మొదలవు తుంది. ఇది వరకు దీపావళి ఐదు రోజులు ,తర్వాత కాలంలో మూడు రోజులు జరుపుకునేవారు. ఈ పట్టణవాస జీవితాలతో ఒక్క రోజుకే పరిమితమైన దీపావళితిరిగి ధన త్రయోదసి పేరుతో వ్యాపారవేత్తలు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడం కొరకు బంగారం,వెండి వంటివి కొంటె మంచిది అని ప్రచారం ప్రారంభించడంతో మళ్ళీ మూడు రోజుల శోభ మొదలైంది. త్రయోదశి నాడు భక్తి శ్రద్ధలతో లక్ష్మీ దేవిని పూజిస్తే చాలు, వస్తువు కొంటె మంచిది అంటూ అప్పులు చేసి కొనాల్సిన అవసరం లేదు. ధన త్రయోదశి జరుపుకోవడానికి ఒక కథ ఉంది.



పురాణాల ప్రకారం దీపావళికి ముందు వచ్చే త్రయోదశిని ధన త్రయోదశి ,లేదా చోటి దీపావళి అని అంటారు . ధన త్రయోదశి అంటే సంపద అని అర్థం. హిందూ పురాణాల్లో చాంద్రమానాన్ని అనుసరించి ఆశ్వయుజ మాసంలో శుక్లపక్ష త్రయోదశిని ధన త్రయోదశి అని పేరు. ఈ రోజు సాయంత్రం దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతారు. భక్తి గీతాలు పాడుతూ, నైవేద్యం సమర్పించి, మంగళ హారతి ఇస్తారు .ఇలా చేయడం వల్ల ఆ ఇంట్లో లక్ష్మీదేవి కొలువై ఉండి సిరి సంపదలతో తుల తూగుతారని నమ్మకం. దేవతలు, దానవులు అమృతం కోసం క్షీరసాగరము చిలుకుతున్న సమయంలో ఆ పాల సముద్రము నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్ప వృక్షము, కామ ధేనువు, దేవ వైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహా లక్ష్మితో పాటె జన్మించారు. ఆ రోజే ఆస్వేయుజ కృష్ణ త్రయోదశి, ఎంత చదువు చదివినా ఎన్ని తెలివి తేటలు ఉన్నా, శ్రీమహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం శూన్యం. శ్రీ మహాలక్ష్మి ధనానికి ప్రతి రూపం, అందుకే ఆమె జన్మదినమైన ఆస్వేయుజ కృష్ణ త్రయోదశిని ధన త్రయోదశి అంటారు. ఈ రోజున సంపద దేవత అయిన లక్ష్మీదేవితో పాటు కుబేరుడిని కూడా పూజిస్తారు. ధన త్రయోదశి రోజు పవిత్ర మైన రోజుగా భావిస్తారు. అయితే లక్ష్మీ పూజ అమావాస్య రోజున , మరియు ధన త్రయోదశి రోజు, ఈ రెండు రోజుల్లోనూ మరి ముఖ్యమైనదిగా భావిస్తారు. ఈరోజు నరకాసురుని చెర నుండి మహాలక్ష్మిని విడుదల చేసి ఆమెను సిరి సంపదల దేవతగా మహావిష్ణువు ఐశ్వర్యానికి పట్టాభిషేకం చేసింది ఈ రోజే అని చెబుతారు. అలాగే వామనుడు త్రివిక్రమ అవతారాన్ని ధరించి బలిచక్రవర్తిని మూడడుగుల నేలను దానంగా స్వీకరించాడు. భూలోక మొత్తాన్ని ఒక పాదంతో ధన త్రయోదశినాడు ఆక్రమించాడు అంటారు. ధన త్రయోదశి నాడు ప్రదోష కాలంలో అంటే సూర్యాస్తమయం నుంచి దాదాపు రెండున్నర గంటల సేపు లక్ష్మీదేవి పూజ చేస్తారు. ప్రదోషకాలంలో లక్ష్మి పూజచేస్తే అమ్మ మన ఇంటికి వచ్చి స్థిరంగా ఉంటుందని పెద్దల నమ్మకం.పురాణ గాథలు అనేకం ఉన్నప్పటికీ,సిరులను చేకూర్చే లక్ష్మీదేవిని ధన త్రయోదశి నాడు పూజించడం ఆనవాయితీగా మారింది. కనుక 18వ తారీకు, శనివారం వచ్చే ధనత్రయోదశి నాడు అమ్మవారిని శ్రద్ధ భక్తులతో పూజించి అందరికి ఆయురారోగ్యాలని ప్రసాదించమని అదే అన్నింటికంటే పెద్ద సిరి, సంపద అని అమ్మవారిని వేడుకుంటూ..

**- పాలపర్తి సంధ్యారాణి**

# శాంతి భద్రతలకు వీళ్లే కాపలా !

ఒకరేమో ఐఎఫ్ఎస్ సాధించిన ప్రయత్నం ఆపలేదు! మరొకరేమో జీఎస్టీ కమిషనర్‌గా ఎంపికైనా సరిపెట్టు కోలేదు! ఇంకొకరు ఐఐటీలో ఉంటూ సి రిపెట్టారు. ఫలితం... ముగ్గురూ శాంతిభద్రతలను పరిరక్షి ంచే ఐపీఎస్‌కు హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ ప్రాథమిక శిక్షణ పాసింగ్ అవుట్ పరేడ్‌కు సిద్ధమైంది. వారి గూర్చి తెలుసుకుందాం.





**అయిదో ప్రయత్నంలో.. ఎస్. అశ్విని**

మాది తమిళనాడులోని కన్యాకుమారి. నాన్న ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేసేవారు. మేం ఇద్దరం అమ్మాయిలమే అయినా చదువు విషయంలో ప్రోత్స హించారు. చిన్నప్పటి నుంచే సివిల్స్ లక్ష్యంగా పెట్టుకున్నా. సమాజ సేవకు ఇది ఉత్తమ మార్గమనేదే నా ఆలోచన. చెన్నైలో యూనివర్సి టీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ లో బీఈ చేశాను. సివిల్స్ కు సన్నద్ధమవుతూనే, గ్రూప్స్ కోసం ప్రయత్నించాను. మొదట స్టేట్ జీఎస్టీ డిపార్ట్‌మెంట్‌లో లా కమిషనర్‌గా ఉద్యోగం దక్కింది. అందులో పనిచేస్తూనే సివిల్స్ సన్నద్ధత కొనసాగుతుంది. ఒక ప్రయత్నంలో యూపీఎస్సీ లో 449వ ర్యాంకు సాధించా. సొంత రాష్ట్రం తమిళనాడు కేడర్ పనిచేయబోతున్నా. అమ్మాయిలు పోలీస్‌లో రాణించలేరనే వాదనకు నేను పూర్తి వ్యతిరేకం. మా బ్యాచ్‌లో 62 మంది అమ్మాయిలు ఐపీఎస్‌లుగా ఎంపికయ్యారు. మేమంతా శిక్షణలో ఎంతో ఉత్సా హంగా ఉండేవాళ్లం. ఇప్పుడున్న పరిస్థితుల్లో సామర్థ్యాల ఆధారంగా ఎవరైనా రాణించగలుగు తారనేది నా నమ్మకం.

**ఐఎస్‌తో ఆగకుండా... కీర్తియాదవ్**

నాన్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ లో పనిచేశారు. ఆయన ఉద్యోగరీత్యా పలు ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. మాది హరియాణా, ప్రాథమిక విద్యాభ్యాసం హరియాణాతోపాటు గుజరాత్‌లో సాగింది. డిగ్రీ కోల్‌కతాలోని సెయింట్ జేవియర్స్ లో పూర్తిచేశాను. తర్వాత సివిల్స్ సన్నద్ధతపై దృష్టి సారించా. పత్రికా పఠనం నాకెన్నో మెలకువలు నేర్పింది. తొలి ప్రయత్నంలో ప్రిలిమ్స్ లోనే ఆగిపోయా. రెండో ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకూ వెళ్లా. మూడో ప్రయత్నంలో ఆందోళనకు అయినా, సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) పరీక్ష కూడా రాసి అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపిక కావడంతో కొంత స్థిమితపడ్డాడు. అంతటితో సరిపెట్టుకో లేదు. మళ్లీ ప్రయత్నించి... ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యా. అక్కడ శిక్షణ పొందుతూనే మళ్లీ సివిల్ రాశా. నాలుగో ప్రయత్నంలో 510వ ర్యాంకు సాధించి అగ్ముట్ (అరుణాచల ప్రదేశ్, గోవా, మిజోరాం కేంద్రపాలిత ప్రాంతాలు) కేడర్‌కు ఎంపికయ్యా. అకాడమీలో ప్రాథమిక శిక్షణ అనంతరం స్వార్డ్ ఆఫ్ ఆన్నర్ ఫర్ ది బెస్ట్ ఔట్‌డోర్ ప్రొబేషనర్, డైరెక్టర్ ఎస్‌విపి ఎన్పీఏ ట్రోఫీ ఫర్ బెస్ట్ లేడీ ప్రొబేషనర్ ఇన్ ఔట్‌డోర్ ట్రైనింగ్ గా ఎంపిక కావడం ఆనందాన్నిచ్చింది. ఈసారి ఎక్కువ మంది మహిళలు ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఈ సంఖ్య మరింత పెరగాలని ఆశిస్తున్నా.

**అమ్మ ప్రోత్సాహమే స్ఫూర్తి .. జయశర్మ**

మాది హరియాణా, హిస్సార్‌లో విద్యాభ్యాసం పూర్తిచేశా. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ మ్యాథ్స్, ఐఐటీఢిల్లీ నుంచి ఎమ్మెస్సీ పూర్తి చేశాక సివిల్స్‌పై దృష్టి సారించా. నా వ్యక్తిత్వాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుకోవడంలో ఈ విద్యాసంస్థల పాత్ర మరువలేనిది. చిన్నప్పటినుంచే సివిల్స్ సాధించాలంటే తపన ఉండేది. ఈ ప్రయాణంలో తల్లిదండ్రుల సహకార మెంతో. నాన్న ప్రమోద్‌కుమార్ శర్మ ఫుడ్ సప్లై కంట్రోలర్, అమ్మ గృహిణి ముఖ్యంగా ఆశావహదృక్పథంతో ఉండే అమ్మ ప్రోత్సా హమే నాకు స్ఫూర్తి. నమ్మకం సన్నగిల్లిన ప్రతిసారీ అండగా నిలిచింది. నాలుగో ప్రయత్నంలో 248వ ర్యాంకు సాధించి, ఐపీఎస్‌కు ఎంపికయ్యా. పోలీస్ అకాడమీలో శిక్షణతో నేనెంతో నేర్చుకున్నా. మానసికంగా



దృఢంగా ఉండాలంటే శారీరక సామర్థం అవసరమే. ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకోవడం నేర్చుకున్నా. ఈ విషయంలో అకాడమీలో శారీరక శిక్షణ నాకు ఎంతగానో ఉపకరించింది. పోలీస్ కార్యకలాపాల్లో క్షేత్రస్థాయిలో ఎలా మెలగాలో సమగ్రమైన అవగాహన ఏర్పడింది. మహిళా భద్రతకు ప్రాధాన్యత ఇస్తా. □

# అందమైన కోట్ క్రాప్ టాప్ !

ఫ్యాషన్ ఫ్యాషన్

ఈ తరం అమ్మాయిలు.. ఫ్యాషన్‌కి ఐకాన్‌లు, పండగైనా, పెళ్లైనా, పెళ్లైనా స్టైల్ స్టేట్‌మెంట్ కనిపించాలని కోరుకుంటున్నారు. వారికి మెప్పించేందుకు డిజైనర్లు ఎన్నో ప్రయోగాలు చేస్తున్నారు. అలా ఈ దీపావళి పండక్కి వారిని మెప్పిస్తోన్న ట్రెండ్ ఏంటో తెలుసా? క్రాప్‌టాప్.. దానికి జతగా లాంగ్ కోట్. అవునండీ! లంగా ఓణీకి ప్రత్యామ్నాయంగా.. ఇటు సంప్రదాయాన్నీ, అటు ఆధునిక శైలినీ కలగలిపిన చేసిన డ్రెస్ ఇది. డైమండ్ సిల్క్, రాసిల్క్, జార్జెట్, టిష్యూ.. వంటి జాలువారే వస్త్రాలతో శుభకార్యాల్లో తళుక్కుమనేలా తీర్చిదిద్దిన ఈ యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. చీర, హాఫ్‌శారీ కట్టుకోవడానికి ఇబ్బంది పడేవారికి ఇవీ మరీ నచ్చేస్తున్నాయి. అందుకే, సందర్భానికో రకం అన్నట్లుగా.. కట్‌వర్క్, జర్దోసీ, ప్రింట్లూ, పెయింట్లు.. వంటి హంగులెన్నో చేరి అదరహో అనిపిస్తున్నాయి. మన అభిరుచిని బట్టి ప్రత్యేకంగా కుట్టించుకోవచ్చు. లేదంటే రెడీమేడ్‌గానూ కొనుక్కోవచ్చు. కట్టుకంటే క్లాసీ లుక్‌తో మెరిసిపోవడం ఖాయం.











# బరువు ఎన్నిసార్లు చూసుకోవాలి?



బరువు తగ్గాలనే లక్ష్యంతో ఉండేవాళ్లు..మంచి ఫలితం రావాలంటే, ఎంత తరచు గా బరువుని గమనించు కోవాలనే అంశంపైన యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా, యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా ఉమ్మడిగా ఓ అధ్యయనం చేశాయి. అధిక బరువు లేదా ఊబకాయం సమస్యతో బాధ పడుతున్న 74 మందిపైన ఈ అంశాన్ని పరిశీలించారు. ఒక వెయిట్‌లాస్ ప్లాన్‌ను మూడు నెలలపాటు పాటించిన సమయంలో, ఆపైన తొమ్మిది నెలలపాటు ఆ బరువుని కొనసాగించే ప్రయత్నంలో ఉన్నప్పుడు వీరిని పర్యవేక్షించారు. ఆహార నియమాల్ని పాటిస్తూ, వ్యాయామాల్ని చేస్తూ.. వారంలో మూడు రోజులైనా కచ్చితంగా బరువు చూసుకునేవాళ్లు పెరగకుండా ఉన్నారట. వారంలో అయిదే రోజులు చూసుకున్నవాళ్లు కాస్త బరువు తగ్గారట. వారంలో ఒకట్రెండు రోజులే చూసుకున్నవాళ్లు మాత్రం తిరిగి బరువు పెరిగారట. □

# కరివేపాకు ప్రయోజనం -2

ఆరోగ్య భాగ్యం



**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

**కంటి సమస్యలు :** కరివేపాకులోని అధిక విటమిన్ 'ఎ' కెరోటినాయిడ్స్ వల్ల కంటి కింది నల్లని వలయాలు, కంటిచూపుకి దృష్టి లోపాలు రాకుండా, కంటినరాల బలహీనతను తగ్గించే అంధత్వం చేస్తుంది. ఇది కార్నియా రాకుండా రెటీనా ఆరోగ్యానికి చాలా మంచిది. కరివేపకుని రెగ్యులర్‌గా వాడేవాళ్లకి కంటి అద్దాలు వాడనవసరం లేదంటే అతిశయోక్తి లేదు. ఇది కంటి ఆరోగ్యానికి, కాంతికి చాలా ముఖ్యమైన ఆకు ఇది కంప్యూటర్, సెల్ ఎక్కువగా చూడడం వల్ల వచ్చే రేచీకటి, కంటి ఒత్తిడి (ఐ స్ట్రెయిన్)ని తగ్గిస్తుంది. కేటరాక్ట్‌ని దంచేరనీయదు.

**కిడ్నీ ఆరోగ్యానికి :** కరివేపాకులోని ఆంటీఆక్సిడెంట్స్ యూరిన్, బ్లాడర్ సమస్యల్ని నివారిస్తుంది. కిడ్నీ ప్రక్షాళనకు, మూత్రపిండ సమస్యల కిడ్నీస్టోన్స్ నివారణకు కరివేపాకు చాలా మంచిది. **శ్వాసకోశ వ్యాధులకి:** జలుబు, దగ్గు, ఉబ్బసం, న్యూమోనియా, ఫ్లూ వైరల్ జ్వరాల్ని తగ్గిస్తుంది.

**డయాబెటిస్:** ఇది పాంక్రియాజ్‌ని స్టిములేట్‌చేసి బీటా కణాల్ని ప్రేరేపించి ఇన్సులిన్‌ను ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. కరివేపాకులోని ఫైబర్ వల్ల కార్బోహైడ్రేట్స్ గ్లూకోజ్‌గా విచ్ఛిన్నం కావడాన్ని తగ్గించడం వల్ల హైపోగ్లైసీమియా ఏర్పడుతుంది.

**ఎముకలు :** కరివేపాకులోని అధిక కాల్షియం వల్ల, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ వల్ల ఆంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలవల్ల కీళ్ళ నొప్పులు ఆస్టియోపోరోసిస్ వ్యాధిని, ఎముకల బలహీనతని తగ్గిస్తుంది. ఎముకల్ని ధృఢంగా ఉంచుతుంది. పంటి చిగుళ్ళ వ్యాధులు, దంతసమస్యలు, పిప్పి పండ్లని నివారిస్తుంది. **ఇన్ఫెక్షన్స్:** ఇది సాల్మోనెల్లా టైఫీ, ఈ కోలై కాండిడా వంటి ఇన్ఫెక్షన్‌ని తగ్గిస్తాయి. కరివేపాకులో ఆంటిబాక్టీరియల్, ఆంటిఫంగల్ గుణాల వల్ల సీజనల్ ఇన్ఫెక్షన్స్‌ని తగ్గిస్తుంది. **రక్తహీనత:** కరివేపాకులోని ఐరన్, ఫోలిక్ ఆసిడ్ వల్ల రక్తహీనత దరిచేరనీయదు. రక్త ప్రసరణని మెరుగుపరుస్తుంది. ఇది రక్త శుద్ధికి మంచిది, నీరసం అలసటని తగ్గిస్తుంది.

**గుండె ఆరోగ్యానికి :** కరివేపాకులోని తక్కువ సోడియం, ఎక్కువ పొటాసియం వల్ల గుండెకి మంచిది. హై బిపిని తగ్గిస్తుంది. అథిరోస్లీరోసిస్, గుండె జబ్బులు, స్ట్రోక్, గుండెపోటు వ్యాధుల్ని రానీయకుండా గుండె ఆరోగ్యానికి మంచిది. అంతేగాకుండా చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డిఎల్)ని తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ని పెంచే మంచి మూలిక అని చెప్పవచ్చు. అంతేగాకుండా శరీరంలో ఫ్రీరాడికల్స్‌ని తగ్గించి, శరీరంలోని అధిక క్రొవ్వుని తగ్గించడం వల్ల స్థూలకాయం తగ్గుతుంది. **మానసిక ప్రశాంతతని ..** కల్గించడంలో కరివేపాకు దివ్య ఔషధం లాంటిదని చెప్పవచ్చు. మెదడుకి కాల్షియం, రక్తసరఫరా జరిగి హాయిగా ఉంటుంది. డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి, నిరాశ, క్రుంగుపాటు, స్ట్రెస్‌కి మంచిది. ఆల్జీమర్స్ డిసీజ్, డిమెన్షియా, మతిమరుపు రాకుండా చేసి జ్ఞాపకశక్తిని పెంచుతుంది. అంతేగాకుండా నరాల బలహీనత వున్న పిల్లలు, స్త్రీలు, వృద్ధులకి నరాల్ని గట్టి పరుస్తుంది.

**లివర్:** ఇది లివర్‌కి బలాన్నిచ్చే శక్తి ప్రదాయిని అని చెప్పవచ్చు. కరివేపాకులోని విటమిన్ ఎ,సి, ఆంటి ఆక్సిడేటివ్స్ వల్ల లివర్ ఆరోగ్యానికి మంచిది. విషవాయువుల దోషాల్ని, క్రిమికీటకాల ఎఫెక్ట్‌ని తగ్గిస్తుంది. అంతేగాకుండా విష పదార్థాల్ని, వాటి ఎఫెక్ట్స్‌ని నివారించడానికి సూక్ష్మక్రిమి నివారణిగా, పాముకాటుకి విరుగుడుగా, సిగరెట్స్, మందులు ఎక్కువగా వాడేవారిలో కీటాక్సి ఫైడ్‌గా, కీమోథెరపీ, రేడియోథెరపీ ప్రభావాల్ని తగ్గించి, క్రోమ్‌జోమ్ నష్టాల్ని తగ్గించి, వంశపారంపర్య వ్యాధుల్ని రాకుండా ఎముక మజ్జని రక్షిస్తుంది.

**కేన్సర్ నివారణి:** బ్లడ్ కేన్సర్, ప్రొస్టేట్, కోలోరెక్టల్‌కేన్సర్ నివారణకు పనిచేస్తుంది. ప్రేగులకి, కడుపుకి, లివర్‌కి బలాన్ని చేకూరుస్తుంది. రొమ్ము కేన్సర్, పెద్దప్రేగు కేన్సర్, గర్భాశయ కేన్సర్స్ నుండి కూడా కరివేపాకులోని ఆంటి కార్సినోజెనిక్ గుణాలతో శరీరాన్ని రక్షిస్తుంది. అలాగే కణాల ఆక్సీకరణ వల్ల వచ్చే వ్యాధుల్ని తగ్గిస్తుంది. □

# పండగవేళ ప్రత్యేకంగా..

పండగనగానే కొంచెం ప్రత్యేకంగా కనిపించడం సహజం. రోజూ కంటే మరింత అందంగా మెరిసి పోవాలనుకుంటాం. అందులోనూ దసరా అంటే పూజ, ఫ్రెండ్స్, బంధువులతో ఒక్కటే హడావిడి. మరి, ఈ పండగ వేళ ప్రత్యేకంగా కనిపించడానికి నిపుణులు సూచించే కొన్ని చిట్కాలు.. మీ కోసం!

ముచ్చటైన మోము కోసం.. అందం విషయంలో తొలి ప్రాధాన్యత ముఖానిదే! ఈ కోరికనే ముఖం, కళ్లు, పెదాలు.. కళగా ఉంటేనే ముఖ సౌందర్యం ఇనుమడిస్తుంది. అందుకోసం ఈ చిట్కాలు పాటిస్తే సరి!

✦ చివరి నిమిషంలో అందంగా కనపడాలన్న ఆలోచనతో కనుబొమ్మలు సరిచేయడం, ముఖంపై గల అవాంఛిత రోమాలను తొలగించడం చేయకూడదు. కనుబొమ్మలు మరీ ఎక్కువగా పెరిగాయనుకుంటే చుట్టూ ఉన్న కొన్ని వెంట్రుకలను మాత్రం తొలగించి, మిగిలిన వాటిని కన్సీలర్ సహాయంతో చర్మం రంగులో కలిసేలా చేయాలి. సహజసిద్ధంగా కనిపించే అవకాశం నిపుణులు.

✦ ఒకవేళ కళ్ల కింద నలుపు ఎక్కువగా కనిపిస్తే చల్లని పాలలో దూదిని ముంచి కళ్లపై పెట్టుకుని కాసేపు కునుకు తీయండి. అదే సమయంలో అందుబాటులో ఉన్న ఏదైనా ఒక పండు గుజ్జునో లేక టొమాటో రసాన్నో ముఖానికి, మెడకి ప్యాక్ వేసుకుని ఇరవై నిమిషాల తర్వాత చల్లని నీటితో కడిగేస్తే ఒకేసారి రెండు పనులు పూర్తవుతాయి.

✦ సరైన నిద్ర ముఖాన్ని మరింత కాంతివంతం చేస్తుందని మర్చిపోకండి. అందుకే ఎంత హడావిడిగా ఉన్నా నిద్ర సమయాన్ని మాత్రం తగ్గించకూడదంటున్నారు నిపుణులు. ✦ పెదాలను చక్కెరతో స్క్రబ్ చేసి, కడిగిన తర్వాత వెంటనే మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ✦ హెయిర్ ప్యాక్ వేసుకునే సమయం లేకపోతే నాలుగు విటమిన్-ఇ ట్యాబ్లెట్లను కత్తిరించి, అందులోని లిక్విడ్‌ని మీ వెంట్రుకలకు సరిపడేంత కొబ్బరి కలిపి కుదుళ్ల నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి.

✦ మెనిక్యూర్‌చ పెడిక్యూర్ చేయించుకునే సమయం లేనప్పుడు చేతకి, కాలికి ఉన్న గోళ్లని షేప్ చేసుకుని, హెయిర్ మాస్క్ కోసం తయారు చేసుకున్న కొబ్బరి నూనె మిశ్రమాన్ని పట్టించాలి. □



# పూజ వస్తువులు తళతళ



పండగల సమయం... ఇంట్లోని వెండి వస్తువులన్నీ పూజగదిలోనే కనిపిస్తుంటాయి. వీటిని శుభ్రం చేసుకోక పోయినా, సరిగా భద్రపరచక పోయినా నల్లగా మారిపోతుంటాయి. అలా కాకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి. వెండి సామగ్రిని శుభ్రం చేయడానికి కఠిన రసాయనాలతో కూడిన క్లీనర్లు వాడొద్దు. బదులుగా కుంకుడుకాయ రసంలో కాస్త చింతపండు కలిపి తోమితే కొత్తవాటిల తళతళలాడతాయి. వేడి నీళ్లలో 3 టేబుల్ స్పూన్ల బేకింగ్ సోడా, కాస్త వినెగర్ కలిపి అందులో వెండి పూజ వస్తువులు వేసి పది నిమిషాలు ఉంచండి. ఆపై సాఫ్ట్ బ్రష్తో రుద్ది కడిగితే సరి. ఒక గిన్నెలో అల్యూమి నియం ఫాయిల్ వేసి అందులో కాస్త బేకింగ్ సోడా వేసి నీళ్లు మరగనివ్వాలి. ఆపై వెండి వస్తువుల్ని అందులో ముంచి తీయాలి. మరోసారి కొబ్బరి పీచుతో మృదువుగా రుద్దితే మెరుస్తాయి. శుభ్రం చేసిన వెండి వస్తువులను గాలికి వదిలేయొద్దు. వాటిని తడి లేకుండా తుడిచి మస్లిన్ లేదా కాటన్ వస్త్రంలో చుట్టి భద్రపరిస్తే సరి. ఎప్పుడు కావాలంటే అప్పుడు కొత్తవాటిలా వాడుకోవచ్చు. □

# ఇవి తింటే కంటికి మంచిది !


ఒకప్పుడు వయసు పైబడినవారికి చూపు మందగించేది. ఇప్పుడలా కాదు. పిల్లలకి కూడా కళ్లజోడు వచ్చేస్తోంది. మన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకుంటే. ఆ సమస్యకు కొంతవరకూ చెక్ పెట్టొచ్చు. ఎ,సి, ఇ-విటమిన్లు, ఒమేగా-3 అధికంగా ఉన్న పదార్థాలు తరచుగా తింటుంటే కంటిచూపు మెరుగ్గా ఉంటుంది. ఏయే పదార్థాల్లో ఈ విటమిన్లు లభిస్తాయంటే..

**ఎ-విటమిన్:** కోడిగుడ్డు,క్యారెట్, గుమ్మడికాయ, లివర్,పాలు.. మొదలైనవాటిల్లోఎ-విటమిన్ విస్తారంగా ఉంటుంది. సి-విటమిన్: క్యాబేజీ, క్యాలీఫ్లవర్, నిమ్మకాయలు, నారింజపండ్లలో సి-విటమిన్ పుష్కలంగా ఉంటుంది. ఇ-విటమిన్: బాదంపప్పు, పొద్దుతిరుగుడు గింజలు, బఠాణీలలో ఇ-విటమిన్ అధికంగా ఉంటుంది.

**ఒమేగా-3:** చేపల్లో ఇది ఎక్కువగా ఉంటుంది. □



# క్రికెట్‌లో మరో కొత్త ఫార్మాట్




ఆట

## ఇక టెస్ట్-ట్వంటీ

## రెండు సార్లు బ్యాటింగ్, బౌలింగ్

## భారత్‌లో తొలి ఎడిషన్

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో టెస్ట్, వన్డే, టీ20 ఫార్మాట్‌లు అధికారికంగా అభిమానులను అలరిస్తుంటే, హండ్రెడ్ బాల్, టీ10, బ్యాక్‌యార్డ్/ స్ట్రీట్ క్రికెట్, డబుల్ వికెట్ ఫార్మాట్‌లు అనధికారికంగా చలామణి అవుతున్నాయి. తాజాగా మరో క్రికెట్ ఫార్మాట్ సిద్ధమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌కు మరింత ఆదరణ పెంచే యోచనలో భాగంగా ఈ సరికొత్త ఫార్మాట్‌ను రూపొందించారు. టెస్ట్ మ్యాచ్‌ను టి20 తరహాలో ఆడిస్తేఎలా అనేఆలోచనలో నుంచి పుట్టిందే ఈ సరికొత్త ఫార్మాట్. సాధారణంగా రెడ్ బాల్ క్రికెట్‌లో నాలుగు ఇన్నింగ్స్‌లను ఐదో రోజుల పాటు ఆడుతారు. అయితే ఈ సరికొత్త ఫార్మాట్‌లో 80 ఓవర్లను నాలుగు ఇన్నింగ్స్‌లుగా విభజించి టి20 ఫార్మాట్ తరహాలో ఆడించనున్నారు. ఇరు జట్లు రెండు సార్లు బ్యాటింగ్ చేయడంతో పాటు బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఫార్మాట్‌కు టెస్ట్ ట్వంటీ అని నామకరణం చేశారు. ఈ నయా ఫార్మాట్‌ను ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మాథ్యూ హెడెన్, భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్‌తో పాటు, దిగ్గజ క్రికెటర్ సర్ క్లైవ్ లాయిడ్ ఆవిష్కరించారు. ఈ ఫార్మాట్ సరికొత్తగా ఉంటుందని, ఈ ఛాంపియన్‌షిప్ తొలి రెండు ఎడిషన్స్ భారత్‌లోనే జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలి ఎడిషన్ జనవరి 2026లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

కాగా క్రికెట్‌ను మతంలా భావించే భారత్‌లోనే ఈ సరికొత్త ఫార్మాట్‌ను ప్రవేశపెట్టడం సరైందిగా తాము భావించామని ఈ ఛాంపియన్‌షిప్ నిర్వాహకుడు గౌరవ్ బహిర్వాణి తెలిపారు. ఈ ఫార్మాట్‌ను సక్సెస్ చేసిన తర్వాత విదేశాలకు విస్తరిస్తామని చెప్పారు. క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతోనే ఈ ఫార్మాట్‌ను రూపొందించామని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఫార్మాట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు బాగుందంటుంటే, మరికొందరు మాత్రం తప్పుబడుతున్నారు. ఇది టెస్ట్ క్రికెట్‌ను చంపడమేనని, ఈ ఫార్మాట్‌రాకతో టెస్ట్ క్రికెట్ పూర్తి చచ్చిపోతుందని హెచ్చరిస్తున్నారు. ఈ ఫార్మాట్‌కు సగం రెడ్, సగం వైట్ బాల్ ఉపయోగిస్తారా? అని సెటైర్లు పేల్చుతున్నారు. అయితే ఈ ఫార్మాట్‌కు ఐసిసి, క్రికెట్ దేశాల బోర్డుల ఆమోదం కానీ లేదు. సక్సెస్ అయితే భవిష్యత్తులో ఈ ఫార్మాట్‌కు ఐసిసి గ్రీన్ సిగ్నల్ ఇవ్వచ్చు.



# జోహోర్ కప్ ఫైనల్‌కు భారత్

## మలేసియాపై 1-2 తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్-2025లో మలేషియాపై విజయంతో భారత్ ఫైనల్‌కు చేరుకుంది. జోహోర్ బహ్రులో శుక్రవారం జరిగిన సుల్తాన్ ఆఫ్ జోహోర్ కప్ చివరి గ్రూప్ మ్యాచ్‌లో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు ఆతిథ్య మలేషియాతో తలపడింది. ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో, రెండవ క్వార్టర్‌లో గుర్జోత్ సింగ్ గోల్స్‌తో, ఆ తర్వాత రోషన్ కుజుర్ చివరిలో గెలిచిన గోల్స్‌తో భారత్ మలేషియాను 2-1తో ఓడించింది. దీనితో భారతదేశం 5 ఆటలలో 10 పాయింట్లతో పూల్ దశను ముగించింది. ఫలితంగా సెప్టెంబర్ 18న ఆస్ట్రేలియాతో జరిగే టోర్నమెంట్ ఫైనల్‌కు భారత్ జట్టు అర్హత సాధించింది. భారత్ అర్ధభాగంలో తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లను పొందింది, కానీ ఒకదాన్ని మాత్రమే గోల్‌గా మార్చగలిగింది. రెండో క్వార్టర్‌ను దూకుడుగా ప్రారంభించిన భారత్ వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. కానీ మొదట మలేషియా గోల్ కీపర్, ఆ తర్వాత అరైజీత్ హుందాల్ డిఫెల్క్షన్ షాట్‌ను క్రాస్ బార్ తిరస్కరించారు. 22వ నిముషంలో గుర్జోత్ పెనాల్టీ కార్నర్ సేవ్ నుండి రీబౌండ్ ద్వారా భారత స్కోరింగ్‌ను ప్రారంభించి గోల్ చేయడంతో భారత్ 1-0 తో ఆధిక్యం సంపాదించింది. భారత డిఫెండర్లు తమ సర్కిల్‌ను క్లియర్ చేయలేకపోవడంతో మలేషియా వింగర్‌కు ప్రయోజనం చేకూర్చింది. 43వ నిముషంలో అతను అద్భుతమైన బేస్‌లైన్ పరుగుతో ఆపై గోల్ చేయడంతో 1-1తో స్కోరు సమం అయింది. 48వ నిముషంలో రోసన్ కుజుర్ గోల్ తో భారత్ 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

### 2008 తర్వాత పతకం సాధించిన

# తొలి అమ్మాయి తన్వి



**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో తన్వి శర్మ సంచలనం సృష్టించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో జపాన్‌కు చెందిన సాకి మట్సు మోటోను ఓడించి, 2008 తర్వాత ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో సింగిల్స్ పతకం గెలుచుకున్న తొలి భారతీయ అమ్మాయిగా పదహారేళ్ల తన్వి శర్మ నిలిచింది. 46 నిమిషాల పాటు జరిగిన మూడు గేమ్‌ల థ్రిల్లర్‌లో మొదటి సీడ్ అయిన తన్వి 13-15, 15-9, 15-10 తేడాతో జపనీస్ క్రీడాకారిణిని ఓడించింది. ఇప్పుడు కాంస్య పతకం ఖాయమైన తన్వి, గౌహతిలో జరుగుతున్న 2025 ఎడిషన్‌లో భారతదేశం యొక్క మొదటి పతకాన్ని కూడా నిర్ధారించింది. 2008లో పూణేలో జరిగిన ఎడిషన్‌లో సైనా నెహ్వాల్ స్వర్ణం సాధించిన తర్వాత ఇది భారతదేశానికి తొలి సింగిల్స్ పతకం కావడం విశేషం. కాగా ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో సింగిల్స్ పతకం గెలుచుకున్న భారతీయ అమ్మాయిల జాబితాలో అపర్ణ పోపట్ (వెండి, 1996, సిల్క్‌బోర్గ్), సైనా నెహ్వాల్ (రజతం, 2006, ఇంచియాన్), సైనా నెహ్వాల్ (స్వర్ణం, 2008, పూణే), తన్వీ శర్మ (కాంస్యం, 2025, గౌహతి).

## రంజీ ట్రోఫీలో కర్ణాటకపై

# సౌరాష్ట్ర ఆధిక్యం



**న్యూఢిల్లీ:** రంజీ ట్రోఫీ 2025-26లో సకారియా రియర్‌గార్డ్ వీరోచిత ప్రదర్శనతో కర్ణాటకపై సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఉంది. చేతన్ సకారియా, యువరాజ్‌సిన్హ్ దోడియా చివరి వికెట్‌కు 34 పరుగులు జోడించడంతో సౌరాష్ట్ర స్వల్ప ఆధిక్యంతో ముగిసింది. శుక్రవారం నిరంజన్ షా స్టేడియంలో జరిగిన గ్రూప్ బి రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో చివరి రోజు సౌరాష్ట్ర కర్ణాటకపై కీలకమైన నాలుగు పరుగుల తొలి ప్రారంభ ఆధిక్యాన్ని సంపాదించింది. సకారియా, యువరాజ్ సిన్హ్ దోడియా 14.3 ఓవర్లు ఉత్కంఠభరితంగా బ్యాటింగ్ చేశారు. కర్ణాటక బౌలర్లను ఈ జంట దృఢంగా ఎదుర్కొని క్రీజులో స్థిరంగా నిలబడ్డ మొదటి దశలో 36 పరుగులకు చేరుకుని జట్టు స్కోరును పెంచింది. అంతకుముందు, ఓవర్‌నైట్ బ్యాటర్లు అర్పిత్ వాసవాడ, ప్రేరక్ మన్కడ్ స్కోరును తగ్గించారు.

అయితే, శ్రేయస్ మన్కడ్ ముందుండి 66 పరుగుల ఐదవ వికెట్ భాగస్వామ్యాన్ని ముగించాడు. ఆ తర్వాత సమ్మర్ గజ్జర్ వాసవాడతో జత కలిసి స్కోరు బోర్డును ముందుకు తెచ్చాడు. కానీ శ్రేయస్ మళ్ళీ వాసవాడను అవుట్ చేసి 54 పరుగుల ఆరో వికెట్ భాగస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేశాడు. శ్రేయాస్ చేతిలో ధర్మేంద్ర జడేజా, జయదేవ్ ఉనద్కట్ ఎడమచేతి వాటం స్పిన్నర్ శిఖర్ శెట్టి చేతిలో ఔటయ్యారు. దీనితో సౌరాష్ట్ర ఎనిమిది వికెట్లకు 318 పరుగులు చేయడంతో ఇంకా 54 పరుగులు వెనుకబడి ఉంది. దీనికి ప్రతిస్పందనగా, కర్ణాటక తన రెండవ ఆటలో ఒక వికెట్ నష్టానికి 89 పరుగులతో రోజును ముగించి ఆధిక్యాన్ని 85కి పెంచింది.

# జపాన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్ నుంచి ఒసాకా ఔట్



**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్‌లో టాప్ సీడ్ నవోమి ఒసాకా ఎడమ కాలు గాయం కారణంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నుండి వైదొలిగింది. జపాన్ ఓపెన్‌లో నెదర్లాండ్స్‌కు చెందిన సుజాన్ లామెన్స్‌తో శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన నవోమి ఒసాకా వైద్య నిమిత్తం విరామం కోరే ముందు నొప్పితో బాధప డింది. మొదటి రెండు సెట్లను లామెన్స్ తో విభజించిన తర్వాత, ఒసాకా మూడవ సెట్ లో 5-0 ఆధిక్యంలో నిలి చింది. కానీ లామెన్స్ 0-5 మరియు 30-15తో సర్వ్ చేస్తున్న ర్యాలీలో, ఒసాకా తన ఎడమ కాలులో స్పష్టమైన సమస్య ముందుకు వచ్చింది. లామెన్స్ బ్యాక్ హ్యాండ్ వైడ్ పంపినప్పటికీ, తదుపరి పాయింట్ తర్వాత మెడికల్ టైమ్ అవుట్ కోసం అభ్యర్థించడంతో ఆమె పాయింట్ గెలుచుకుంది. నాలుగుసార్లు మేజర్ విజేత అయిన ఒసాకా, పరిమితులతో కోర్టుకు తిరిగి వచ్చింది కానీ తన మూడవ మ్యాచ్ పాయింట్‌ను ముగించగలిగింది. మ్యాచ్‌కు ముందు ఆమె వైదొలగడం వల్ల జాక్వెలిన్ క్రిస్టియన్ వాకోవర్ పై సెమీఫైనల్ కు చేరుకుందని వరల్డ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రకటించింది. ఇక సెప్టెంబర్ చివరలో జరిగిన చైనా ఓపెన్‌లో ఒసాకా రెండో రౌండ్‌లోను, గత వారం వుహాన్ ఓపెన్‌లో కూడా రెండో రౌండ్‌లో ఓడిపోయింది. కాగా జపాన్ ఓపెన్‌లో శుక్రవారం జరిగిన మరో క్వార్టర్ ఫైనల్‌లో, 2021 యుఎస్ ఓపెన్ ఫైనలిస్ట్ లేలా ఫెర్నాండెజ్ 7-6 (2), 6-3 తేడాతో రెబెక్కా ష్రామ్‌కోవాను ఓడించింది.

# ఐటి రంగంలో 60వేల మందికి ఉద్వాసన..




**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** భారత ఐటీ పరిశ్రమలో మరోసారి లేఆఫ్స్ భూతం కోరలు చాస్తోంది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, ప్రాజెక్టుల కొరత, కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంతో దిగ్గజ కంపెనీలు సైతం ఉద్యోగులను తొలగించేందుకు వెనుకాడటం లేదు. ఈ ఏడాది చివరి నాటికి ఏకంగా 50,000 నుంచి 60,000 మంది ఐటీ ఉద్యోగులు తమ కొలువులు కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తుండగా, ఆ ప్రకంపనలు ఇప్పటికే దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో మొదలయ్యాయి.

పనితీరు బాగోలేదనే నెపంతో ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా టీసీఎస్ సుమారు 6,000 మంది ఉద్యోగులను అక్రమంగా తొలగించిందని ఐటీ ఉద్యోగ సంఘాలు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నాయి. పారిశ్రామిక వివాదాల చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘించి, ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగులను ఎలా తొలగిస్తారని కిటు, ఏఐటీఈ, యునైట్ వంటి ప్రముఖ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కంపెనీ ఇటీవల విడుదల చేసిన త్రైమాసిక ఫలితాల్లో ఉద్యోగుల సంఖ్య 19,755 మేర తగ్గింది. దీనిపై టీసీఎస్ సీహెచ్‌ఆర్‌వో సుదీప్ కున్నుమల్ స్పందిస్తూ సుమారు 6,000 మంది 'అసంకల్పిత తొలగింపు' కిందకు వస్తారని, ఇది వ్యాపార అవసరాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని సమర్థించుకున్నారు.

అయితే, టీసీఎస్ వాదనను ఉద్యోగ సంఘాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. ఇది 'అసంకల్పిత తొలగింపు' కాదని, పక్కా ప్రణాళికతో సాగిస్తున్న 'బలవంతపు, అనైతిక తొలగింపు' అని మండిపడుతున్నాయి. "ఉద్యోగులను అకస్మాత్తుగా ప్రాజెక్టుల నుంచి తప్పించి బెంచ్‌కు పంపుతున్నారు. అక్కడ కొన్ని గంటలు లేదా రోజుల్లోనే రాజీనామా చేయాలంటూ హెచ్‌ఆర్ విభాగం నుంచి తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. చివరకు ప్రసూతి సెలవులో ఉన్న మహిళా ఉద్యోగులను సైతం వదలడం లేదు. సెలవు పొడిగించాలని కోరితే, ఉద్యోగం నుంచి తీసేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు" అని సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ తొలగింపులపై వెంటనే విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేశారు. ఏడాది చివరికి మరింత తీవ్రం

టీసీఎస్‌లో మొదలైన ఈ కోతల పర్వం ఇతర కంపెనీలకూ విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. ప్రముఖ నియామక సంస్థ టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో నీతి శర్మ అంచనా ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో 25,000 మందిని తొలగించగా, ఈ ఏడాది ఆ సంఖ్య రెట్టింపు అయి 60,000కు చేరవచ్చు. ఇప్పటికే యాక్సెంచర్ ప్రపంచవ్యాప్తంగా 11,000 మందిని ఇంటికి పంపగా, టీసీఎస్ సైతం 2026 మార్చి నాటికి మరో 12,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోందన్న వార్తలు ఐటీ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. మొత్తం మీద, భారత ఐటీ రంగం అత్యంత గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోందని, రాబోయే రోజుల్లో పరిస్థితులు మరింత సవాలుగా మారబోతున్నాయని స్పష్టమవుతోంది.




# హిందూస్థాన్ జింక్ రాబడులు రూ.8549 కోట్లు

## అత్యధిక రాబడుల వాటా వెండి విభాగానిదే

**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** దేశవ్యాప్తంగా బంగారంతోపాటు వెండిధరలు కూడా ర్యాలీ తీయడంతో హిందూస్థాన్ జింక్ లాభాలు కూడా గణనీయంగా పెరిగాయి. వేదాంత గ్రూప్ ఆధ్వర్యంలోని గనుల కంపెనీ హిందూస్థాన్ జింక్ రెండోత్రైమాసికంలో రాబడులు 8549 కోట్లుగా ప్రకటించింది. ఒక్క వెండి పరంగానే 40శాతం లాభాల్లో వాటాతో ఉన్నట్లు చెపుతోంది. కంపెనీ నికరలాభం 2649 కోట్లుగా ఉంది. క్రమానుగతంగా 19శాతంపెరిగింది. రాబడుల్లో అత్యధిక వాటా వెండి సరఫరాదే. ఈ వాటా ఒక్కటే 1706 కోట్లవరకూ ఉంది. త్రైమాసికంవారీగాచూస్తే పదిశాతంపెరిగింది. పారిశ్రామిక, పెట్టుబడుల డిమాండ్‌పెరగడంతో 20శాతానికిపైబడింది. అందువల్లనే ఇపుడు గ్లోబల్‌సరఫరా కొరత వెండిమార్కెట్‌లో నెలకొంది. ఎంసిఎక్స్ వెండి ఫ్యూచర్స్ 70శాతంపెరిగింది. స్పాట్ మార్కెట్‌లోనే రెండు లక్ష లరూపాయలుగాకొనసాగుతోంది. కంపెనీ పన్నులచెల్లింపులకు ముందు మార్జిన్ 52శాతంగా వెల్లడించింది. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్‌తో కంపెనీకి మంచి వృద్ధి నమోదు అయిందని సిఇఒ అరుణ్‌మిశ్రా తెలిపారు. అంతరాజతీయ గనులు, ఖనిజాల మండలిలో హిందూస్థాన్ జింక్ చేరడంతో తమకు ఎంతో సానుకూలం అయిందన్నారు.

# మూడో రోజూ లాభాల్లోనే సెన్సెక్స్,నిఫ్టీ

## ఎఫ్ఎంసిజి, హెల్త్‌కేర్, కన్స్యూమర్ రంగాల మద్దతు



**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు వరుసగా మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. అమెరికా బాండ్ల రాబడులు పెరగడం, రూపాయి పటిష్టం కావడం, పండుగ సీజన్ రావడంతో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు కొనుగోళ్లు ముమ్మరంచేసారు. నిఫ్టీ 25,700 మార్కు దాటింది. ఎఫ్ఎంసిజి, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతు పెరిగింది. ఐటి మెటల్ కౌంటర్లు దిగువస్థాయిలోనే ముగిసాయి. నిఫ్టీ బ్యాంకు సూచీ రికార్డుస్థాయికి పెరిగింది. మేజర్ బ్యాంకుల త్రైమాసికాలు వెలువడుతుండటంతో బ్యాంకింగ్ సూచీ పెరిగింది. బిఎస్ఇ సెన్సెక్స్ 484.53 పాయింట్లు పెరిగి 83,951.19 పాయింట్లవద్ద ముగిసింది. నిఫ్టీ సూచీ కూడా 124.55పాయింట్లు పెరిగి 25,709.55 పాయింట్లవద్ద స్థిరపడింది. గడచిన మూడు ట్రేడింగ్ సెషన్లలోనూ సెన్సెక్స్ 2.34శాతం, నిఫ్టీ 2.24శాతం చొప్పున పెరిగాయి. మహీంద్ర 2.45శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.38శాతం, రిలయన్స్ 1.35శాతం సూచీలకు మద్దతుగా పెరిగాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.43శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ 0.49శాతం క్షీణించింది. బిఎస్ఇలో 1737 కంపెనీలషేర్లుపెరిగితే 2425 షేర్లు దిగజారాయి. 178 కంపెనీలు మాత్రం స్థిరంగా నిలిచాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు శుక్రవారం 88.03 వద్ద ముగిసింది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ డిసెంబరు ఐదునాటికి 1.32శాతం పెరిగి 131,570వద్ద సెటిల్ అయ్యాయి. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు 68 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 60.38 డాలర్లుగా కొనసాగింది. కంపెనీలపరంగా మహీంద్రా అండ్ మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, ఐటీసీ, హిందుస్తాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, టాటా స్టీల్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగాయి. వారంలో బీఎస్ఈ సెన్సెక్స్, నిఫ్టీ ఒక్కొక్కటి 1.7 శాతం పెరగ్గా.. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 2 శాతం పెరిగింది. మీడియా, ఐటీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.5 1శాతం తగ్గాయి. ఆటో, బ్యాంక్, హెల్త్‌కేర్, ఎఫ్ఎంసీజీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.5 నుంచి ఒకశాతం పెరిగాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి సానుకూలంగా ముగియగా జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హాంగ్ సెంగ్ నష్టాల్లో ముగిశాయి.

# కెవిబి నికరలాభం రూ.574 కోట్లు

**ముంబయి, అక్టోబరు 17:** కరూర్ వైశ్యాబ్యాంక్ రెండోత్రైమాసికంలో నికరలాభాలు 21శాతం పెంచుకని రూ.574 కోట్లునమోదుచేసింది. ప్రైవేటురంగంలోని ఈ బ్యాంకు నికరలాభం జులై త్రైమాసికంలో 474 కోట్లుగా మాత్రమే ఉంది. మొత్తం రాండులు 3320 కోట్లుగా ఉన్నాయి. కేటాయింఉలు కూడా రూ.274 కోట్లకు పెంచారు. ఏడాది క్రితం బ్యాంకు కేటాయింపుల విభాగానికి 180 కోట్లు మాత్రమే చూపించింది. కెవిబి త్రైమాసిక ఫలితాలుప్రకటించడంతో బ్యాంకు షేర్లు రూ.227.40 వద్ద స్థిరపడ్డాయి. అంతకుముందు బిఎస్ఇలో ముగింపు 0.46శాతంకంటే ఎక్కువే.

# 290 లక్షల ఫోర్డ్ కార్ల రీకాల్



**న్యూయార్కు, అక్టోబరు 17:** ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ ఫోర్డ్ అమెరికాలో 2.90 లక్షల కార్లను రీకాల్‌చేసింది. రేర్‌వ్యూ కెమేరా వ్యవస్థ చిత్రాలను స్పష్టంగాచూపించకపోవడంతో ఈకార్లన్నింటినీ రీకాల్‌చేసారు. తక్కువ వెలుతురున్న సమయాల్లో మరింత అస్పష్టంగా చిత్రాలున్నాయన్న ఫిర్యాదులు అందాయి. 2020- 2022 మధ్యకాలంలో ఉన్న ఎఫ్ 250, ఎస్‌డి, ఎఫ్350ఎస్డీ, ఎఫ్ 450 ఎస్డీ మోడల్ వాహనాలను రీకాల్ చేస్తున్నారు. హైవే సేఫ్టీ అడ్మినిస్ట్రేషన్ సేఫ్టీ రీకాల్ రిపోర్టులో వారంటీ సమాచారంపైనా కస్టమర్ ఫిర్యాదులు అందినట్లు తేలింది.

అయితేఫోర్డ్ కఠిన పరీక్షల నివేదికలో ఫిర్యాదుల పరంగా వచ్చిన అంశాలను పరిశీలించలేదు. ఆటోమేకర్ డీలర్లు ఇమేజ్ ప్రాసెసింగ్ మాడ్యూల్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తారని కంపెనీ ప్రకటించింది. 2026 మార్చి నాటికి మొత్తం సాంకేతిక లోపాలన్నింటినీ పరిష్కరిస్తామని కంపెనీ ప్రకటించింది.

# 100కోట్ల డాలర్లకు కోకాకోలా ఐపిఒ..




**న్యూఢిల్లీ, అక్టోబరు 17:** భారత్ బాట్లింగ్ యూనిట్లకోసం హిందూస్థాన్ కోకో కోలా బేవరేజెస్ కంపెనీ ఐపిఒకు వస్తోంది. ఇందు కోసం వందకోట్ల డాలర్లను సమీకరించేందుకు ఐపిఒకు వెళ్లాలనినిర్ణయించింది. భారత కంపెనీ విలువలను 10 బిలియన్ డాలర్లుగా మదింపుచేసారు. భారత్‌లో బహుళజాతి సంస్థల్లో అతిపెద్ద ఐపిఒగా నిలుస్తోంది. భారత్ మార్కెట్‌ను మరింతగా విస్తరించే లక్ష్యంతోనే ఈ ఐపిఒకు వస్తున్నట్లు చెపుతోంది. మొత్తం 12 రాష్ట్రాల్లో 14 ప్లాంట్లు ఉన్న కోకోకోలా 20 లక్షలమంది రిటైలింగ్ నెట్‌వర్క్‌తో కూడా నడుస్తోంది. ఐపిఒ వచ్చే ఏడాదే రావచ్చని అంచనా ఇందుకు సంబంధించి ఐపిఒ సైజు ఎంతమేర ఉండాలి, ఇష్యూధరలు వంటి వాటిపై కసరత్తులుచేస్తోంది. ఇటీవలికాలంలో బహుళజాతిసంస్థల ఐపిఒలు మార్కెట్‌కు వస్తున్న సంగతి తెలిసిందే. హుండై మోటార్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వంటివి ఉన్నాయి. హిందుస్తాన్ కోకోకోలా హోల్డింగ్స్‌లో మైనార్టీ వాటాను జుబిలియంట్ భర్తియా గ్రూప్‌కు విక్రయిస్తోంది. భాగస్వాములను కూడా పటిష్టం చేసుకునే లక్ష్యంతోనే ఐపిఒకు వస్తున్నట్లు తెలుస్తోంది. కనీ పెట్టుబడి, కనీస కొనుగోళ్ల బిడ్లు, షేర్ల కేటాయింపు, లిస్టింగ్ తేదీలు, లీడ్‌మేనేజర్లు ఏర్పాటువంటి వాటిపై ఫోకస్ పెంచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.